అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 25 -01-2019 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 27 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50

అమెరికాతో తెగదెంపులు

అంతర్గత వ్యవహారాల్లో జోక్యం తగదు

- 72 గంటల్లో యూఎస్ దౌత్యవేత్తలు వెనెజులా నుంచి వెళ్లిపోవాలి : మదురో
- ట్రంప్‌పై రష్యా, చైనా, టర్కీ ఆగ్రహం



వివరాలు 7లో

గోల్డ్ స్కాం



'80:20 బంగారం ఎగ్జిమ్ పథకం' పేరుతో దోచేశారు

- బులియన్ వర్గాల లాబీయింగ్‌తో భారీ కుంభకోణం
- దిగుమతి వెను వెంటనే ఎగుమతులతో మోసం
- ఖజానాకు రూ.2.65 లక్షల కోట్ల మేర భారీ నష్టం
- మోడీ వచ్చాక రికార్డు స్థాయిలో అక్రమ దిగుమతులు
- లబ్దిదారుల్లో అంబానీ, అదానీ, అమిత్ షా వర్గీయులు
- అత్యధికంగా గోల్డ్ దిగమతులు 'షా' సన్నిహితులవే!
- పార్లమెంటరీ కమిటీ విచారణలో నమ్మలేని వాస్తవాలు
- బంగారం సాకుతో అడ్డంగా దండుకున్నారు : కాగ్
- పరస్పరం విమర్శించుకుంటున్న ఎన్‌డీఏ, యూపీఏ

వివరాలు 9లో



అంబానీ నుంచి అమిత్‌షా వరకు..

వివాదాస్పదంగా మారిన '80:20 బంగారం ఎగుమతి-దిగుమతి పథకం'లోని కుట్ర కోణాన్ని, నష్టాన్ని అంచనా వేసేందుకు మూలాలను పరిశీలిస్తున్న పార్లమెంటరీ ప్యానెల్ విశ్లేషణలో ఈ మోసానికి సంబంధించి ఆశ్చర్యకరమైన వివరాలు వెలుగులోకి వస్తున్నట్టుగా తెలుస్తోంది. ఈ పథకాన్ని వాడుకొని దేశంలోని అతిపెద్ద కార్పొరేట్ దిగ్గజం రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీతో పాటు అదానీ వర్గీయుల, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా వర్గీయులు, గీతాంజలీ జ్యువెల్లర్స్ అధినేత చోక్సీ, విన్‌సమ్ డైమండ్స్ ప్రమోటర్ అదానీల దగ్గర బంధువు జితిన్ మెహతాలతో పాటు ఎస్.కె. జిందాల్‌కు చెందిన



(ఫైల్)

జిందాల్ డైకెమ్, ఎడిల్‌విజ్ కమోడిటీస్, ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ రిఫైనరీ సంస్థ రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్, ఎండీ ఓవర్‌సీస్, కనక్ ఎక్స్‌పోర్ట్స్, రిద్ధిసిద్ధీ బులియన్ ఎక్స్‌పోర్ట్స్ అత్యధికంగా బంగారాన్ని దిగుమతి చేసుకున్నట్టుగా తెలుస్తోంది. అమిత్‌షా కుమారుడు జై అమిత్‌షాతో దగ్గరి సంబంధం కలిగిన కుందన్ రైస్ మిల్స్, కంద్‌వాలా ఎంటర్‌ప్రైజెస్ ప్రమోటింగ్ సభ్యులతో పాటు దేశంలో అత్యంత శక్తిమంతులు, సంపన్నులుగా చెలామణి అవుతున్న వారి పేర్లు ఇందులో వినిపిస్తున్నాయి. ఈ పథకం ద్వారా లబ్ది పొందిన బ్యాంకుల జాబితాలో పంజాబ్ నేషనల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్‌తో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ఉన్నాయి. విశేషం ఏమిటంటే అమిత్‌షా కుటుంబంతో సంబంధం కలిగిన కుందన్ ...9లో

ఇస్రో మరో విజయం

నింగిలోకి కలాంశాట్-వీ2

- ప్రపంచంలోనే తేలికపాటి ఉపగ్రహం
- అంతరిక్షంలోకి పీఎస్ఎల్వీ-సీ44



న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) కొత్త ఏడాదిలో తొలి ప్రయోగాన్ని విజయంతో మొదలు పెట్టింది. భారత విద్యార్థులు తయారు చేసిన ప్రపంచంలోనే తేలికపాటి కలాంశాట్-వీ2ను వాహకనౌక పీఎస్ఎల్వీ-సీ44 ద్వారా అంతరిక్షంలోకి ఇస్రో శాస్త్రవేత్తలు పంపారు. గురువారం అర్ధరాత్రి 11.37 గంటలకు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్(షార్) నుంచి ఈ ప్రయోగాన్ని చేపట్టారు. ఈ ప్రయోగానికి 28 గంటల కౌంట్‌డౌన్ ప్రక్రియ బుధవారం రాత్రి 7.37 గంటలకే ప్రారంభమైంది. కౌంట్‌డౌన్ ముగియగానే నిర్ణీత సమయానికి పీఎస్ఎల్వీ అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. కలాంశాట్‌తో పాటు మైక్రోశాట్-ఆర్ ఉపగ్రహాలను మోసుకెళ్లిన వాహకనౌక.. కొంత సమయానికి వాటిని నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. నింగిలోకి ఎగిసిన 13 నిమిషాల తర్వాత 277 కిలోమీటర్ల ఎత్తులో మైక్రోశాట్ ఉపగ్రహం వాహకనౌక నుంచి విజయవంతంగా విడిపోయింది. ప్రయోగం విజయం కావడం పట్ల ఇస్రో శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. మైక్రోశాట్ ఉపగ్రహం బరువు 740 కిలోగ్రాములు. ఇది హై రెజెల్యూషన్ ఫోటోలను తీసి భూమిపైకి పంపించడం ద్వారా రక్షణ రంగానికి తోడ్పాటును అందించనున్నది. ఇక కలాంశాట్ బరువు 1.26 కేజీలు. కేవలం రూ. 12 లక్షలతో విద్యార్థులు దీనిని తయారు చేశారు. దీని కాల వ్యవధి రెండు నెలలు. కాగా, పీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 46వ ప్రయోగం. గతేడాది నవబరు 29న పీఎస్ఎల్వీ-సీ43 వాహకనౌక ద్వారా హైసిస్ శాటిలైట్‌ను ఇస్రో అంతరిక్షంలోకి ప్రయోగించిన విషయం తెలిసిందే.

ఆకాశ రామన్నల నుంచి 553 కోట్లు

జాతీయ పార్టీల ఆదాయంలో బీజేపీదే 80 శాతం వాటా





న్యూఢిల్లీ : ఆకాశ రామన్నల నుంచి(వివరాలు లేని వర్గాల నుంచి) స్వీకరించిన నిధుల్లో బీజేపీ ముందు వరుసలో నిలిచింది. దేశంలోని ఆరు జాతీయ పార్టీలకు 2017-18 ఆర్థిక సంవత్సరంలో సమకూరిన రూ.689.44 కోట్ల ఆదాయంలో బీజేపీ వాటానే 80 శాతం(రూ.553.38 కోట్లు) ఉండటం గమనార్హం. మిగిలిన జాతీయ పార్టీలతో పోలిస్తే ఒక్క బీజేపీ ఆదాయమే నాలుగు రెట్లు అధికంగా ఉన్నది. రూ.119.91 కోట్ల ఆదాయంతో కాంగ్రెస్ రెండో స్థానంలో ఉండగా.. బీఎస్పీ(రూ.10.67 కోట్లు), ఎన్‌సీపీ(రూ.5.37 కోట్లు)లు తర్వాతి వరుసలో ఉన్నాయి. జాతీయ పార్టీల ఐటీ రిటర్న్స్ ఆధారంగా అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) జరిపిన విశ్లేషణలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. రూ.20 వేల కంటే తక్కువ మొత్తంలోని విరాళాలు, ఎలక్టోరల్ బాండ్లు, సేల్ కూపన్ల ద్వారా నిధులు వస్తే దాతలైన వ్యక్తులు, సంస్థల వివరాలను పార్టీలు వెల్లడించాల్సిన అవసరం లేదు. ఈ నిధులను 'గుర్తు తెలియని, వివరాలు వెల్లడించని వర్గాల నుంచి వచ్చిన ఆదాయం'గా పరిగణిస్తారు. ఎలక్టోరల్ బాండ్లను కేంద్ర ప్రభుత్వం గతేడాది జనవరిలో ప్రవేశపెట్టింది. అయితే.. ఎలక్టోరల్ బాండ్ల ద్వారానే 31 శాతం ఆదాయం(రూ.215 కోట్లు) వచ్చింది. ఈ ఆదాయంలో బీజేపీ ...9లో

నేడు మలి విడత

3,342 పంచాయతీలకు పోలింగ్

- పోటీలో 10,668 మంది అభ్యర్థులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీలకు మలి విడత ఎన్నికలు జరనున్నాయి. రెండో దశలో 3,342 గ్రామ పంచాయతీలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగనున్నది. మొత్తం 4,137 సర్పంచ్ పదవులకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో 788 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మరో ఏడు సర్పంచ్ ...9లో

అడవి పంది దాడి..

ఇద్దరు మహిళలు మృతి

వివరాలు 9లో

రాజ్యాంగం అనుమతించదు

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ కోటాపై...

సుప్రీంకోర్టు న్యాయమూర్తి (రిటైర్డ్) జస్టిస్ చలమేశ్వర్



ముంబయి: సార్వత్రిక ఎన్నికల వేళ అగ్రవర్ణ పేదలకు దగ్గర కావడానికి మోడీ సర్కారు తీసుకొచ్చిన అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కోటాను రాజ్యాంగం అనుమతించదని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ అన్నారు. ముంబయిలో గురువారం జరిగిన 'రాజ్యాంగానికి ఏడు దశాబ్దాలు' కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చలమేశ్వర్ మాట్లాడుతూ.. ఆర్థికంగా పేదవారికి రిజర్వేషన్‌ను కల్పించే నిబంధనలేమీ రాజ్యాంగంలో లేవన్నారు. సామాజికంగా, విద్య పరంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్‌ను కల్పించేందుకు రాజ్యాంగానికి సవరణలు చేసేందుకు చట్టసభ్యులకు అవకాశం ఉన్నదని.. కానీ కేంద్రం తీసుకొచ్చిన విధంగా చేయడాన్ని రాజ్యాంగం అనుమతించబోదని తెలిపారు. ఈ విషయం కోర్టు పరిధిలో ఉన్నందున తీర్పు వచ్చే వరకు వేచి చూడాలన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఎలక్షన్ కమిషన్ ...9లో

ఐదుగురు డిఫెన్స్ అధికారులపై వేటు

రక్షణరంగ కార్మికులు సమ్మెలో ఉండగానే...

మోడీ సర్కారు నిర్ణయం

న్యూఢిల్లీ : మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా రక్షణ రంగ కార్మికులు సమ్మెకు దిగిన నేపథ్యంలో డిఫెన్స్ మంత్రిత్వ శాఖ ఆ శాఖ చెందిన ఐదుగురు అధికారులను తొలగించింది. సమ్మెకు దిగిన కార్మికులను భయపెట్టేందుకు ఈ ఎత్తును వేసిందని కార్మికులు ఆగ్రహిస్తున్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ డిఫెన్స్ కార్మికులు దేశవ్యాప్తంగా బుధవారంనాడు మూడు రోజుల సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. కాగా, డిఫెన్స్‌కు చెందిన ఐదుగురు ...9లో

లాసెట్, పీజీఈసెట్ తేదీల్లో స్వల్ప మార్పు

పకడ్బందీగా ప్రవేశ పరీక్షల నిర్వహణ

- పీజీ అడ్మిషన్లకు ఉమ్మడి పరీక్ష : ఉన్నత విద్యామండలి చైర్మెన్ పాపిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి చెప్పారు. లాసెట్, పీజీఈసెట్ పరీక్షల తేదీల్లో స్వల్ప మార్పులు ...9లో

కౌంటింగ్, పోలింగ్‌కు తేడా ఎందుకు?

ఓట్ల జాబితా సవరిస్తామని రజత్‌కుమార్ మాట తప్పారు

- ఇందిరాపార్కు ధర్నాలో ఉత్తమ్



హైదరాబాద్‌లో సీఈసీ రావత్ బోగస్ ఓటు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముందస్తు ఎన్నికల్లో ఓట్ల కౌంటింగ్, పోలైన ఓట్లకు తేడా ఎందుకు ఉందని టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఓట్లను సవరిస్తామని హైకోర్టుకు చెప్పి ఆ తర్వాత మాటతప్పారని మండిపడ్డారు. పోలింగ్, ఓటింగ్‌కు తేడా ఉన్నందువల్లే కాంగ్రెస్ పార్టీ వీవీ ప్యాట్ లెక్కించాలని కోరినా ఈసీ పట్టించుకోలేదన్నారు. రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అనుమానం ఉన్న చోట వీవీ ప్యాట్స్ లెక్కించారని చెప్పారు. ఓట్ల సవరణ చేయకుండా ఈసీ ఎన్నికలకు వెళ్ళింది నిజం కాదా అని ప్రశ్నించారు. స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించడంలో ఈసీ విఫలమైందన్నారు. గురువారం ఇందిరా ధర్నాచౌక్‌లో కేంద్ర ఎన్నికల సంఘం వైఫల్యాలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ధర్నా నిర్వహించింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి వచ్చే ఎన్నికల్లో బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహించాలని ధర్నాలో పాల్గొన్న నేతలు డిమాండ్ చేశారు. పదివేలలోపు మెజార్టీతో గెలిచిన చోట వీవీ ప్యాట్ల లెక్కించాలన్నారు. శాసనసభ ప్రతిపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈవీఎంలలో అవకతవకలు జరిగాయన్నారు. బ్యాలెట్ పేపర్‌తోనే ఈ అనుమానాలు ...9లో

ఎందుకిన్ని అబద్ధాలు?

రాఫెల్ కుంభకోణంపై బాంబులాంటి మరోవార్త బయటకొచ్చింది. దీనికి సంబంధించి తాజాగా 'ఫ్రెంచ్ సెనేట్ పత్రాలు' బయటకొచ్చాయి. అందులో ఉన్న సమాచారాన్ని బట్టి 'రాఫెల్ కుంభకోణం'పై మోడీ సర్కార్ కథల మీద కథలు చెబుతూ వెళ్తోందన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఒక అబద్ధం కోసం..మరో అబద్ధం. అబద్ధాన్ని నిజం చేయడానికి మరో అబద్ధాన్ని 'మోడీ సర్కార్' చెబుతోందన్న విమర్శలున్నాయి.....

పాత ఒప్పందం రద్దుపై సుప్రీంను తప్పదారి పట్టించిన వైనం

- హడావుడిగా 'రాఫెల్ డీల్' : ఫ్రెంచ్ సెనేట్ పత్రాల్లో బహిర్గతం
- రూ.34వేల కోట్లు చెల్లించాం..ఒక్క విమానమూ ఇంకా రాలేదు
- ప్రభుత్వరంగ తయారీ కంపెనీ 'హెచ్‌ఏఎల్'కు మాత్రం మొండి చేయి





అబద్ధం-1

126 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుపై యూపీఏ ఒప్పందాన్ని కాదని, ప్రధాని మోడీ ఏకపక్షంగా 10 ఏప్రిల్, 2015న పారిస్ పర్యటనలో కొత్త ఒప్పందాన్ని చేసుకొని వచ్చారు. పాత ఒప్పందం రద్దు ప్రక్రియ(రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ విత్‌డ్రాయల్) మార్చి, 2015 నుంచి ప్రారంభించి, 2015 జూన్ వరకల్లా పూర్తి చేసినట్టు సుప్రీంకోర్టుకు మోడీ సర్కార్ తెలియజేసింది. సుప్రీంకోర్టుకు మోడీ ప్రభుత్వం ఇచ్చిన ఈ నోట్‌పై ...9లో

ఒక సర్వే హంగ్ మరో సర్వే యూపీఏకు పట్టం

పార్టీ	2014	2019	సీట్లమార్పు
ఎన్డీఏ	336	237	-99
యూపీఏ	60	166	+ 106
ఇతరులు	153	140	-13



న్యూఢిల్లీ : 2019 సార్వత్రిక ఎన్నికల్లో హంగ్ ఏర్పడే అవకాశాలున్నాయని ఇండియా టుడే..కార్వీ ఇన్‌సైట్స్ సర్వేలో వెల్లడైంది. 'మూడ్ ఆఫ్ ది నేషన్ పోల్' పేరుతో చేసిన ఈ సర్వే ఫలితాల ప్రకారం.. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ)కి లోక్‌సభలో సీట్లు భారీగా తగ్గిపోయే అవకాశం ఉన్నది. ఆ కూటమికి 237 సీట్లు మాత్రమే వస్తాయి.అలానే యూపీఏకి 166, ఇతరులకి 140 సీట్లు వచ్చే అవకాశం ఉన్నది. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 272ని ఎన్డీఏ అందుకునే అవకాశాలు లేవు. 2014 కన్నా ఆ కూటమి 99 సీట్లను తక్కువగా వస్తాయని సర్వేలో తేలింది. యూపీఏ కంటే ఎన్డీఏకి ఒక్క శాతం కాస్త అధికంగా వస్తుంది. యూపీఏకి 2014 కన్నా 106 సీట్లు అధికంగా వస్తాయి.'మూడ్ ఆఫ్ ది నేషన్ పోల్' ప్రకారం.. ఎన్డీఏ 35 శాతం, యూపీఏ 33 శాతం ఓట్లు కైవసం చేసుకుంటుంది.

చాణక్య సర్వేలో యూపీఏకు అందలం

యూపీఏకు 295,ఎన్డీఏకు 248 సీట్లు వస్తాయని చాణక్య సర్వే వెల్లడించింది. గురువారం రోజున రెండు సర్వేలు వెల్లడికావటంతో.. ఎన్డీఏ, యూపీఏ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

కేరళ సీఎంపై కాంగ్రెస్ నేత వివాదాస్పద వ్యాఖ్యలు

- చివరకు క్షమాపణ



తిరువనంతపురం : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేత వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేరళ పునర్నిర్మాణంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపిస్తూ జిల్లా కలెక్టరేట్లవద్ద కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ బుధవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా కాసర్‌గొడ్ కలెక్టరేట్ వద్ద మాజీ ఎంపీ, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సుధాకరన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిపై తీవ్ర పదజాలాలతో విమర్శలు చేశారు. దీనితో ముఖ్యమంత్రి విజయన్ సమర్థవంతంగా పనిచేస్తారని భావించాం. కానీ, నేడు అసమర్థ సీఎంగా మిగిలిపోయారు. ఓ మగాడిలా పనిచేస్తాడనుకుంటే.. కనీసం మహిళలా కూడా పనిచేయడంలేదు' అంటూ కించపరిచేలా వ్యాఖ్యానించారు. గతేడాది వరద బీభత్సంతో అతలాకుతలమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించడంలో విజయన్ సర్కార్ తగిన శ్రద్ధ వహించలేదని, ఆయన పనితీరు సరిగా లేదని విమర్శించారు. కాగా ముఖ్యమంత్రి స్థాయిని దిగజార్చేలా, మహిళలను కించపరిచేలా ఉన్న ఆయన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో సుధాకరన్ క్షమాపణ చెప్పారు. 'ఎవరి మనోభావాలను దెబ్బతీయాలన్నది నా ఉద్దేశం కాదు. నా వ్యాఖ్యలు బాధించివుంటే అందుకు నేను క్షమాపణ చెబుతున్నా' అని సుధాకరన్ చెప్పారు.

'ఇటలీకి వెళ్లిపో'

సొంత నియోజకవర్గంలో రాహుల్‌కు రైతుల నిరసన



అమేథీ: కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు రాహుల్ గాంధీకి సొంత నియోజకవర్గం యూపీలోని అమేథీలో రైతుల నుంచి ఊహించని పరిణామం ఎదురైంది. రాజీవ్ గాంధీ ఫౌండేషన్ చేతిలో ఉన్న తమ భూములను వెనక్కి ఇచ్చేయాలని లేకుంటే తమకు ఉద్యోగాలైనా కల్పించాలని అక్కడి రైతులు రాహుల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాహుల్ ఇటలీకి వెళ్లిపోవాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనితో ఏం చేయాలో పాలుపోని రాహుల్.. ఒకింత అసహనానికి గురయ్యారు. ఎన్నికల ప్రచార ర్యాలీలో భాగంగా రాహుల్ గాంధీ సొంత నియోజకవర్గం అమేథీలో బుధవారం పర్యటించారు. ఇది తెలుసుకున్న రైతులు గౌరీగంజ్ నగరంలోని సామ్రాట్ సైకిల్ ఫ్యాక్టరీ(అమేథీ ఎంపీగా ఉన్నప్పుడు రాజీవ్ దీనిని ప్రారంభించారు) దగ్గర వారు నిరసనకు దిగారు. 'మేము రాహుల్‌పై చాలా అసహనంతో ఉన్నాం. ఆయన ఇటలీకి వెళ్లిపోవాలి. ఆయన ఇక్కడ ఉండటానికి అర్హత లేదు. రాహుల్ మా భూములను లాక్కున్నారు' అంటూ ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమంపై ఇటీవల ఎన్నికల ప్రచార ర్యాలీల్లో రాహుల్ ప్రస్తావిస్తున్నారు. ఈ సందర్భంలో రాహుల్‌కు సొంత నియోజవర్గ రైతుల నుంచి నిరసనలు ఎదురుకావడం కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలినట్టయ్యింది. 1980లో ఓ కంపెనీ కోసం కౌసర్ పారిశ్రామిక ప్రాంతంలో 65.57 ఎకరాల భూమిని జైన్ సోదరులు అక్కడి రైతుల వద్ద నుంచి తీసుకోవడానికి విఫలయత్నం చేశారు. అయితే అప్పటి యూపీఎస్ఐడీసీ 1986లో ఆ మొత్తం భూమిని కంపెనీకి లీజుకు ఇచ్చింది. కంపెనీ నష్టాలతో మూసివేయడంతో దానికి 2014లో వేలం నిర్వహించారు. అనంతరం ఈ భూమిని రాజీవ్‌గాంధీ చారిటబుల్ ట్రస్ట్ సొంతం చేసుకు న్నది. అయితే సామ్రాట్ సైకిల్ ఫ్యాక్టరీకి చెందిన ఆ భూమిని యూపీఎస్ఐడీసీకి తిరిగి ఇచ్చేయాలని గౌరీగంజ్ ఎస్‌డీఎం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి ఆ భూమి యూపీఎస్ఐడీసీకి చెందినదని పత్రాల మీద ఉన్నప్పటికీ అది ఇంకా రాజీవ్ గాంధీ ట్రస్ట్ చేతిలోనే ఉన్నది. ఇక అప్పటి నుంచి భూములు తమకు ఇచ్చేయాలంటూ రైతులు నిరసనలకు దిగుతున్నారు.

ఇద్దరి కన్నా ఎక్కువ సంతానముంటే ఓటు హక్కు రద్దు చేయాలి :

యోగా గురు రాందేవ్ బాబా

- ప్రభుత్వ ఉద్యోగాలూ ఇవ్వొద్దని వ్యాఖ్య

ఆగ్రా : జనాభా నియంత్రణ విషయంలో యోగాగురు రాందేవ్ బాబా మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇద్దరి కంటే ఎక్కువ సంతానమున్న వారి ఓటు హక్కును రద్దు చేయాలని ఆయన అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగాలకూ అనర్హులుగా ప్రకటించాలన్నారు. అంతేకాక.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలు కూడా కల్పించకూడదని అభిప్రాయపడ్డారు. హిందూ, ముస్లిం, ధనిక, పేద ఎవరైనా సరే.. అందరికీ ఈ సూత్రాన్ని వర్తింపజేస్తే జనాభా దానంతట అదే అదుపులోకి వస్తుందని చెప్పారు. జనాభా పెరుగుదలపై రాందేవ్ బాబా మాట్లాడటం ఇది తొలిసారేం కాదు.. గతేడాది నవంబర్‌లో ఆయన మాట్లాడుతూ.. తనలాగా పెండ్లి చేసుకోకుండా ఉన్న వారికి ప్రత్యేక గుర్తింపునివ్వాలని ప్రభుత్వానికి సూచించిన సంగతి తెలిసిందే.

గురుగ్రామ్‌లో కుప్పకూలిన భవనం

గురుగ్రామ్: హర్యానాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్థుల భవనం ఒకటి కూలిపోయింది. ఈ ఘటనలో ఆరుగురు మరణించగా, మరికొందరు శిథిలాల కింద చిక్కుకున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఘటన గురుగ్రామ్‌లో గురువారం చోటుచేసుకుంది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడటానికి జాతీయ, రాష్ట్ర విపత్తు దళాలతో పాటు భద్రతా దళాలను అధికారులు రంగంలోకి దించారు. కాగా సుమారు 20 మంది వరకు ఆ భవనంలో అద్దెకు ఉంటున్నట్టు అధికారి ఒకరు తెలిపారు. ఆరుగురు మృత దేహాలను ఇప్పటికే వెలికితీశామని మరో ఇద్దరు శిథిలాల కింద ఉన్నట్టు భావిస్తున్నామని తెలిపారు.

మోడీ విధానాలతో దేశం తిరోగమనంలోకి

జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు ఏఐకేఎస్ భారీ నిరసనలు

- జంతర్‌మంతర్ వద్ద ధర్నాలకు ఏర్పాట్లు
- కార్మిక, కర్షక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- ధర్నాలకు పలు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల మద్దతు : ఏఐకేఎస్ నేతలు హన్నన్ మొల్లా, ధావలే వెల్లడి



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

రైతు సమస్యలపై బీజేపీ సర్కారు తక్షణమే దృష్టి సారించాలని ఆలిండియా కిసాన్ సభ డిమాండ్ చేసింది. దేశంలో అన్నదాతలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, హన్నన్ మొల్లా ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రైతు పండించిన పంటలకు ధర నిర్ణయించే హక్కు బిల్లు, రుణాల నుంచి కర్షకులకు స్వేచ్ఛ కల్పించే బిల్లులను ఆమోదించాలని సూచించారు. జనవరి 30, ఫిబ్రవరి 7వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ఆందోళన నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు గురువారం ఏఐకేఎస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అశోక్ దావలే, హన్నన్ మొల్లా మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో రైతు సమస్యలే ప్రధాన అజెండా కావాలన్నారు. దేశంలోని అన్నదాతలు తమ సమస్యలపై గొంతెత్తుంటే, మరోవైపు రైతాంగ ఉద్యమాలను పక్కదోవపట్టించేందుకు సంఘపరివార్ కుట్రలు పన్నుతుందని విమర్శించారు. రామమందిరం, శబరిమల వంటి ఘటనల్లో ప్రజలను రెచ్చగొట్టడమే అందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. తమ పోరాటానికి ఎక్స్ సర్వీస్‌మెన్, ఆదివాసీ సంఘం, దళిత్ మంచ్, మహిళా లోకం మద్దతిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు, జర్నలిస్టులు, ప్రొఫెసర్లు, డాక్టర్లు, మేధావులు, రచయితులు సైతం సంఘీభావం తెలుపుతున్నారని పేర్కొన్నారు. దేశంలో మోడీ సర్కార్ గద్దెనెక్కిన నాటి నుంచి ప్రజలపైన, రైతులపైన తీవ్రమైన దాడి జరుగుతుందని పేర్కొన్నారు. నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు జరిగాయని తెలిపారు. 2013 భూసేకరణ చట్టంపై ఆర్డినెన్స్ తీసుకొచ్చి బీజేపీ సర్కారు రైతులపై దాడి ప్రారంభించిందన్నారు. 2014 ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైన మోడీ సర్కారు రామమందిరాన్ని ఎన్నికల అజెండా వినియోగించుకుంటుందని విమర్శించారు.

అయితే, తమకు మాత్రం రైతుల సమస్యలే ఎన్నికల అజెండాని వివరించారు. ఎక్స్ సర్వీస్‌మెన్ సాబీర్ సింగ్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వాన్ని నమ్ముకున్న ఏ వర్గమూ నేడు ఆనందంగా లేదన్నారు. జై జవాన్ జై కిసాన్ నినాద స్ఫూర్తితో తాము ఉద్యమంలోకి వచ్చినట్టు తెలిపారు. అయితే, నేడు దేశంలో రైతు, సైనికుడు బాధలో మునిగిపోతున్నట్టు ఆందోళన వ్యక్తం చేశారు.

ఏ రోజు... ఏ కార్యక్రమం..

- జనవరి 30వ తేదీన భారత త్రివిధ దళాలకు చెందిన ఎక్స్ సర్వీస్‌మెన్, యుద్ధంలో మరణించిన జవానుల భార్యలు ఆందోళనలో పాల్గొంటారు.
- జనవరి 31వ తేదీన ఆదివాసీ, దళిత సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తారు. ఎస్సీ, ఎస్టీ చట్టం నిర్వీర్యం చేయడంపై నిరసన కార్యక్రమాలు
- ఫిబ్రవరి 1వ తేదీన రైతులు, కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ధర్నా జరుగుతుంది.
- ఫిబ్రవరి 2వ తేదీన చిట్‌ఫండ్ స్కాం బాధితులు హర్తాళ్ నిర్వహించారు.
- ఫిబ్రవరి 3వ తేదీన పౌర సమాజం కార్యకర్తలు నిరసన చేపడతారు.
- ఫిబ్రవరి 4వ తేదీన ఆధార్ ద్వారా నిఘా పెంచడం, పర్యావరణ పరిరక్షణ కార్యకర్తలు ధర్నా చేస్తారు.
- ఫిబ్రవరి 5వ తేదీన మహిళా రిజర్వేషన్ బిల్లుపై మహిళా సంఘాల పోరాటం
- ఫిబ్రవరి 6వ తేదీన విద్యా రంగ సమస్యలపై విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాల పోరు.
- ఫిబ్రవరి 7న రాజ్యాంగ సంస్థలపై దాడికి నిరసనగా రాజకీయ పార్టీలతో భారీ సమావేశం.

ఎస్ఎఫ్ఐ కృషి భేష్

స్టూడెంట్ స్ట్రగుల్ వెబ్ పోర్టల్ ప్రారంభించిన ఏచూరి



నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో:

విద్యార్థి ఉద్యమాల్లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కీలక పాత్ర పోషిస్తుందని సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కొనియాడారు. దేశంలో తిరోగమన శక్తులు అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగంపై దాడులు మరింత అధికమయ్యాయని ఆయన అభిప్రాయపడ్డారు. గురువారం ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యాలయంలో స్టూడెంట్ స్ట్రగుల్ వెబ్ పోర్టల్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏచూరి పాల్గొని వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను విద్యార్థి ఉద్యమాల ద్వారానే రాజకీయాల్లోకి వచ్చానని గుర్తు చేశారు. విద్యార్థి దశలో నిర్మిం చే పోరాటాలు దేశ భవిష్యత్‌ను నిర్ధారిస్తాయని తెలిపారు. విద్యా కాషాయీకరణపై పోరాడాలని ఎస్ఎఫ్ఐ నేతలకు ఉద్బోధించారు. విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు నిర్మించాలని సూచించారు. స్టూడెంట్ యూనియన్లు నిర్వహించే ఏ పోరాటానికైనా తాము మద్దతిస్తామని చెప్పారు. ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మయూక్ బిశ్వాస్ మాట్లాడుతూ స్టూడెంట్ స్ట్రగుల్ ద్వారా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విద్యా రంగానికి కేటాయిస్తున్న నిధులు, యూనివర్సిటీల్లో జరుగుతున్న అవకతవకలపై గళమెత్తుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ వివక్షతను ప్రజల్లోకి తీసుకెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు వీపీ సాను, స్టూడెంట్ స్ట్రగుల్ నితేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.13 రుణమాఫీ

మధ్యప్రదేశ్‌లో రైతులకు సర్కార్ షాక్

భోపాల్ : మధ్యప్రదేశ్ ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రుణమాఫీ పథకం 'జై కిసాన్' అమలు తీరుతో రైతులు షాక్‌కు గురవుతున్నారు. తమ పేరు మీద వచ్చిన మాఫీ మొత్తాన్ని చూసి వారు విస్తు పోతున్నారు. రుణమాఫీ లబ్దిపొందేందుకు దరఖాస్తులు సమర్పించే సమయంలో అగర్‌మాల్వా గ్రామానికి చెందిన రైతులు శివనారాయణ్, శివపాల్, ఇతర ప్రాంతాల రైతులకు ఈ పరిస్థితి ఎదురైంది. తమకు వచ్చిన రూ.13 మాఫీని చూసి వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వీరిద్దరూ బ్యాంకుల్లో రూ.20 వేలకు పైగా రుణం తీసుకున్నారు. అయితే ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకూ రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. అదే విధంగా ముఖ్యమంత్రి కమల్‌నాథ్ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో కూడా ఇటువంటి ఘటనలు ఉన్నాయి.

భారత్‌కు సమస్యగా ప్లాస్టిక్

- రోజుకు 26వేల టన్నుల వ్యర్థాలు విడుదల : సీపీసీబీ అధ్యయనం



న్యూఢిల్లీ: భారత్‌లో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరిగిపోతున్నది. ప్లాస్టిక్‌ను నిర్మూలించాలంటూ ప్రభుత్వాలు, అధికారులు ఎన్ని ప్రచారాలు చేసినప్పటికీ ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నది. మన దేశంలో రోజుకు ఏకంగా 25,940 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు విడుదలవుతున్నాయట..!. ఈ విషయం కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు(సీపీసీబీ) నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. భారత్‌లో విడుదలవుతున్న మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాల్లో.. 40శాతం(10,376 టన్నులు) తిరిగి సేకరణ జరగకపోగా.. అది కాస్తా మురుగు కాలువలు, నదుల్లో కలుస్తున్నాయి. అలాగే దేశంలో ప్రధాన నగరాలైన ఢిల్లీ(689టన్నులు), చెన్నై(429), కోల్‌కతా(425), ముంబయి(408) , బెంగళూరు(313) లలోనే రోజుకు ఏకంగా 50శాతానికి పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు విడుదలవుతున్నాయని అధ్యయనంలో తేలింది. ఈ విషయంలో హైదరాబాద్(199 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల విడుదల) ఏడోస్థానంలో ఉన్నది. భారత్‌లోని 60 ప్రధాన నగరాల్లో సీపీసీబీ ఈ అధ్యయనం చేయగా.. వాటిల 4,059 టన్నుల(దాదాపు ఆరో వంతు) ప్లాస్టిక్ వ్యర్థాలు వెలువడుతున్నట్టు తేలింది. ఈ విధంగా ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుండటంతో అదికాస్తా ప్రజలతో పాటు జంతువులు, ఇతర జలచరాలో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి.

ప్రభుత్వాస్పత్రి గెంటేసింది..

- రోడ్డుపైనే ప్రసవం
- యూపీలో ఆరునెలల్లో రెండో ఘటన



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వాస్పత్రుల తీరుకు ఈ ఘటన అద్దం పట్టింది. పురిటి నొప్పులతో వచ్చిన గర్భిణీని ఆస్పత్రిలో చేర్చుకోకుండా గెంటేశారు.. చివరకు ఆస్పత్రి బయట రోడ్డుపైనే ఆ మహిళ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని జాలౌన్ జిల్లాలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్ళితే.. గర్భిణీని తొలుత ప్రాథమిక వైద్య కేంద్రానికి తీసుకెళ్లారు. అయితే.. మూడు రోజుల తర్వాత తీసుకురండంటూ ఆమెను వెనక్కి పంపించారు. కాగా, ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో జాలౌన్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడా గర్భిణీకి సేవలందించేందుకు నిరాకరిస్తూ.. సిబ్బంది ఆమెను ఆస్పత్రిలో చేర్చుకోలేదు. ఆమె బంధువులు ఎంతా చెప్పినా వినకుండా బయటకు పంపేశారు. దీంతో ఆస్పత్రి బయట రోడ్డుపక్కనే ఆ మహిళ ప్రసవించింది. అక్కడే ఉన్న కొందరు మహిళలు అప్రమత్తమై ప్లాస్టిక్ షీట్లతో ఆమె చుట్టూ కవర్ చేసి రక్షణగా నిలబడ్డారు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు రావడంతో ఆస్పత్రి సీనియర్ అధికారి స్పందించారు. ఈ ఘటనకు కారణమైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ బిఎం ఖారే తెలిపారు.

బాలలే రోల్ మోడల్ : ప్రధాని

న్యూఢిల్లీ : రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు ఎన్నికైన బాలలందరూ సమాజానికి రోల్ మోడలని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. బాలపురస్కార్‌కు ఎంపికైన బాలలకు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మోడీ అవార్డులు అందజేసి, అభినందించారు. బాలలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. కేంద్రమంత్రి మేనకాగాంధీ నేతృత్వంలోని జాతీయ ఎంపిక కమీటీ అభ్యర్థుల నివేదికను తయారు చేసింది. ఈ కార్యక్రమంలో నూతన ఆవిష్కరణలకు ఆరు, మూడు స్కాలరిస్ట్ అవార్డులు, ముగ్గురికి సామాజిక సేవకు గాను అవార్డులను బహూకరించారు. ఆర్ట్ అండ్ కల్చర్‌లో ఐదుగురికి, క్రీడలలో ఆరుగురికి, ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు ముగ్గురికి ఈ పురస్కారం కింద సత్కరించారు. బాలశక్తి పురస్కార్ కింద మొత్తం 783 దరఖాస్తులందాయి.

3న కోల్‌కతాలో లెఫ్ట్ పార్టీల ర్యాలీ

న్యూఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ సర్కార్, రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్‌లు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 3న కోల్‌కతాలో వామపక్ష పార్టీలు భారీ ర్యాలీని నిర్వహించనున్నాయి. కోల్‌కతలోని బ్రిగేడ్ పరేడ్ మైదానంలో తలపెట్టిన ఈ ర్యాలీకి సీపీఐ(ఎం), సీపీఐతో పాటు వామపక్ష భావజాలం కలిగిన పార్టీలు హాజరుకానున్నాయి. వారం రోజుల క్రితం ఇదే మైదానంలో తృణముల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ భారీ సభను నిర్వహించిన విషయం తెలిసిందే.

9వ జాతీయ ఓటర్ల దినోత్సవం 2019



శ్రీ సునీల్ అరోరా
భారత ఎన్నికల అధికారి

సందేశం

9వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా, దేశంలోని పౌరులందరినీ, 18 సం॥లు నిండి ఓటర్లుగా నమోదు చేసుకోబోతున్న వారందరికీ నా శుభాకాంక్షలు. యుక్త వయస్సు రాగానే ఓటు హక్కును మన పవిత్ర రాజ్యాంగ కర్తలు, అర్హులైన భారతీయ పౌరులందరికీ కల్పించారు. భారత ఎన్నికల సంఘంగా మేము దానిని మీకందించడానికి ఎంతో కృషి చేస్తున్నాం.

యావత్ దేశమంతటా 17వ లోక్‌సభ ఎన్నికలకు, ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ ఎన్నికలకు సిద్ధమవుతోంది. మేము కూడా దేశంలోని 87 కోట్లపైగా ఓటర్లకు, 10 లక్షల పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

జాతీయ ఎన్నికల్లో మొదటి సారిగా మిల్లెనియల్స్ మా అంబాసిడర్స్‌గా పాలుపంచుకుంటున్నారు. దీనికి వారి కుటుంబసభ్యులు సైతం సహకరిస్తారని ఆశిస్తాము. ఈ ఎన్నికల్లోనే కాక, రాబోయే అన్ని ఎన్నికల్లోనూ పాలు పంచుకుంటారని భావిస్తున్నాము.

ఎక్కువ మంది ఓటింగ్‌లో పాలు పంచుకుంటే, అదే ధృడమైన ప్రజాస్వామ్యానికి పునాది. మేం, భారతీయ కమీషన్‌లో **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అన్న ప్రధాన లక్ష్యంతో కృషి చేస్తున్నాం.

మాకు ఈ రోజు ఎంతో కీలకమైన రోజు. 25 జనవరి, 1950న భారత ఎన్నికల సంఘం స్థాపించబడిన రోజు. ఈనాడే పటిష్ట భారత ప్రజా స్వామ్య వ్యవస్థ సుస్థాపితమైన రోజు. దేశంలో అద్భుత ప్రజాస్వామ్య వారసత్వాన్ని చాటిచెబుతూ, ఎటువంటి భయభ్రాంతులు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నాటి నుండి విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

మా లక్ష్యం - ప్రతి ఎన్నికలను ప్రతి ఒక్కరికీ మరింత చేరువ చేయడమే. ఓటరుతో స్నేహపూర్వకంగా, పారదర్శకంగా మెలగడమే. ఈ దిశగా మేము ఎన్నో చర్యలు చేపట్టాం. ఎన్నికల ఆఫీసును చేరువ చేసి, సకల సమాచారం, సహకారం కోసం - ఓటర్ హెల్ప్‌లైన్ నెం: 1950 అందించాం. ఇదే నెంబర్‌పై ఎస్ఎమ్ఎస్ సేవలు ఫోన్ ద్వారా పంపిస్తున్నాం. ఆన్‌లైన్ ఓటర్ సేవలను ఫోన్ ద్వారా అందిస్తున్నాం.

భారత ఎన్నికల సంఘం తరఫున, నేను దేశంలోని ఓటరులందరినీ తమ పవిత్రమైన ఓటుహక్కు వినియోగించుకోవలసిందిగా మనవి చేస్తున్నాను. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి భయం, ఆందోళన, లంచాలకు లొంగక భారత ప్రజాస్వామ్యాన్ని గెలిపించవలసిందిగా కోరుతున్నాను. ఇది 5 సంవత్సరాలకు ఒకసారి వచ్చే అద్భుత అవకాశం మీరు కోరుకున్న వారు మీ తరఫున లోక్‌సభలో నిలుస్తారు. అందుకే నేడే ఓటర్‌గా నమోదు చేసుకోండి.

మరోక్కసారి, జాతీయ ఓటర్ల దినోత్సవం 2019 తరఫున దేశంలోని ప్రజలందరికీ మన స్ఫూర్తిగా నా శుభాభినందనలు అందజేస్తున్నాను.

జై హింద్

"ఎలక్షన్ కమీషన్ 25 జనవరి తన సంస్థాపన దినోత్సవంగా **'జాతీయ ఓటర్ల దినోత్సవం'** గా జరుపుకుంటోంది. 2011 జనవరి 25 నుంచి ప్రతీ సంవత్సరం ఇలా జరుపుకోంటోంది. ఏ ఓటరు తన హక్కును కోల్పోకూడదు అనే లక్ష్యంతో ఈ రోజు 9వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించబడుతోంది. చట్టం ప్రకారం ప్రతీ ఒక్కరికి ఈ హక్కును కల్పించుటలో పూర్తిగా వాస్తవరూపంలోకి తీసుకువచ్చుటకు మరియు భారత ప్రజాస్వామ్య నాణ్యతను పెంపొందించుటకు ఈ సందర్భాన్ని ఉపయోగిస్తూ ఓటర్ల నమోదు ప్రక్రియను పెంపొందించు లక్ష్యంతో కమీషనర్ ఉన్నారు. తెలంగాణలో పోలింగ్ స్టేషన్ల ప్రదేశాలన్నింటి వద్ద కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద నూతనంగా నమోదైన ఓటర్లు నూతన పివిసి కలర్ కార్డుతో పాటు లోగో మరియు **"Proud to be a voter – Ready to Vote"** నినాదం కలిగి ఉంటారు."

తెలంగాణ వ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

తెలంగాణ సుస్థిర మరియు క్రియాశీల ప్రభుత్వం కలిగిన వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం, ఇది 2018 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా మార్గదర్శకంగా నిలిచింది, ఒక్క సంఘటన కూడా లేకుండా ఎంతో ప్రశాంతంగా నిర్వహించబడినవి. ఈ పరపతి అంతా ఎలక్షన్ కమిషన్‌కు దక్కుతుంది, వారు ఎలక్షన్లను సవ్యంగా, సజావుగా నిర్వహించుటకు అవిశ్రాంతంగా పని చేశారు. గతంలోని ఓటర్ శాతం 69.5 శాతంతో పోల్చితే ఇప్పుడు 73.4 శాతమునకు పెరిగింది. ఎలక్షన్ కమిషన్ ప్రయత్నాలతో ఇది ఎంతో గొప్ప అభివృద్ధి, విజయంగా పేర్కొనవచ్చును.

ఇప్పుడు జాతీయ ఓటర్ల దినోత్సవం ఎంతో సంతోషంగా జరుపుకునే వేడుక **NVD**. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో వివిధ రకాల కార్యకలాపాలతో మరియు ఎంతో ఆసక్తి కలిగించే అంశాలతో నిర్వహించబడుతోంది. క్విజ్, వ్యాసరచన, మాక్ పార్లమెంట్, మహిళలకు రంగోలి పోటీలు, హై స్కూల్స్ సీనియర్ స్థాయిలో పోటీలు నిర్వహించబడతాయి. వీటిని అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద నిర్వహిస్తారు. మరియు విజేతలకు బహుమతులు మరియు సర్టిఫికేట్లు పంపిణీ ఉంటుంది. జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున తెలంగాణలో అన్ని విద్యాసంస్థలు/ప్రభుత్వ కార్యాలయాలలో **NVD** ప్రతిజ్ఞ చేయబడుతుంది. పోలింగ్ స్టేషన్, శాసన సభ నియోజకవర్గం, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో **NVD** కార్యక్రమాలకు హాజరయ్యే పౌరులందరూ కూడా ప్రతిజ్ఞ చేయవలసి ఉంటుంది.

జాతీయ ఓటర్ల దినోత్సవం
25 జనవరి
2019

భారతదేశ పౌరులమయిన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మనదేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామనీ, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు చేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము.



డా॥ రజత్ కుమార్ ఐ.ఎ.ఎస్
ప్రధాన ఎన్నికల అధికారి, తెలంగాణ

సందేశం


భారత ఎన్నికల సంఘం 25 జనవరిని తన సంస్థాగత దినోత్సవం రోజును 2011 నుండి ప్రతి ఏడాది జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం మీకందరికీ తెలుసు. ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశ్యం - ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, అర్హులైనవారందరినీ ఓటర్లుగా నమోదు చేయడం తద్వారా భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం. ఈ రోజు మనం 9వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అన్న ముఖ్యాంశంతో జరుపుకుంటున్నాం.

తెలంగాణ మొట్టమొదటి సాధారణ ఎన్నికలు డిసెంబర్ 2018లో ఎంతో ప్రశాంతంగా చక్కగా జరిగాయని తెలియజేస్తున్నాను. తెలంగాణ ఓటరు మహాశయులందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు సమర్పిస్తున్నాను. పోలింగ్ శాతం రాష్ట్రంలో చారిత్రాత్మకంగా 73.40% ముసు పెన్నడూ లేని విధంగా నమోదు అయ్యింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు గానీ, ఉద్రిక్తపరిస్థితులు, ఆందోళనలు, తలెత్తలేదు. రీపోలింగ్ జరగలేదు. వికలాంగులైన వారికి సైతం - కల్పించిన ప్రత్యేక వసతుల వలన పోలింగ్‌లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. వారి పోలింగ్ శాతం 70% వరకూ నమోదైంది.

లోక్‌సభకు ఎన్నికలు అతి తొందరలోనే రాబోతున్నాయి. దీనిలో మీ ఓటు హక్కును మీరు వినియోగించాలంటే ముందుగా మీ పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలి. ఓటర్ లిస్టులో పేరు లేకపోతే ఓటును వేయలేరు. ఓటర్ల జాబితాల సవరణ 1-1-2019 నుండి ప్రారంభమై, ఫిబ్రవరి 4వ తేదీ వరకు కొనసాగుతాయి. మీ దరఖాస్తులు సమర్పించడానికి ఇదే ఆఖరు తేది. తుది జాబితా 26.02.2019 న ప్రకటించబడుతుంది. 31 డిసెంబర్ 2018 నాటికి 18 సంవత్సరాలు నిండిన పౌరులందరూ ఓటు హక్కును పొందడానికి అర్హులు.

కనుక అర్హులైన పౌరులందరూ వెంటనే తమపేరు నమోదు చేసుకొని, రానున్న జాతీయ సార్వత్రిక ఎన్నికల్లో తమ విలువైన ఓటు హక్కును ఎటువంటి భయం, భీతి లేకుండా, కులం, మతం, ప్రాంతం, భాష లేదా లంచాలకు లొంగకుండా నిజాయితీగా వినియోగించుకోవలసిందిగా కోరుతున్నాను.

నేను మరొక్కసారి చేసే విన్నపమల్లా **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అనే భావన ఎన్నికల సంఘం వారి మహదాశయాన్ని నిజం చేసేందుకు మనందరం నిరంతరం కృషి చేద్దాం... ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందేలా, వినియోగించుకునేలా చూద్దాం !!



ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి

భారత ఎన్నికల సంఘం
https://eci.gov.in

ప్రధాన ఎన్నికల అధికారి,
తెలంగాణ

Voter Helpline
1950


సంపాదకీయం

సంపద కేంద్రీకరణ

'సంపన్నులను మరింత సంపన్నులుగాను పేదలను మరింత పేదలుగాను మారుస్తున్న వ్యవస్థ 'ఒక ధృవంవద్ద సంపద పోగు పడినప్పుడు అదే సమయంలో మరో ధృవంవద్ద పేదరికం, అజ్ఞానం, మానసిక దిగజారుడుతనం, బానిస చాకిరీ నరక యాతన, పశుత్వం పోగుపడతాయి' -కార్ల్ మార్క్స్- పెట్టుబడి మొదటి సంపుటి.

పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభావం గురించి 170సంవత్సరాల క్రితమే కార్ల్ మార్క్స్ చేసిన సూత్రీకరణలు నిత్యసత్యాలై మానవాళి ముందు సవాళ్లుగా నిలుచున్నాయి. అటువంటి సూత్రీకరణే మరోసారి ఆక్స్‌ఫాం నివేదిక రూపంలో బయటకు వచ్చింది. అదేమంటే ఒకవైపు దావోస్‌లో ప్రపంచంలోని కుబేరులు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశంలో పాల్గొంటుండగా మరోవైపు వారి చేతుల్లో సంపద ఊహాతీత స్థాయిలో చేరినందువల్ల సామాజిక అసమానతలు వేగంగా పెరుగుతున్నాయని ఆక్స్‌ఫాం ఇంటర్నేషనల్ ప్రకటించింది. గత సంవత్సరం విడుదల చేసిన ఆక్స్‌ఫాం నివేదిక ప్రకారం ప్రపంచంలోని శత కోటీశ్వరుల సంపద 900బిలియన్ డాలర్లు పెరిగింది. అంటే 12శాతం పెరిగింది. అదే సమయంలో ప్రపంచ జనాభాలో సగమైన 380కోట్ల ప్రజల సంపద 11శాతం తరిగింది. గత సంవత్సరం శత కోటీశ్వరుల సంపద రోజుకు 2.5బిలియన్ డాలర్లు పెరిగింది.

2008 సంవత్సరంలో సంభవించిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం తరువాత ఈ పదేండ్లలో కార్మికుల వేతనాలు స్తంభించాయి. చాలామంది వేతనాలలో కోతపడింది. వీటతోపాటు మిత వ్యయ విధానాన్ని అవలంబించటంవల్ల ఆరోగ్య, సామాజిక, తదితర సేవలు కుంటుపడ్డాయి. ఈలోపు సంపద కొందరి చేతుల్లోనే పోగుపడింది. అంతకుముందు సంవత్సరం 43మంది చేతుల్లో ఎంత సంపద ట ఉందో అంత సంపద గత సంవత్సరం 26మంది చేతుల్లోవుంది. ఈ సంపద ప్రపంచ జనాభాలో సగమైన 380కోట్ల మంది ప్రజల సంపదతో సమానం. ప్రపంచంలో అత్యంత ధనవంతుడైన అమెజాన్ యజమాని జెఫ్ బెజోస్ సంపద 112బిలియన్ డాలర్లు(దాదాపు 8లక్షల కోట్ల రూపాయలకు సమానం). 10.5కోట్ల మంది జనాభా గల ఇథియోపియా ఆరోగ్య సంరక్షణ కోసం హెచ్చించే మొత్తానికి ఈ సంపదలో కేవలం 1శాతం సమానమని ఆక్స్‌ఫాం పేర్కొంది. 1970లో సంపన్నుల మీద 62శాతం పన్ను ఉంటే 2013లో దాన్ని 38శాతానికి తగ్గించినట్టు ఆక్స్‌ఫాం కనుగొంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో వ్యక్తులపైన వేస్తున్న పన్ను కేవలం 28శాతం మాత్రమే ఉంది. బ్రిటన్, బ్రెజిల్ దేశాలలో కింది 10శాతం జనాభా నుంచి పై 10శాతం కంటే ఎక్కువ పన్ను వసూలు చేస్తున్నారని ఆక్స్‌ఫాం పేర్కొంది.



పన్ను ఎగవేత తీవ్రస్థాయికి చేరింది. పన్ను ఎగవేత కోసం అత్యంత సంపన్నులు 7.6ట్రిల్లియన్ డాలర్ల(1ట్రిల్లియన్ 7లక్షల కోట్ల రూపాయలకు సమానం) నగదు దాచారు. అలాగే కార్పొరేట్ కంపెనీలు పెద్దఎత్తున నగదు పన్ను ఆశ్రయాలు(టాక్స్ యావెన్స్)గా పేరొందిన దేశాలలో దాయటం జరుగుతోంది. దానితో అభివృద్ధి చెందుతున్న దేశాలు సాలీనా 170బిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోతున్నాయి. తత్ఫలితంగా సంపద మీద వేసే పన్ను ద్వారా వచ్చే ఆదాయం కేవలం 4శాతంగా మాత్రంగానే ఉంది. 2013వ సంవత్సరం నుంచి దారిద్ర్యాన్ని తగ్గించే శాతం సగమైంది. సహారా ఎడారికి దిగువన ఉన్న ఆఫ్రికా దేశాలలో పేదరికం తీవ్రంగా పెరుగుతోంది. 1980-2016 మధ్యకాలంలో ప్రపంచ ఆదాయ వృద్ధిలో ప్రపంచ జనాభాలోని అత్యంత పేదలుగా ఉన్న 50శాతం మంది ప్రజలకు ప్రతి డాలరుకు 12సెంట్లు వస్తే అత్యంత సంపన్నులైన పై1శాతానికి 27సెంట్లు వచ్చాయి. ఒక దశాబ్దం క్రితం ప్రపంచ ఆర్థిక సంస్థల మోసపూరిత కార్యకలాపాల కారణంగా ఏర్పడిన తీవ్ర ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో దావోస్‌లో సమావేశం జరిగింది. అయితే అలాంటి అరాచక ఆర్థిక కార్యకలాపాలకు పాల్పడినవారు న్యాయ విచారణ ఎదుర్కోకపోగా ఉద్దీపనలను అందుకున్నారు. ఆ తరువాతి దశాబ్ద కాలంలో వీరికి లక్షలాది కోట్ల డాలర్లను దోచిపెట్టటం జరిగింది. దానితో వీరి సంపద ఊహాతీత స్థాయిలో పోగుపడింది. బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం దావోస్ సమావేశంలో పాల్గొంటున్న 12మంది అత్యంత సంపన్నుల సంపద సమిష్టిగా 175బిలియన్ డాలర్లు పెరిగింది. అదే సమయంలో ప్రపంచంలోని అత్యంత సంపన్నుల సంపద 3.4ట్రిల్లియన్ డాలర్ల నుంచి 8.9ట్రిల్లియన్ డాలర్లకు పెరిగింది. ఈ అసమాన్య వృద్ధి వివరాలను బ్లూమ్‌బర్గ్ నివేదిక సవివరంగా అందజేసింది. ఉదాహరణకు ఒక దశాబ్దం క్రితం 3బిలియన్లుగా ఉన్న ఫేస్‌బుక్ అధినేత మార్క్ జూకర్‌బర్గ్ సంపద 55.6బిలియన్లు అయింది. అంటే 1853శాతం వృద్ధి చెందింది.

గత ఎనిమిదేండ్లుగా ఆక్స్‌ఫాంవంటి సంస్థలు ఎంతగా హెచ్చరించినా పాలకవర్గాలు అసమానతలను అరికట్టటానికి పూనుకోవటం లేదు. సంవత్సరాలు గడుస్తునకొద్దీ పరిస్థితి మరింతగా దిగజారుతోంది. ప్రయివేటు లాభాల, ఫైనాన్స్ మార్కెట్ల నియంతృత్వాన్ని అంతమొందించి కార్మికులు సృష్టించే సంపదను సమాజపరం చేయటం జరిగితేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అంతకుమించిన మార్గం మరొకటి లేదని చరిత్ర మనకు నిత్యం పాఠం చెబుతూనే ఉంది.

ప్రయివేటు లాభాల, ఫైనాన్స్ మార్కెట్ల నియంతృత్వాన్ని అంతమొందించి కార్మికులు సృష్టించే సంపదను సమాజపరం చేయటం జరిగితేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అంతకుమించిన మార్గం మరొకటి లేదని చరిత్ర మనకు నిత్యం పాఠం చెబుతూనే ఉంది.

ప్రజా పక్షం వహించేది వామపక్షమే...



సీతారం ఏచూరి

మహిళలను శబరిమల దేవాలయంలోకి అనుమతించే విషయంపై కేరళలో జరుగుతున్న వివాదం లోక్‌సభ ఎన్నికల్లో పార్టీపట్ల సానుకూల ప్రభావం చూపనున్నదని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభిప్రాయపడ్డారు. ఏచూరి ప్రతిపక్షాల ఐక్యత ఆయా రాష్ట్రాల ప్రత్యేకతలను బట్టి ఉంటుందన్నారు. అగ్రకులాల్లో పేదలకు 10 శాతం రిజర్వేషన్లు, భారత రాజకీయాల్లో వామపక్షాలు ప్రాధాన్యత కలిగిన శక్తులుగా ఇంకా ఎందుకున్నాయి వంటి అనేక సమకాలీన అంశాలపై ఏచూరి ది హిందూ పత్రిక ప్రతినిధి శోభనా కె నాయర్‌తో ముచ్చటించిన విషయాలు సంక్షిప్తంగా...

ది హిందూ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించటమే లక్ష్యమని గత సంవత్సరం సీపీఐ(ఎం) ప్రకటించింది. మరో వంద రోజుల్లో బీజేపీ ప్రభుత్వం పదవీ కాలం ముగుస్తుంది. మీ లక్ష్యాన్ని చేరుకోగలమనే నమ్మకం మీకుందా?

ఏచూరి : గట్టి విశ్వాసంతో ఉన్నాము. తాజా పరిస్థితి గమనిస్తుంటే 2004 లోక్‌సభ ఎన్నికలకు ముందు వంద రోజులు గుర్తొస్తున్నాయి. ఇప్పుడు కూడా బీజేపీ అవే వాదనలు ముందుకు తెస్తోంది. అప్పట్లో వాజ్‌పేయికి ప్రత్యామ్నాయం లేదనీ, వెలిగిపోతున్న భారత్ అనీ, సానుకూల స్పందన అనీ... 2003లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీ గెలిచాక లోక్‌సభ ఎన్నికల్లో కూడా గెలుపు మాదే అన్న రెట్టించిన విశ్వాసంతో ముందస్తు ఎన్నికలు ప్రకటించింది. ఏం జరిగిందో మనకు తెలుసు. నేడు కూడా అవే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వైవిధ్యభరితమైన మన దేశంలో వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు పార్టీలు వివిధ స్థాయిల్లో ప్రభావితం చేయగల శక్తులుగా ఉన్నాయి. ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సంకీర్ణాలన్నీ ఎన్నికల తర్వాతనే ఒక రూపాన్ని తీసుకున్నాయి. 1996లో యునైటెడ్ ఫ్రంట్ అయినా 1998లో వాజ్‌పేయి ప్రభుత్వం అయినా 2004లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అయినా. అందుకే బీజేపీని గద్దెదించాలన్న మా లక్ష్యాన్ని చేరుకోగలమన్న నమ్మకం ఉంది.

ది హిందూ : తాజాగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ నిర్వహించిన సభకు వామపక్షాలు హాజరు కాలేదు. మిగిలిన ప్రతిపక్షాలు హాజరయ్యాయి. ఈ నేపథ్యంలో సైద్ధాంతిక విభేధాలు వ్యక్తిగత ఆకాంక్షలు బీజేపీ వ్యతిరేక కూటమి ఏర్పాటు చేయటంలో అవరోధాలుగా ఉంటాయని భావిస్తున్నారా?

ఏచూరి : సైద్ధాంతిక విభేధాలు ఉంటాయి. వామపక్షాలు ఆ సభకు హాజరు కాలేదు. మాకు ఆహ్వానమే రాలేదు. మాకు ఆహ్వానం అందితే ఏమి చేయాలన్నది ఆలోచించి నిర్ణయించేవాళ్లం. బెంగాల్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉన్నామంటే కుదరదు.

ది హిందూ : మరి ప్రతిపక్ష ఐక్యత మాటేమిటి?

ఏచూరి : రాష్ట్రానికి రాష్ట్రానికి మారుతుంది. బీజేపీ వ్యతిరేక ఓట్లు సంఘటితం చేయాలన్నది మేము తీసుకున్న నిర్ణయం. బహుశా మిగిలిన లౌకిక పార్టీలు కూడా ఇదే సూత్రాన్ని పాటిస్తున్నాయి.

ది హిందూ : శబరిమల వివాదం ఎన్నికల్లో పార్టీపై ప్రతికూల ప్రభావం చూపుతుందని సీపీఐ(ఎం)లో పలువురు ఆందోళన చెందుతున్నారు. మీరేమంటారు ?

ఏచూరి : రాష్ట్రవ్యాప్తంగా 55 లక్షలమంది మహిళలు మానవహారంగా ఏర్పడటం చారిత్రక సందర్భం. రాష్ట్రంలో ప్రజలు ఏమి కోరుకుంటున్నారో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ సానుకూల ప్రభావం ఉంటుందని భావిస్తున్నాను.

ది హిందూ : శబరిమలలో మహిళల ప్రవేశాన్ని నిషేధించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. బీజేపీకీ, సీపీఐ(ఎం)కు మధ్య జరుగుతున్న పోరాటంలో కాంగ్రెస్ లబ్ది పొందుతుందా?

ఏచూరి : ఇది చాలా దురదృష్టకర పరిణామం. సీపీఐ(ఎం) దీన్ని ఖండిస్తోంది. బీజేపీ, బీజేపీ ప్రభుత్వం గురించి చెప్పాలంటే ట్రిపుల్ తలాక్ బిల్లు విషయంలో మహిళలు సమానత్వం కావాలంటోంది బీజేపీ, శబరిమల విషయంలో సాంప్రదాయం అంటోంది. ట్రిపుల్ తలాక్ బిల్లు విషయంలో ముస్లిం మత ఛాందసులు కూడా సాంప్రదాయాన్ని అడ్డు పెట్టుకుని వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెస్ తప్పుడు నిర్ణయం తీసుకుంది. ఈ రకమైన కప్పదాటు వైఖరితో ఎన్నికల్లో వాళ్లకేమీ ప్రయోజనం ఉండదు. లౌకికతత్వంతో ఆలోచించే ఓటర్ల నుండి (కాంగ్రెస్) పార్టీ దూరమవుతుంది.

ది హిందూ : అగ్రకులాల్లో ఆర్థికంగా వెనకబడిన వారికి 10శాతం రిజర్వేషన్ల బిల్లును సీపీఐ(ఎం) సమర్థించటం ఆశ్చర్యంగా ఉంది.

ఏచూరి : మండల్ వ్యతిరేక ఆందోళన సమయంలో ఈ సమస్య ముందుకొచ్చింది. వెనకబడిన కులాల్లో ఆర్థిక ప్రమాణం ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలని అప్పట్లో కోరిన పార్టీ సీపీఐ(ఎం) ఒక్కటే. ఎస్సీ/ఎస్టీలకు సంబంధించి రాజ్యాంగం స్పష్టంగానే ఉంది. ఈ విషయంలో రాజీ పడాల్సిన అవసరం లేదు. నిజంగా వెనకబడిన కులాల్లో అర్హులకు రిజర్వేషన్ ఫలాలు అందాలంటే ఆర్థిక ప్రాతిపదికన అమలు చేయాలని డిమాండ్ చేసిన పార్టీ సీపీఐ(ఎం) ఒక్కటే. ఈ విషయంలో మా వాదనకు మద్దతుగా నిలిచింది సుప్రీం కోర్టు ఒక్కటే. క్రీమీలేయర్‌ను లెక్కించటానికి ఓ ఫార్ములా సూచించింది. అప్పుడే ముందుకొచ్చిన మరో ప్రశ్న అగ్రకులాల్లోని పేదల సంగతి ఏమిటన్నది వారి ప్రయోజనాలు కాపాడే మార్గం కూడా పరిశీలించాలని సీపీఐ(ఎం) సూచించింది. కోటా బిల్లు తెచ్చిన తీరును సీపీఐ(ఎం) సమర్థించదు. ఈ బిల్లు వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుంది? ఆర్థిక వెనకబాటుతనాన్ని నిర్ధారించే ప్రమాణాలు, పద్ధతులు ఏమీ బిల్లులో లేవు.



పార్లమెంట్ చర్చలో రాలేదు. ఇది కేవలం ఎన్నికల్లో లబ్ది పొందటానికే అన్నది స్పష్టం. అయితే ఓ విధానంగా దీన్ని సానుకూలంగానే పరిగణించాలి.

ది హిందూ : కోటా చట్టాన్ని మరింత అర్థవంతంగా మార్చాలంటే మీరు సూచించే సవరణలు ఏమిటి?

ఏచూరి: తక్షణమే అర్హులను నిర్ధారించేందుకు ఓ యంత్రాంగం ఏర్పాటు చేయటం ప్రథమ కర్తవ్యం. ఈ చట్టాన్ని ఏ ఒక్క తరగతికో పరిమితం చేయకూడదు. పేదలందరికీ దీని ప్రయోజనం అందాలి. పేదలను నిర్ధారించే పద్ధతి ఏమిటి? గణాంకాలు తీయాలి. బీజేపీ పరిభాషలో చెప్పాలంటే ఇవన్నీ మాయమాటలే. ఉపాధి కల్పన లేకుండా రిజర్వేషన్లు కల్పించటం అర్థం లేని ప్రయాస. ఈ చట్టాన్ని అగ్రవర్ణాల్లోని పేదలకే పరిమితం చేయకుండా ఎస్టీ/ఎస్సీ/బీసీలకూ, ప్రైవేటురంగ నియామకాలకు వర్తింపచేయాలి. ప్రభుత్వం నిర్లక్ష్యంగా ప్రతిదీ ప్రైవేటుపరం చేస్తోంది. అన్ని ప్రభుత్వ శాఖలూ ఔట్‌సోర్సు ఉద్యోగులతో పని చేస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు దారుణంగా తగ్గిపోతున్నాయి. ఉద్యోగాలే లేనప్పుడు లేని ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఏమిటి?

ది హిందూ : కులప్రాతిపదికన ఉన్న రిజర్వేషన్లు రద్దుచేసి ఆర్థిక ప్రాతిపదికన అమలు చేయాలంటారా?

ఏచూరి: కాదు. కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించింది. సామాజికంగా ఆర్థికంగా వెలివేతకు గురైన వారిని ఆదుకోవటానికి రిజర్వేషన్లు ఓ సాధనం. ఇదేమీ దారిద్ర్య నిర్మూలన పథకం కాదు. ఈ రిజర్వేషన్లు ఉన్నప్పటికీ రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యాన్ని నేటికీ చేరుకోలేక పోయాము. కుల ప్రాతిపదికన అమలు జరుగుతున్న రిజర్వేషన్లకు మేము వ్యతిరేకం కాదు. అవకాశం ఉన్న చోట్ల ఆర్థికంగా వెనకబడిన వారికి కూడా వర్తింపచేయాలి.

ది హిందూ : 2019 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ(ఎం)కు ఎన్ని సీట్లు వస్తాయో ఏమన్నా చెప్పగలరా?

ఏచూరి : మేము పోటీ చేసే ప్రతి సీటూ గెలవానుకుంటాము. మాకు శక్తి కలిగిన సీట్లలోనే పోటీ చేస్తున్నాము.

ది హిందూ : త్రిపుర, బెంగాల్‌లలో మీ పార్టీ పరిస్థితి ఏమిటి ?

ఏచూరి : పరిస్థితులు త్రిపురలో వేగంగా మారుతున్నాయి. త్రిపుర స్థానిక ప్రజా సంఘటనకు బీజేపీకి మధ్య వైరుధ్యాలు పెరుగుతున్నాయి. బీజేపీ-ఐఎఫ్‌టీయూ అవకాశవాద సంకీర్ణాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. గిరిజనులకు ప్రత్యేక రాష్ట్రమని బీజేపీ వాగ్దానం చేసింది. ఇప్పుడు ఈ వాగ్దానం నుంచి బీజేపీ వెనక్కు తగ్గింది. గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అసెంబ్లీ ఎన్నికల నాటి కంటే పరిస్థితులు మెరుగ్గా ఉంటాయని ఆశిస్తున్నాము.

బెంగాల్‌లో మా ప్రజా పునాదిని ఓట్లుగా మార్చుకోవటం ప్రధాన సమస్యగా ఉంది. దీన్ని సాధించాలి. భయానక వాతావరణం కల్పించటం ద్వారా బెంగాల్‌లో మా ఓటర్లు దాడులను అధిగమించి పోలింగ్ స్టేషన్ దాకా రాలేకపోతున్నారు. శాంతియుతంగా ఎన్నికలు జరిగితే మా పరిస్థితి మరింత మెరుగుపడుతుందన్న నమ్మకం ఉంది.

ది హిందూ : లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ(ఎం) కొత్త ప్రాంతాల్లో విజయాలు సాధించే అవకాశం ఉందా?

ఏచూరి : తప్పని సరిగా. మా శతృవులుగా కూడా అంగీకరించే విషయం ఒకటుంది. కేవలం వామపక్షాలు మాత్రమే ప్రజల్ని సమీకరించి పోరాటాలు చేయగలుగుతున్నాయన్న వాస్తవాన్ని వామపక్ష వ్యతిరేకులు సైతం అంగీకరిస్తున్నారు. ఈ ఉద్యమాలను ఓట్ల రూపంలోకి మార్చుకోవాలి. మహారాష్ట్ర, రాజస్థాన్ వంటి పోరాట కేంద్రాల్లో మేము ముందడుగు వేసే అవకాశం ఉంది.

ది హిందూ : యుపీఎ తరహా పరిస్థితులు తలెత్తితే వామపక్షాల పాత్ర ఎలా ఉండొచ్చు?

ఏచూరి : అంతిమంగా ఏ రకమైన సంకీర్ణం ఆవిర్భవిస్తుందన్నది చూడాలి. దేశంలో ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వం ఏర్పాటును సాకారం చేసేందుకు, సంఘటితం చేసేందుకు వామపక్షాలు కృతనిశ్చయంతో ఉన్నాయి.

ది హిందూ: ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ వామపక్షాలు కొత్త ప్రభుత్వంలో భాగస్వాములైతే ఆధార్ చట్టం, దేశ ద్రోహ చట్టాలను ఉపసంహరించుకుంటాయా ?

ఏచూరి : ప్రభుత్వాల నిర్వహణలో వామపక్షాలకు గణనీయమైన పాత్ర ఉన్నప్పుడల్లా అనేక మంచి పనులు చేయటానికి ప్రయత్నం చేశాము. సమాచార హక్కు, ఉపాధి హామీ చట్టం, విద్యా హక్కు చట్టం, ఆహారభద్రత చట్టం వంటివి ఇందుకు ఉదాహరణ. ఆ రకమైన పాత్ర ఉంటే తప్పనిసరిగా ఇన్ని పొరపాట్లు జరక్కుండా చూడగలిగేవాళ్లము. దేశద్రోహ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. ఆధార్ చట్టం, వ్యక్తిగత గోప్యతలో చొరబాటు...దీన్ని చట్టపరంగా అడ్డుకుంటాము.

ది హిందూ : కమ్యూనిస్టు సిద్ధాంతం ఇప్పుడున్న కాలానికి ప్రాసంగికమైనది కాదన్న అభిప్రాయం ఉంది..

ఏచూరి : ప్రపంచంలో ఆర్థికంగా రెండో శక్తివంతమైన దేశమేది? చైనా. అక్కడ పాలక పార్టీ మార్క్సిజం, లెనినిజాన్ని నమ్ముతోంది. కమ్యూనిజం ప్రాసంగిక ప్రాధాన్యత కలిగి ఉంది కాబట్టే చైనా ఈ విధమైన ప్రగతి సాధించిందన్నది వాస్తవం. లాటిన్ అమెరికా వ్యాప్తంగా ఉన్న సోషలిస్టేతర దేశాల్లో వామపక్షాలు, వామపక్ష ప్రేరిత ఉద్యమాలే అమెరికా ఆధిపత్యాన్ని అడ్డుకుంటున్నాయి. ఫ్రాన్స్‌లో అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ చిట్టచివరకు కార్మికుల డిమాండ్ల ముందు తలొగ్గాల్సి వచ్చింది. ఒక వైపు మితవాదం కూడా పెచ్చరిల్లుతోంది. నయా ఫాసిస్టు రూపం తీసుకొంటోంది. జాతీయోన్మాదం దాడులు పెరిగాయి. మరో వైపు వామపక్షాల నేతృత్వంలో ప్రజా పోరాటాలు విస్తరిస్తున్నాయి. ఇది రాజకీయ పోరాటం. ఈ పోరాటాలు పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయంగా మారకుండా చూసేందుకే రాజకీయ మితవాదం ఓ సాధనంగా ముందుకొచ్చింది. అందువల్ల కమ్యూనిజం ప్రాధాన్యత కోల్పోయిందని చెప్పటం అర్థం లేని విషయం. రోజురోజుకూ కమ్యూనిజం ప్రాధాన్యత, ప్రాసంగికత పెరుగుతోంది. ఈ పోరాటం మన దేశంలో కూడా జరుగుతోంది.

ప్రయోగనాళికలో డార్విన్ సిద్ధాంతం




డాక్టర్ దేవరాజు మహారాజు

ప్రభుత్వాల పెద్దలు, పండిత శిఖామణులు, పీఠాధిపతులు, బాబాలు ప్రవచనకారులు ఇకనైన వారి ప్రయత్నం మానుకుంటే మంచిది. బల్లి శాస్త్రాలు మానేసి, అసలైన విజ్ఞాన శాస్త్రాలు అధ్యయనం చేస్తే బావుంటుంది. వారు గొప్పగా చెప్పకునేవన్నీ అసలు శాస్త్రాలు కానే కావని గుర్తుంచుకోవడం అంత కన్నా అవసరం. డార్విన్ తన ఆర్జిన్ ఆఫ్ స్పీసెస్ గ్రంథ ముగింపు వాక్యాలు ఇలా రాసుకున్నాడు. "సులభమైన, సరళమైన జీవరాసులే అనంతకాల గమనంలో అందమైన, అద్భుతమైన జీవులుగా రూపొందుతున్నాయి."

మనిషి కోతి నుంచి పరిణామం చెందితే ఇంకా కోతులెందుకున్నాయా ? జీవపరిణామం ఆగిపోయిందా ? ఇంకా కొనసాగుతూ ఉంటే మరి మనకు కనబడదేమిటి ? వంటి ప్రశ్నలు చాలా మంది అడుగుతుంటారు. విషయం తెలుసుకోవాలని ఆసక్తితో అడిగేవారికి జవాబు చెప్పొచ్చు. మూఢభక్తిలో మునిగిపోయి జీవపరిణామం మీద, వైజ్ఞానిక పరిశోధనల మీద గౌరవం లేక అపహాస్యం చేస్తూ అడిగేవారికి మనం ఎంత వివరించి చెప్పినా విషయం అర్థం చేసుకోరు. తలుపులు మూసుకుంటే వెలుగేరాదుకదా ? తలుపు తెరిచి గాలి వెలుతురును రానిస్తే, వాటితో పాటూ చాలా వస్తాయి. అలాగే మెదడు తెరచి ఉంచుకుంటే ఓ పిసరంత జ్ఞానం అందులోకి ప్రవేశిస్తుంది. మనిషే కాదు, ఒక చింపాజీ, ఒక తిమింగిలం ఇప్పుడున్న స్థితిని పొందడానికి కొన్ని బిలియన్ సంవత్సరాలుగా జరుగుతూ వచ్చిన జీవపరిణామమే కారణం. మానవ జీవితం చాలా చిన్నది. సుమారుగా 70-80 ఏండ్లు బతుకుతారని అనుకుంటే ఆ కొద్ది కాలంలో బిలియన్ సంవత్సరాలలో జరుగుతూ వచ్చిన పరిణామ క్రమాన్ని చూడలేరు కదా? మరి అలాంటప్పుడు జీవ పరిణామం జరుగుతూ వస్తోందని తెలుసుకోవడం ఎలా ? అంటే దొరికిన ఆధారాలను బట్టి, పరిశీలనలను బట్టి, పరీక్షలను బట్టి, ఆయా రంగాలలో కృషి చేస్తూ వస్తున్న శాస్త్రవేత్తల పరిశోధనలను బట్టి జీవపరిణామం యధార్థంగా జరుగుతూ వస్తోందని అర్థం చేసుకోవచ్చు. అందుకు తగిన నిర్ధారణలు కూడా జరిగాయి.

19, 20 శతాబ్దాలలో పరిశోధనారంగం కొత్త పుంతలు తొక్కింది. ఆ ఫలితాల ఆధారంగా ఈ 21వ శతాబ్దంలో జరుగుతున్న పరిశోధనలు తమ వేగం పెంచుకున్నాయి. విప్లవాత్మమకమైన, గుణాత్మకమైన ఫలితాలను సాధిస్తూ వస్తున్నాయి. బాహ్య ప్రపంచంలో ఉన్న వాతావరణాన్ని పరీక్ష నాళికలో (టెస్ట్ ట్యూబ్)లో ఏర్పరచి, ఒక జీవి పరిణామం జరగడానికి అన్ని అమరికలను చేసి పరిశీలిస్తే విషయం మరింత స్పష్టంగా అర్థమైంది. 'సెర్వైవల్ ఆఫ్ ద ఫిటెస్ట్' అని డార్విన్ తన సిద్ధాంతంలో ప్రతిపాదించాడు. అంటే ఏ జీవులైతే తమకు తాము మార్చుకుంటూ, అన్ని రకాల మార్పులను ఎదుర్కొని నిలబడుతాయో అవే విజయవంతంగా జీవించగలుగుతాయి అని అర్థం. ఎదురవుతున్న పరిస్థితులను ఎదుర్కొని నిలబడలేక తమను తాము మార్చుకోలేక ఉన్న జీవులు అనివార్యంగా నశించిపోవాల్సి వస్తుంది అన్నదే సారాంశం ! సామాజిక జీవనంలో కూడా మనం అదే చూస్తున్నాం. బతకనేర్చిన వాడు ఎలాగోలా దర్జాగా బతుకుతాడు. బతకలేనివాడు నానా అవస్థలు పడతాడు. లేదా ఆత్మహత్య చేసుకుంటాడు. సూత్రం అదే. ఈ ప్రపంచం మీద ఎన్నెన్నో జంతు వృక్ష జాతులు పుట్టాయి. పుట్టినవన్నీ అలాగే ఇప్పటిదాకా కొనసాగలేకపోయాయి. కొన్ని అంతరించి పోయాయి కూడా ! కొన్ని కాలానికి, వాతావరణానికి తగిన విధంగా మార్పులు చెందుతూ ఇంకా బతుకుతున్నాయి. జంతువులు ఒకే రకంవి అయినా సరే, ఉష్ణ ప్రాంతాల్లో ఉండే వాటికి, శీతల ప్రాంతాల్లో ఉండే వాటికి తేడాలుంటాయి. చలిని తట్టుకోవడానికి జంతువులు తమ శరీరంపై ఎక్కువ జుట్టు/ఉన్ని పెంచుకోవడం మనం గమనిస్తూనే ఉన్నాం. అవసరానికి తగిన విధంగా మార్పులు చెందడమన్నమాట !

బిలియన్ సంవత్సరాలు పట్టే పెద్ద జంతువుల జీవ పరిణామం మనం పరిశీలించలేం. కానీ బ్యాక్టీరియా వంటి జీవిలో జరిగే పరిణామాన్ని మనం పరిశీలించొచ్చు. దీని 'తరం'



కొన్ని కొన్ని రోజుల్లోనే జరిగిపోతుంది గనుక, మనం దానితో ప్రయోగాలు చెయొచ్చు. ఉదాహరణకు మనం ఒక బ్యాక్టీరియాను యాంటి బయోటిక్స్‌తో నాశనం చేస్తూ ఉన్నామనుకోండి. కొంత కాలానికి అది పరిణామం చెంది మనమిచ్చే యాంటిబయోటిక్స్‌ను లెక్కచేయకుండా అది తన మనుగడను కొనసాగిస్తుందనకుందాం. అప్పుడేమయిందన్న మాటా ? ఒక కొత్తతరం బ్యాక్టీరియా ఆవిర్భావం అక్కడ జరిగిందన్నమాట ? ఎందుకంటే అంతదాకా మనమిచ్చిన యాంటిబయోటిక్‌కు స్పందించే బ్యాక్టీరియా ఇప్పుడు అక్కడ లేదు. మార్పులు చెంది ఆవిర్భవించిన మరో కొత్త బ్యాక్టీరియా ఉంది. ఆ స్థితిలో దాన్ని మనం అశ్రద్ధగా వదిలేస్తే అది జనాభాపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. కోట్ల మంది అనారోగ్యానికి గురికావాల్సి వస్తుంది. అందువల్ల ఆ కొత్త బ్యాక్టీరియాను నిర్మూలించేందుకు పరిశోధనలు జరపాలి. కొత్త యాంటిబయోటిక్‌ను రూపొందించుకోవాలి.

డార్విన్ తర్వాత ఇరవైయేళ్లకు రెవరెండ్ విలియం డాలింజర్ కొన్ని ఏకకణజీవులతో ప్రయోగాలు ప్రారంభించాడు. మాములు గది టెంపరేచర్‌లో సజావుగా బతకగలిగే సూక్ష్మక్రిముల్ని ఇంకుబేటర్‌లో పెట్టి క్రమక్రమంగా ఉష్ణోగ్రత పెంచుతూ, ఆరేళ్ల తర్వాత 158 డిగ్రీ ఫారన్‌హీట్‌కు తీసుకుపోయి పరిశీలించాడు. ఆయన తర్వాత టిమ్ కూపర్, రిచర్డ్ లెన్‌స్కీలు హూస్టన్, మిచిగన్ యూనివర్సిటీలలో పరిశోధనలు కొనసాగించారు. బ్యాక్టీరియాల అరవైవేల తరాల్ని పరిశీలించారు. పరిణామ క్రమంలో వచ్చిన మార్పుల్ని గమనిస్తూ వాటిని నమోదు చేస్తూ వచ్చారు. బ్యాక్టీరియా ఎంతగా మారిపోయిందంటే అది రాను రాను కలపను కూడా తినడం ప్రారంభించింది. జన్యువుల మార్పుల వల్ల, మ్యూటేషన్స్ వల్ల ఈ మార్పులు సాధ్యమయ్యాయన్నది తెలిసింది. వాతావరణానికి అనుగుణంగా జీవులు తమను తాము మార్చుకుంటున్నందువల్ల పరిణామం జరుగుతూ ఉందని మనకు తెలుసు. జీవులు తమని తాము ఎలా మార్చుకుంటున్నాయి? అంటే తమలో ఉన్న ప్రోటీన్లను, ఎంజైమ్‌లను మార్చుకుంటూ ఉన్నాయి. ఫలితంగానే బాహ్యంగా శరీరంలో, జీవన క్రియలు, ప్రవర్తనలో మార్పులు సంభవిస్తున్నాయి. ఈ విషయాలను అర్థం చేసుకొని పరిశోధనలు చేసిన ముగ్గురు రసాయనిక శాస్త్రవేత్తలకు 2018 సంవత్సరపు నోబెల్ పురస్కారాలు దక్కాయి.

జీవ పరిణామం జన్యువుల వల్ల జరుగుతూ వస్తుందని మనకు తెలుసు. ప్రతి జన్యువూ కొన్ని ఎంజైమ్‌లను కలిగి ఉండి రసాయనిక చర్యల్ని కెటలైజ్ చేస్తుంది. అంతే కాకుండా ప్రోటీన్లను కలిపి ఉంచుతుంది. రెండు గానీ, అంతకు మించి గానీ మాలిక్యూలను కలిపి ఉంచడానికి సహాయపడుతుంది. చుట్టూ ఉన్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జీవన క్రియల్ని జరుపుకుంటూ జీవితాంతం కొనసాగడానికి ఇవే ఉపయోగపడతాయి. అంతే కాదు, జీవులను సమర్థవంతంగా జీవించేట్లు చేస్తాయి. ప్రకృతి సహజసిద్ధంగా తనకు తాను ఇన్ని రసాయనిక చర్యలు చేపడుతూ సరళమైన జీవుల నుంచి సంక్లిష్టమైన జీవులు పరిణామం చెందేటట్లు చేస్తూ వస్తోంది. భూమి మీద ఇంత వైవిధ్య భరితమైన వృక్షాలు, జంతువులు, భిన్నమైన మానవ జాతులు వర్థిల్లుతున్నాయంటే ఆ గొప్పదనమంతా జీవపరిణామానిదే! తన జీవితం ధారబోసి ఇలాంటి ఎన్నెన్నో విషయాల్ని క్రోడీకరించి సులభంగా పరిణామ సిద్ధాంతాన్ని మానవాళికి అందించిన డార్విన్ ఎంతటి మహనీయుడో ఆలోచించగల వారికి అర్థమవుతుంది.

రాగల కాలానికి ఈ విజ్ఞానాన్ని అందించకుండా మతాల దగ్గర, కల్పించి రాసుకున్న పురాణాల దగ్గర జనాన్ని ఆపేయాలని వ్యర్థప్రయత్నం చేస్తున్న ప్రభుత్వాల పెద్దలు, పండిత శిఖామణులు, పీఠాధిపతులు, బాబాలు ప్రవచనకారులు ఇకనైన వారి ప్రయత్నం మానుకుంటే మంచింది. బల్లి శాస్త్రాలు మానేసి, అసలైన విజ్ఞాన శాస్త్రాలు అధ్యయనం చేస్తే బావుంటుంది. వారు గొప్పగా చెప్పుకునేవన్నీ అసలు శాస్త్రాలు కానే కావని గుర్తుంచుకోవడం అంత కన్నా అవసరం. డార్విన్ తన ఆర్జిన్ ఆఫ్ స్పీసెస్ గ్రంథ ముగింపు వాక్యాలు ఇలా రాసుకున్నాడు. "సులభమైన, సరళమైన జీవరాసులే అనంతకాల గమనంలో అందమైన, అద్భుతమైన జీవులుగా రూపొందుతున్నాయి."

సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్ మెల్‌బోర్న్ నుంచి..



'మేమూ మనుషులమే'నంటూ..

చూపులో చీదరింపు... మాటల్లో ఆశ్చర్యం... ప్రతిచోటా వివక్ష. జుట్టు నుంచి రంగు, భాష వరకు అన్ని విషయాల్లో వారిపై వివక్ష. రంగునుబట్టి... రూపును బట్టి.. హంతకులుగానో, డ్రగ్ అడిక్ట్స్‌గానో ముద్ర. ఈ ముద్రలన్నీ పోగొట్టుకోవడం కోసం వారు దేశవ్యాప్తంగా ఏకమయ్యారు. 'మేము మీలాంటి సాధారణ మనుషులమే'నని చాటడం కోసం దేశంలో మొట్టమొదటి సారిగా 'బ్యూటీ కంటెస్ట్' ఇటీవలే నిర్వహించారు. ఎవరు వారు? ఏం చేశారు?

మనం తెల్లవాళ్ల దురాగతాల గురించి మాట్లాడుకున్నాం. వందల ఏండ్లు భారతదేశాన్ని బానిస దేశంగా చూసిన వాళ్ల దుష్టత్వాన్ని ఎదిరించాం. తెల్లదొరల నుంచి స్వాతంత్య్రాన్ని పొందాం. కానీ తెల్లదొరల ఆధిపత్య భావజాలాన్ని మన మనసుల్లోంచి పోగొట్టుకోలేకపోతున్నాం. మనకు నలుపనంటే నచ్చదు. నల్లగా ఉండే మనుషులంటే నచ్చరు. మనకు చాలా విషయాల్లో చిన్నచూపు. మైనారిటీలంటే చిన్నచూపు. దళితులంటే చిన్నచూపు. పేదలంటే చిన్నచూపు. ఇక భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా నల్లగా ఉండే ఆఫ్రికన్లంటే మనకు చాలా చిన్న చూపు. అందుకు ఉదాహరణలు కోకొల్లలు.

హైదరాబాద్‌లో...

జాంబియాకు చెందిన 21 ఏండ్ల యువతి ఉస్మానియా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నది.
భారతదేశంలో ఆమె మొట్టమొదటిసారి వివక్ష ఎదురుకున్నది మన హైదరాబాద్‌లోని ఓ రద్దీ ప్రాంతంలో.
ఇంటికి వెళ్లడం కోసమని క్యాబ్ బుక్ చేసింది. తీరా క్యాబ్ వచ్చిన తరువాత ఆమెను ఎగాదిగా చూసిన క్యాబ్ డ్రైవర్ రైడ్‌ను క్యాన్సిల్ చేశాడు. కేవలం ఆమె రూపం చూసే క్యాన్సిల్ చేశాడు. ఆ ఘటనతో అపరాధ భావంతో కుంగిపోయింది. ఈ రెండేండ్ల కాలంలో ఆమె గమనించిన విషయాలనేకం. తనది జాంబియా అని చెప్పగానే... అదొకటి ఉందా అన్న ఆశ్చర్యపు చూపు ఆమెను తాకేది. ఎందుకంటే ఆఫ్రికా ఖండం అనగానే నైజీరియా లాంటి దేశాలే గుర్తొస్తాయి చాలా మంది. కానీ అందులో అనేకానేక దేశాలున్నాయని, అందులో ఒక్కో దేశానికి ఒక్కో సంస్కృతి ఉందని తెలియదు. ఆమె చదువుకోవడంతోపాటు మోడలింగ్‌ను కొనసాగిస్తున్నది. కేవలం ఆఫ్రికన్ అయినందున అవకాశాలు చేజారిన ఘటనలు కోకొల్లలు.

బహిరంగ ప్రదేశాల్లోనూ...

కోఫి... కాంగో నుంచి 2013లో ఇండియాకి వచ్చింది. అమిటీ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆమె ఇప్పుడు టెలికమ్యూనికేషన్ కంపెనీలో పనిచేస్తున్నది. ఇక్కడ ఆమెకు చాలా మంది స్నేహితులున్నారు. కానీ ఏమున్నఆ.. ఓసారి ఆమెపై ఓ వ్యక్తి దాడి



చేశాడు. చుట్టూ ఉన్నవాళ్లెవరూ సాయానికి ముందుకు రాలేదు. దగ్గరలోనే ఉన్న వాళ్లమ్మ పరుగెత్తుకు వచ్చి... ఆ దుండగుడిని కొట్టి కూతురిని విడిపించింది. మూడేండ్లు గడిచాయి. అయినా ఆ ఘటన కలిగించిన ట్రామా ఆమెను వీడలేదు. ఇప్పటికీ జనం రద్దీగా ఉన్న ప్రాంతాలకు వెళ్లాలంటే భయపడుతుంది కోఫీ.



బెంగళూరులో...

లా చదవడం కోసం 2016లో బెంగళూరుకు వచ్చింది ఓ యువతి. ఎంతో మంది స్నేహితులయ్యారు. కానీ అలాగే ఎన్నో ఇబ్బందిపెట్టే ఘటనలను ఎదుర్కొన్నది. ఓసారి వీధిలో నడుచుకుంటూ వెళ్తుంటే... బైక్‌లో వెంబడించారు. అసభ్యంగా అరవడం మొదలుపెట్టారు. ఆఫ్రికన్ అన్న కారణంగానే భిన్నమైన, విచిత్రమైన చూపులను ఎన్నోసార్లుఎదర్కొన్నది.

ఎక్కడ చూసినా...

ఇది కొత్తేమీ కాదు. ఆఫ్రికన్లు అనగానే విలన్లుగా చూసే ఓ భావన. అలాగే ఆఫ్రికన్ విద్యార్థులనగానే... డ్రగ్ వ్యవసనపరులు అనే అపోహ. 2014లో సౌత్ ఢిల్లీలోని ఖిర్కీ ఎక్స్‌టెన్షన్‌లో ఉగాండా మహిళలపై దాడి చేశారు. 2016లో బెంగళూరులో ఓ టాంజానియా మహిళను వివస్త్రను చేశారు. అదే సంవత్సరం మన హైదరాబాద్‌లో ముగ్గురు నైజీరియా మహిళలపై వివక్షా పూరిత దాడి చేశారు. గత ఏడాది గ్రేటర్ నోయిడాలో నైజీరియా విద్యార్థులపై దాడి జరిగింది. కొందరు గాయపడ్డారు కూడా. అది మాత్రమే కాదు... పనిచేసేచోట బయటికి కనిపించని వివక్ష.

చైతన్యం పెంచాలని...

ఈ వివక్షను ఎదుర్కొంటున్న ప్రపంచవ్యాప్త ఆఫ్రికన్ మహిళలకు స్ఫూర్తినివ్వాలనుకున్నది లారిస్సా కలాంగో ఇండియాలో ఉంటున్న ఆఫ్రికన్ మహిళలో చైతన్యాన్ని తేవాలన్న ఆకాంక్షను ఆమెలో కలిగించాయి. దేశంలో నివసిస్తున్న ఆఫ్రికన్ మహిళలందరినీ ఏకం చేసి 'మిస్ ఆఫ్రికా ఇండియా' పేరుతో జాతీయ స్థాయి పోటీ నిర్వహించాలనుకుంది. దేశంలో జరిగిన మొట్టమొదటి పోటీ ఇది. ఆఫ్రికన్ సంస్కృతిలోని భిన్నత్వాన్ని శాంతిని పెంచడంతోపాటు, ప్రజల మధ్య అవగాహన పెంపొందించడం కోసం ప్రయత్నించింది.
గత ఏడాది తన మిత్రులతో చర్చించిన కలాంగో... మేకల్లా ఓ వెబ్‌సైట్‌ను లాంచ్ చేసింది. 12 మంది కలిసి ఆర్గనైజింగ్ కమిటీగా ఏర్పడ్డారు. దాని ద్వారా పోటీని క్రటించారు. ఆన్‌లైన్‌లోనే...ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చండీగఢ్, హైదరాబాద్, పుణే, కాకినాడ, వరంగల్, రూర్కెలా, బరోడా, భువనేష్వర్‌ల్లో ఆడిషన్స్ నిర్వహించారు. ఇందులో భాగస్వాములైన 230 మందిలో ఎక్కువమంది విద్యార్థులు. విద్యార్థి కావడంతో కంటెస్టెంట్స్ ఒప్పించడం కష్టం. కారణం... మోసం చేస్తారేమోనన్న భయం. ఆర్థికపరంగా కూడా ఇబ్బందులు. అయినా అన్నింటినీ అధిగమించి 230 మంది నుంచి 15 మందిని ఫైనలైజ్ చేశారు.
సంప్రదాయ దుస్తులతోపాటు, స్థానిక వంటలను కూడా ఒక రౌండ్‌లో పెట్టారు. ఫైనల్‌గా ఎకోడు అనే 21 ఏండ్ల విద్యార్థి 'మిస్ ఆఫ్రికా ఇండియా' టైటిల్‌ను గెలుచుకున్నది.

కట్ట కవిత

ఆడపిల్లలకు ఆలంబనగా..



ఆడ పిల్లల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని జనవరి 2015 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నది తెలిసిన విషయమే. ఈ పథకంలో ఆడ పిల్లల పేరు మీద వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులు సంవత్సరానికి రూ. 250 మొదలుకుని డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. పొదుపు పథకాలపై బ్యాంకులు అందించే వడ్డీ రేట్ల కన్నా ఈ పథకం అందించే వడ్డీ రేటు చాలా ఎక్కువగా ఉంటుంది.

పథకానికి వడ్డీ రేటు

ఈ పథకానికి సంవత్సరానికి 8.1 శాతం వడ్డీ రేటు లభిస్తుంది. ప్రభుత్వం ఈ వడ్డీ రేట్లను సంవత్సరానికి ఒకసారి సవరించి, దానిని కేంద్ర బడ్జెట్ సమయంలో ప్రకటిస్తారు.

కాలిక్యులేటర్:

సంవత్సరానికి రూ. 1000 కనీస పెట్టుబడి పెట్టినట్లయితే, 21 సంవత్సరాల పూర్తయిన తర్వాత అనగా మెచ్యూరిటీ సమయంలో రూ. 46,821 పొందవచ్చు. అదేవిధంగా, సంవత్సరానికి రూ. 2000 కనీస పెట్టుబడి పెట్టినట్లయితే, 21 సంవత్సరాల తరువాత రూ. 93,642 సంపాదించవచ్చు. సంవత్సరానికి రూ. 5,000, రూ. 10,000, రూ. 20,000, రూ. 50,000, రూ. 1,00,000, రూ. 1,25,000 రూ. 1,50,000 చొప్పున డిపాజిట్ చేసినట్లయితే, 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాత వరుసగా రూ. 2,34,107, రూ. 4,68,215, రూ. 9,36,429, రూ. 23,41,073, రూ. 46,82,146, రూ. 58,52,683, రూ. 70,23,219 పొందవచ్చు.

చేరడానికి అర్హత:

సుకన్య సమృద్ధి యోజన ఖాతాను 10 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ఆడ పిల్లల తరఫున ఒక చట్టపరమైన సంరక్షకుడు తెరవవచ్చు.

ఖాతాలో గరిష్ట సంఖ్య:

ఒకే కుటుంబంలో ఇద్దరు అమ్మాయిలు లేదా ఒకవేళ ఒకే కాన్పులో ఇద్దరు కవలలు (ఇద్దరూ ఆడ పిల్లలై ఉండాలి) పుట్టిన సందర్భాల్లో లేదా మొదటి కాన్పులో ఒకేసారి ముగ్గురు ఆడ పిల్లలు పుట్టిన సందర్భంలో ముగ్గురు ఆడ పిల్లలు ఈ పథకంలో చేరవచ్చు. 21 సంవత్సరాల కాల పరిమితి పూర్తయ్యే ముందే అమ్మాయి వివాహం చేసుకున్నట్లైతే, ఖాతా ఆటోమాటిక్‌గా క్లోజవుతుంది.

డిపాజిట్ పరిమితి: సంవత్సరానికి కనీస డిపాజిట్ రూ. 250, అలాగే గరిష్ట డిపాజిట్ రూ. 1,50,000.

డిపాజిట్ కాలపరిమితి: ఖాతా తెరిచిన తేదీ నుంచి 21 సంవత్సరాలు ఉంటుంది. అలాగే ఖాతాను తెరిచిన తేదీ నుంచి గరిష్టంగా 15 సంవత్సరాల పాటు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

ఉపసంహరణ : ఎస్బీఐ బ్యాంకు ప్రకారం, ఆడ పిల్లకు 18 సంవత్సరాల వయస్సు వచ్చిన తరవాత ఆమె ఉన్నత చదువుల కోసం, వివాహం కోసం ఖాతాలోని మొత్తం నుంచి 50 శాతం నగదును ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది.

పన్ను ప్రయోజనం: సుకన్య సమృద్ధి యోజన ఖాతా మూడు రకాల పన్ను ప్రయోజనాలను అందిస్తుంది. వాటిలో పెట్టిన పెట్టుబడిపై పన్ను మినహాయింపు, వడ్డీ రూపంలో సంపాదించిన మొత్తం, ఉపసంహరించిన మొత్తం.

ఖాతాను ఎక్కడ, ఎలా తెరవాలి?

ఈ ఖాతాను దేశంలోని ఏదైనా గుర్తింపు పొందిన ప్రభుత్వ లేదా ప్రైవేటు బ్యాంకుల్లో తెరవచ్చు. ఈ పథకం కింద 10 సంవత్సరాలలోపు వయసు గల బాలబాలికలు పేరు మీద పోస్టాఫీసులు, బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి వారికి 14 సంవత్సరాలు నిండే వరకు సొమ్ము జమ చేయవచ్చు. తపాలా కార్యాలయాల్లో కానీ, అన్ని వాణిజ్య బ్యాంకులకు చెందిన ఏ శాఖలోనైనా కానీ వెయ్యి రూపాయాల కనీస డిపాజిట్‌తో పుట్టినప్పటి నుంచి పదేళ్లలోపు ఎప్పుడైనా సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరవవచ్చు.

కొన్ని లోపాలు

అయితే ఈ సుకన్య సమృద్ధి యోజన ఖాతాలో కొన్ని లోపాలు కూడా ఉన్నాయి.

కాల పరిమితి

ఈ ఖాతా తక్కువ కాల పరిమితి పెట్టుబడిదారులకు ఏవిధంగానూ ఉపయోగపడదు. ఖాతాలో ఉన్న జమ అయిన డబ్బు 21 సంవత్సరాల తర్వాత మాత్రమే తీసుకునే అవకాశం ఉంది. ఈ పథకం కింద 10 సంవత్సరాలలోపు వయసు గల బాలబాలికలు పేరు మీద పోస్టాఫీసులు, బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి వారికి 14 సంవత్సరాలు నిండే వరకు సొమ్ము జమ చేయవచ్చు.

రెండు ఖాతాలు

ఈ పథకం కింద ఇద్దరు బాలికలున్న తండ్రి రెండు ఖాతాల్లో విడివిడిగా సొమ్ముని జత చేయాల్సి ఉంటుంది. ముగ్గురు కూమార్తెలున్న తండ్రి మరో సుకన్య సమృద్ధి యోజన అకౌంట్ తెరిచేందుకు వీలు లేదు.

ముందు ఉపసంహరణ

ఈ పథకం కింద జమ చేసిన నగదుని 21 సంవత్సరాల తర్వాతనే చెల్లిస్తారు. ఏదైనా కారణంతో ముందుగా నగదుని విత్ డ్రా చేసుకుందామనుకుంటే ఇవ్వరు. ఒక వేళ బాలిక చనిపోతే దానిని వేరుగా పరిగణిస్తారు.

ఆన్‌లైన్ ఫెసిలిటీ లేదు

ఈ పథకం కింద తెరిచిన ఖాతాలో డీడీ లేదా చెక్కు ద్వారా మాత్రమే జమ చేయాలి. ఆన్‌లైన్ ద్వారా చెల్లించే సౌకర్యం లేదు. సాంకేతిక పెరిగిన ఈ రోజుల్లో ప్రజలకు పెద్ద అసౌకర్యంగా అనిపిస్తుంది.

వడ్డీ రేట్లలో తేడా

ఈ పథకం కింద జమ చేసిన నగదుకు ప్రభుత్వం ప్రకటించే వడ్డీ రేట్లలో ప్రతి ఏడాదికి మారుతూ ఉంటాయి. ముఖ్యంగా ఈ నగదుని ప్రభుత్వ బాండ్లకు అనుసంధానం చేస్తారు. మొత్తంగా చూసుకుంటే ఈ సుకన్య సమ ద్ధి యోజన పథకం కింద జమ చేసిన నగదుకి రిస్క్ భయం తక్కువగా ఉండే వడ్డీ మాత్రమే లభిస్తుంది. ❄

దుర్వాసన పోవాలంటే..?

- **భో**జనం చేసిన ప్రతిసారీ నీళ్లతో పుక్కిళ్లుంచాలి. కనీసం రోజుకు రెండు సార్లు తప్పకుండా బ్రష్ చేయాలి. గట్టిగా బ్రష్ చేయకూడదు. అలా చేస్తే చిగుళ్ల దెబ్బతిని కొత్త సమస్య రావొచ్చు.
- బాత్‌రూమ్‌కి దగ్గరలో బ్రష్‌ని ఉంచడం కూడా సరికాదు. ఆ బ్రష్‌ని వాడడం వల్ల హానికారక క్రిములు నోట్లోకి చేరి నోరు దుర్వాసన రావడానికి కారణమవుతాయి.
- నాలుకపై తెల్లటి పాచిని శుభ్రం చేసుకోకపోతే కూడా నోటి నుంచి దుర్వాసన రావొచ్చు. కాబట్టి కచ్చితంగా రోజుకు రెండుసార్లు శుభ్రం చేస్తే మంచిది. ❄



నలభై దాటాక...



మెనోపాజ్... 40 దాటిన దగ్గరనుంచి మహిళలు ఎదుర్కొనే సమస్య. కొన్ని మార్పులు చేసుకుంటే... మెనోపాజ్ దశ దాటాక ఎదురయ్యే చాలా సమస్యల్ని అదుపులో ఉంచుకోవచ్చు.

- శరీరానికి శరీరానికి బీ12 తప్పనిసరి. ఆహారంలో చేపలు, మాంసాహారాన్ని తీసుకుంటే ఆ పోషకం అందుతుంది. అంతేకాదు జీర్ణక్రియ పనితీరు సాఫీగా జరిగేందుకు ఉపయోగపడే ఆమ్లాల విడుదల తగ్గినప్పుడు ఈ పోషకం ఆ జీర్ణశక్తి మందగించ కుండా కాపాడుతుంది.
- ఎముకలు బలహీనపడకుండాఉండాలంటే ఆహారం ద్వారా క్యాల్షియం అందేలా చూసుకోవాలి. ఆకుకూరలు, బెండకాయ, చిక్కుడు, బీన్స్, చిలకడదుంప వంటి కూరగాయలు, నారింజ, జామ, బొప్పాయి వంటి పండ్లు తినాలి. అలాగే విటమిన్ డి కూడా ఆరోగ్యానికి అత్యంత ముఖ్యం. చేప, చీజ్, గుడ్డు, నారింజపండు వంటివాటి నుంచి ఈ పోషకం అందుతుంది.
- ప్రతీరోజూ తీసుకునే ఆహారంలో ఇనుము కూడా తప్పనిసరే. ఆ శాతం తగ్గితే హ ద్రోగాలు వచ్చే అవకాశం అధికం. ఆకుకూరలు, చేపలు, మాంసాహారం, పాల ఉత్పత్తులు, గుమ్మడి గింజలు తీసుకోవాలి.
- ఆహారంలో ఉప్పు శాతాన్ని తగ్గించుకోవాలి. లేదంటే అధికరక్తపోటు సమస్య పెరుగుతుంది.
- పీచు ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవాలి. పండ్లు, తాజా కూరగాయల్లో పీచు ఎక్కువ.
- వీలైనంతవరకూ నడవాలి. అవకాశం ఉన్నప్పుడలా మెట్లు ఎక్కి దిగాలి. ఎక్కువసేపు కూర్చోకూడదు. వ్యాయామం దినచర్యలో ఓ భాగం చేసుకోవాలి. దానివల్ల బరువు అదుపులో ఉండటమే కాదు, మానసిక ప్రశాంతత కూడా సొంతమవుతుంది. ధ్యానం పదినిమిషాలు చేసినా చాలు. ❄

ఇట్లా చేద్దాం

చలికాలం పెదవులు తొందరగా పొడి బారుతాయి. ఒక్కొక్క సారి పెదాలు చిట్లి రక్తం కారుతుంది. దాన్నించి బయటపడాలంటే మీగడలో శనగపిండి నిమ్మరసం కలిపి పెదాలకు రాసుకుంటే మృదువుగా తయారవుతాయి.

వాడినా... వాడుకోవచ్చు



ఎండిన పూలతోనూ ఎన్నో ప్రయోజనాలున్నాయి. పూలు ఎండినా వాటి పరిమళం, ఉపయోగం మాత్రం పోదంటున్నారు నిపుణులు.

- గులాబీ పూలు వాడిపోతే పారేయకుండా కాస్తంత నీడలో రెండు మూడు రోజులు ఎండబెట్టాలి. తడిపూర్తిగా పోయాక అరకప్పు వేడినీటిలో వేసి మూత పెట్టాలి. చల్లారిన తరువాత వడకట్టాలి. దీన్ని స్నానం చేసే నీటిలో కలపాలి. దీని వల్ల పొడి చర్మం మృదు వుగా మారుతుంది.
- ఎండిన చామంతి పూలను ఐదారు తీసుకుని కొద్దిగా కొబ్బరినూనె కలిపి ముద్దలా చేయాలి. దీనికి రెండు చెంచాల చొప్పున ఓట్స్, అవిసెగింజల పొడిని కలిపి ముఖానికి, చేతులకు రాసుకోవాలి. పది నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకుంటే చాలు. మృతకణాలు పోయి చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.
- ఎండిన బంతి లేదా చామంతి పూల రేకులను గుప్పెడు తీసుకుని కప్పు వేన్నీళ్లలో రెండు నిమిషాలు మరగించి వడకట్టాలి. రెండు చెంచాల ఈ నీటికి చెంచా కలబంద గుజ్జు, రెండు చుక్కల నిమ్మనూనెను కలిపి ముఖానికి రాయాలి. పదినిమిషాల తరు వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరిస్తే చాలు. చర్మం మెరుపులీనుతుంది. ❄

ఠాకూర్ ఫార్ములా చారిత్రాత్మకం

- కర్పూరి ఠాకూర్ జయంతిలో వినయకుమార్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ రిజర్వేషన్లలో ఎంబీసీలకంటూ ప్రత్యేక కోటా కేటాయించి ఆ సామాజిక తరగతుల అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి బీహార్ మాజీ ముఖ్యమంత్రి, జననాయక్ బిరుదాంకితుడు కర్పూరి ఠాకూర్ అని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్.వినయకుమార్ కొనియాడారు. కర్పూరి ఠాకూర్ ఫార్ములా చారిత్రాత్మకంగా నిలిచిందన్నారు. హైదరాబాద్‌లోని ఎంబీసీ రాష్ట్ర కార్యాలయంలో కర్పూరి ఠాకూర్ జయంతిని గురువారం నిర్వహించారు. ఠాకూర్ చిత్రపటానికి ఎస్.వినయ్‌కుమార్, మంగళ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెన్నారావు, రాష్ట్ర నాయకులు దుర్గారావు నివాళులు అర్పించారు. అనంతరం ఎస్.వినయకుమార్ మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ కాలంలో ఆయన తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్నారన్నారు. ఎంబీసీల అభ్యున్నతి, ఎంబీసీల గౌరవం, ఆత్మాభిమానం కోసం కృషి చేసిన గొప్ప నాయకుడని గుర్తు చేశారు. 'జననాయక్' స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు.

ఎన్నికల్లో ఓటమిపై హైకోర్టులో పలు రిట్టు

- రేవంత్, అరుణ, శ్రవన్ తదితరుల దాఖలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమిపాలైన పలువురు కాంగ్రెస్ అభ్యర్థులు న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. ఈవీఎం ఓట్లతోపాటు ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వివి ప్యాట్)లను లెక్కించాలని కోరితే ఎన్నికల అధికారులు ఏకపక్షంగా తోసిపుచ్చారని ఆరోపిస్తూ పలువురు కాంగ్రెస్ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈవీఎంలకు, వీవీ ప్యాట్ లెక్కలకు తేడాలున్నాయని, ఈ విషయాన్ని ఎన్నికల అధికారులు ఖాతరు చేయలేదంటూ ఎన్నికల పిటిషన్లు దాఖలు చేశారు. వీవీ ప్యాట్ ముద్రిత స్లిప్పుల లెక్కింపులు చేయాలన్న తమ గోడును అధికారులు వినిపించుకోలేదని ఆరోపించారు.

ఓటరు దినోత్సవంలో పాల్గొనం

- ఈసీకి సీపీఐ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఓటరు జాబితాలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ పాల్పడుతున్న అవకతవకలకు నిరసనగా 25వ జాతీయ ఓటరు దినోత్సవంలో పాల్గొనబోమని సీపీఐ ప్రకటించింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి లేఖ రాశారు. ఓటరు జాబితాలో అర్హత గల ఒక్క ఓటర్ పేరు లేకుండా ఉండవద్దన్న అంశంపై ఓటరు దినోత్సవాన్ని నిర్వహించడం సంతోషమే అయినప్పటికీ ఇటీవల రాష్ట్రంలో అందుకు భిన్నంగా పరిణామాలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ఓటరుగా నమోదుకు స్పష్టమైన విధానాలు లేకపోవడం, ఓటరు జాబితాలో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయని ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి పునాది లాంటి ఓటరు జాబితాపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిందన్నారు.

ఏసీబీకి చిక్కిన మలక్‌పేట్ సబ్ రిజిస్ట్రార్ఉద్యోగి

నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

ఒక వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా మలక్‌పేట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన ఒక ఉద్యోగిని ఏసీబీ అధికారులు రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నారు. స్థానికుడు ఫారూక్ అనే వ్యక్తి తన ఇంటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాల కోసం జూనియర్ అసిస్టెంట్ హజర్‌ను కలిశాడు. ఆ పత్రాలు ఇవ్వడానికి ఏడు వందల రూపాయలను హజర్ డిమాండ్ చేశాడు. ఆ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని గురువారం ఆజంపురలోని అతని కార్యాలయంలోనే పట్టుకున్నారు. అంతేగాక అతని వద్ద ఉన్న మరో వేయి రూపాయల లెక్క పత్రాలు లేని డబ్బులను కూడా స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా హజర్‌పై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయని కార్యాలయ వర్గాలు తెలిపాయి. కాగా నిందితుడిని అరెస్టు చేసిన అధికారులు ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించినట్టు ఏసీబీ డీజీ పూర్ణచంద్రరావు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతికి సంబంధించిన సమాచారాన్ని తమకు అందించాలని ఆయన ఈ సంధర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఓపెన్ కాస్ట్ నిలిపివేతకు హరిత ట్రిబ్యునల్ నో!

నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను జాతీయ హరిత ట్రిబ్యూనల్ గురువారం విచారించింది. జిల్లాలోని కాకతీయ గని-2లో పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా బ్లాస్టింగ్స్ జరుపుతున్నారని, పేలుళ్ల ప్రకంపనలతో సమీపంలోని నివాసాలు దెబ్బతింటున్నాయని రాజలింగమూర్తి అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. మైనింగ్ గనుల్లో నిబంధనలు పాటించటం లేదని కేంద్ర పర్యావరణ శాఖ కూడా నివేదిక ఇచ్చిందని పిటిషనర్ తరపు న్యాయవాది శ్రావణ్ కుమార్ తెలిపారు. మైనింగ్ నిలిపి వేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ మరో అప్లికేషన్ దాఖలు చేయగా ట్రిబ్యూనల్ తోసిపుచ్చింది. ప్రధాన కేసు విచారణను త్వరలోనే పూర్తి చేస్తామని, మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదని బెంచ్ అభిప్రాయపడింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 8వ తేదీకి వాయిదా వేసింది.

మేకిన్ ఇండియా పేరుతో కార్పొరేట్లకు డిఫెన్స్ తాకట్టు

- ఏఐటీయూసీ అధ్యక్షులు నరసింహన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలోని రక్షణ రంగంలో ఉన్న అన్ని విభాగాలలో వంద శాతం ఎఫ్‌డీఐని అనుమతిస్తూ, మేక్ ఇండియా పేరుతో డిఫెన్స్ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు మోడీ సర్కారు తాకట్టు పెడుతున్నదని ఏఐటీయూసీ అధ్యక్షులు నరసింహన్ విమర్శించారు. హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓ సంస్థల్లో సమ్మె చేస్తున్న ఉద్యోగుల శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించి మద్దతు తెలిపారు. సమ్మెలో పాల్గొంటున్న రక్షణ రంగ ఉద్యోగులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డిఫెన్స్ రంగంలోని సుమారు నాలుగు లక్షల మంది ఉద్యోగులకు నాయకత్వం వహిస్తున్న మూడు ఫెడరేషన్ల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా మూడు రోజుల పాటు సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. దేశంలోని ప్రభుత్వ రంగంలోని అన్ని సంస్థలను మోడీ ప్రయివేటుపరం చేస్తున్నారని విమర్శించారు. చివరకు దేశ సరిహద్దుల్లో పనిచేస్తున్న ఆర్మీ జవానులకు కూడా నష్టం కలిగించే విధంగా వారి జీవితాలను కూడా కార్పొరేటు సంస్థల చేతిలో పెట్టే విధంగా మోడీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా మోడీ సర్కారు దేశానికి, ప్రజలకు, కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే విధానాలను విరమించుకోవాలని సూచించారు.

గిరిజనుల ప్రాణాలకు భరోసా ఏదీ?

- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు



విశాఖపట్నం: విశాఖ మన్యంలో గిరిజనుల ప్రాణాలకు భరోసా లేకుండా పోయిందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, మండల నాయకులతో కలిసి గురువారం ఆయన అరకులోయ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అరకు ఏరియా ఆసుపత్రి పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బ సామెతలా ఉందని, ఆసుపత్రి భవనం గొప్పగా ఉన్నా కనీస సౌకర్యాలు లేవని తెలిపారు. ఆసుపత్రిలో 13 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారని, ఇలా అయితే వైద్య సేవలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. గైనిక్, ఆర్థో, జనరల్ సర్జన్, చిన్నపిల్లల వైద్యులు వంటి కీలకమైన స్పెషలిస్టు డాక్టర్లు లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య నిపుణులు లేక ఏ కేసు వచ్చినా విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేస్తున్నారన్నారు. రెండు అంబులెన్సులు, ముగ్గురు డ్రైవర్లు ఉండాల్సి ఉండగా ఇక్కడ ఆ పరిస్థితి లేదన్నారు. ఆసుపత్రిలో 42 రకాల పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా కేవలం 21 రకాల పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారని, మిగిలిన పరీక్షల కోసం మైదాన ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికైనా స్పెషలిస్టు వైద్యులను నియమించాలని, అన్ని రకాల పరీక్షలకు ల్యాబ్, ఐసియు ఏర్పాటు చేయాలని, సౌకర్యాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. శ్రీనివాసరావు వెంట సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మండల నాయకులు ఉన్నారు. అనంతరం డుంబ్రిగుడ మండలం సొవ్వ పంచాయతీ పరిధి కంగరుసోల, సాగిరివలస, కొత్రగొంది, గొప్పులవలస గ్రామాల్లో పర్యటించారు.

సందర్శకులను అనుమతించరాదు

సంరక్షణ గృహాల్లోకి..

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యాదగిరిగుట్టలో వ్యభిచార కూపం నుంచి బయటపడిన పిల్లలను సంరక్షణ గృహాల్లోనే ఉంచాలని, ఈ కేసు విచారణలో ఉన్నందున వారిని చూసేందుకు ఎవరినీ అనుమతించరాదని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆడ పిల్లలను బలవంతంగా పడుపు వత్తిలోకి దించి యాదగిరిగుట్టలో వ్యభిచారం చేయిస్తున్నారంటూ పత్రికల్లో వచ్చిన కథనాలపై హైకోర్టు స్పందించింది. ఆ వార్తలను సుమోటోగా ప్రజాహిత వ్యాజ్యాలుగా పరిగణించిన హైకోర్టు గురువారం మరోసారి విచారణ జరిపింది. సంరక్షణ గృహాల్లోని పిల్లలను ఓదార్పుకోసమో, ఇతరత్రా సాకులు చెపుతూ ఎవరైనా సందర్శకులు వస్తే వారిని అనుమతించరాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ఓదార్పు పేరుతో పలువురు స్థానిక నేతలు పిల్లలను కలసుకుంటున్నారని, మానసికంగా ఎంతో గాయపడిన పిల్లలను ఎవరు పడితే వారు కలుసుకుంటే ఎలాగని ప్రజ్వల అనే స్వచ్ఛంద సంస్థ డివిజన్ బెంచ్ దష్టికి తెచ్చింది. సందర్శించేందుకు వీల్లేదని చెబితే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని చెప్పగా, అలాంటివి జరిగితే ఫిర్యాదు చేయాలని, వీటిపై పోలీసులు చట్ట ప్రకారం వెంటనే చర్యలు తీసుకోవాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. రెండు నెలల్లో కేసు దర్యాప్తు పూర్తి చేస్తామని ప్రభుత్వ లాయర్ హామీ ఇచ్చారు. కేసులను సెషన్స్‌కోర్టు విచారించాల్సివుందని, అయితే అక్కడ ఇతర కోర్టుల్లో మాదిరిగా పిల్లల కేసులను స్నేహపూర్వక వాతావరణంలో విచారించే పరిస్థితులు లేవన్నారు. చైల్డ్ ఫ్రెండ్లీ వాతావరణం ఉండేలా ఆదేశాలిస్తామని ధర్మాసనం ప్రకటించింది. సంరక్షణ గహాల్లోని బాలికలను సందర్శించేందుకు ఎవరెవరిని అనుమతించారో సీల్డ్ కవర్‌లో నివేదిక ఇవ్వాలని రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల బాలల సంక్షేమ కమిటీలను ధర్మాసనం ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా కమిటీని ప్రతివాదిగా చేస్తూ ఆదేశాలిచ్చిన హైకోర్టు విచారణను మార్చి 12కి వాయిదా వేసింది.

అమర జవానుకు అశోక చక్ర

- అవార్డుతో సత్కరించనున్న కేంద్రం
- ఉగ్రవాదాన్ని వీడి..వీరమరణం




న్యూఢిల్లీ: విద్వేష భావజాలానికి ప్రేరేపితుడై ఉగ్రవాదిగా మారాడు. తప్పు తెలుసుకున్నాక... సైన్యంలో చేరి ఎంతో సేవ చేశాడు. చివరకు కర్తవ్య నిర్వహణలో ముష్కరులతో పోరాడుతూ అమరుడయ్యాడు. అతనే లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్ వనీ. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం సైన్యంలోని అత్యున్నత పురస్కారమైన అశోక చక్రతో సత్కరించనున్నది. 26న జరిగే గణతంత్ర దినోత్సవం రోజున ఈ పురస్కారాన్ని వనీ కుటుంబసభ్యులు అందుకోనున్నారు. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాకు చెందిన నజీర్ అహ్మద్ వనీ గతంలో ఓ ఉగ్రవాది. 1990లలో ఉగ్రకార్యకలాపాల్లో పాల్గొన్న వనీ ఆ తర్వాత తన తప్పు తెలుసుకుని మారిపోయాడు. పోలీసుల ముందు లొంగిపోయాడు. 2004లో టెరిటోరియల్ ఆర్మీ బెటాలియన్‌లో చేరారు. అప్పటి నుంచి సైన్యానికి సేవ చేశారు. 2007, 2018లో సేనా పతకాన్ని అందుకున్నారు.కాగా గతేడాది నవంబరులో షోపియాన్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాదులతో పోరాడాడు. ఆ ఎన్‌కౌంటర్‌లో తీవ్రంగా గాయపడిన వనీని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన ప్రాణాలు కోల్పోయాడు. ముష్కరులను మట్టుబెట్టేందుకు తన ప్రాణాలు అర్పించిన అహ్మద్ వనీ ధైర్యసాహసాలకు ఇపుడు అశోక్ చక్ర లభించింది. వనీకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మంచిర్యాలలో పులిచర్మం కలకలం

- పోలీసుల అదుపులో నిందితుడు

నవతెలంగాణ-మందమర్రి రూరల్ / మంచిర్యాల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పులిచర్మం వేటగాళ్ల నీడలు బయట పడుతున్నాయి. నెల వ్యవధిలోనే వేటగాళ్ల ఉచ్చుకు బలైన పులి కళేబరం, దాని చర్మాలు లభించాయి. ఈ క్రమంలో గురువారం పక్కా సమాచారంతో పోలీసులు మందమర్రిలో మరో పులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్నారు. అటవీశాఖ అధికారుల వివరాల ప్రకారం.. మందమర్రి పట్టణంలోని రామన్‌కాలనీ గౌతమినగర్‌కు చెందిన ఐలవేని అంజయ్య తన ఇంటికి కొన్ని రోజులు తాళం వేసి ఉంచాడు. గురువారం ఉదయం ఇంటిని శుభ్రం చేసే పనులు చేపట్టాడు. పక్కా సమాచారం మేరకు పోలీసులు ఆ ఇంట్లో తనిఖీ చేయగా పులి చర్మం లభించింది. దాన్ని స్వాధీనం చేసుకుని అంజయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పులి చర్మం ఎక్కడిది.? ఎలా వచ్చిందన్న వివరాల కూపీ లాగుతున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న పులి చర్మం

మరోవైపు పది రోజుల కిందట మంచిర్యాల జిల్లా కేంద్ర శివారులోని రాళ్లపేట అటవీ ప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చుకు బలైన చిరుతపులి కళేబరం, వారం వ్యవధిలోనే బెల్లంపల్లి పట్టణంలో పులిచర్మం లభించిన విషయం తెలిసిందే.

పక్కా వ్యూహంతో నేరస్తుల వేట
జిల్లా అడటీశాఖ అధికారి రామలింగం

వన్య ప్రాణులు వేటగాళ్ల ఉచ్చులో పడకుండా పకడ్బందీగా నిఘా పెట్టామని, పక్కా వ్యూహంతోనే నేరగాళ్లను పట్టుకుంటున్నామనీ మంచిర్యాల జిల్లా అటవీశాఖ అధికారి రామలింగం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఫారెస్టు ఆఫీసులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన ఎన్జీవో సంస్థ ద్వారా అందిన పక్కా సమాచారంతో లింగయ్య ఇంట్లో సోదాలు చేసినట్టు తెలిపారు. పెద్దపులి చర్మాన్ని స్వాధీనం చేసుకుని, దాన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్టు చెప్పారు. నిందితుడు అయిలయ్యను విచారిస్తున్నామనీ, త్వరలోనే మరికొంత మంది వన్యప్రాణుల వేటగాళ్లను పట్టుకుంటామన్నారు. వన్యప్రాణులను వేటాడేవారిపై పీడీయాక్ట్ అమలు చేస్తామని తెలిపారు. సమావేశంలో అటవీశాఖ డివిజన్ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అటవీశాఖ జిల్లా అధికారి రామలింగం

ముగ్గురు అటవీశాఖ అధికారులపై వేటు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ముగ్గురు అటవీ శాఖ అధికారులపై గురువారం వేటుపడింది. రెండు వారాల్లో అటవీశాఖలో ఎనిమిది సస్పెండ్ కావడం గమనార్హం. డివిజనల్ ఫారెస్ట్ స్థాయి అధికారిని సస్పెండ్ చేయటం ఇదే తొలిసారి. ఉన్నతాధికారుల వివరాల ప్రకారం.. రెండేండ్లుగా ఆదిలాబాద్ జిల్లా అటవీ ప్రాంతం నుంచి నిజామాబాద్‌లోని నాలుగు సా మిల్లులకు టేకు కలప అక్రమ రవాణా జరుగుతున్నది. ఈ స్మగ్లింగ్ గురించిన సమాచారం నిజామాబాద్ జిల్లా అటవీ అధికారులకు గత యేడాది మేలోనే సమాచారం అందింది. అయినా విచారణ చేయకుండా నిర్లక్ష్యం వహించారు. తాజాగా నిఘా పెట్టిన పోలీసులు, అటవీశాఖ ఉన్నతాధికారులు కలప అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను, ఆరుగురు నిందితులను పట్టుకున్నారు. అందులో పోలీసులు, అటవీ సిబ్బంది,నిజామాబాద్ డిప్యూటీ మేయర్ పాత్ర కూడా ఉన్నట్టు గుర్తించారు. విచారణ చేసిన అటవీ శాఖ ఉన్నతాధికారులు నిజామాబాద్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి టీ. వేణు బాబు, ఫారెస్ట్ రేంజ్ అధికారి బీ. రామ్మోహన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఏ.శ్రీనివాస్‌పై వేటు వేశారు. రెండు వారాల్లో మొత్తం ఎనిమిది మంది సిబ్బందిని సస్పెండ్ చేశారు. అందులో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

బస్‌స్టేషన్లలో మినీ థియేటర్ల నిర్మాణంపై దృష్టి : ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీ తన ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు బస్‌స్టేషన్లలో మినీథియేటర్ల నిర్మాణంపై దృష్టి కేంద్రీకరిస్తున్నట్టు ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ సునీల్‌శర్మ తెలిపారు. ఆర్టీసీ ఆర్థిక పరిపుష్టి కోసం ప్రయత్నాలను ముమ్మరం చేసిందని పేర్కొన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలను కల్పించేందుకు ప్రయత్నిస్తూనే ఆదాయ మార్గాల అన్వేషణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీకి చెందిన బస్‌స్టేషన్లలో అనువైన ఖాళీ స్థలాలను గుర్తించి ఆమేరకు మినీ థియేటర్లను నిర్మించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ 97డిపోలు, 358 బస్‌స్టేషన్లు, 10504 బస్సులను కలిగి ఉందని తెలిపారు. 90 లక్షల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేయడం ద్వారా వచ్చే ఆదాయంతోపాటు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాలలోని షాపులను అద్దెకు ఇవ్వడం, ప్రకటనల వల్ల కూడా ఆదాయాన్ని సమకూర్చుకుంటుందని తెలిపారు. తెలంగాణ చలన చిత్ర అభివృద్ధి సంస్థ 15 స్థలాలలో మినీ థియేటర్లను నిర్మించడానికి ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. థియేటర్ల ద్వారా రూ 3.11 కోట్లమేర వార్షిక ఆదాయం సమకూరుతుందని అంచనా వేసినట్టు తెలిపారు.

పంచాయతీ రెండో విడతకు భారీ బందోబస్తు

- సూర్యపేట్,నల్లగొండ జిల్లాలకు అదనపు బలగాలు తరలింపు

నవ తెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో శుక్రవారం రెండో విడత పంచాయతీ పోలింగ్‌ను పురస్కరించుకుని భారీ ఎత్తున పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. తొలి విడత పోలింగ్‌లో అనేక ప్రాంతాలలో ఘర్షణలు చోటు చేసుకోవడం, అవి శాంతి భద్రతల పరిస్థితికి దారి తీసిన నేపథ్యంలో రెండో విడతకు పోలీసు ఉన్నతాధికారులు పలు ముందస్తు చర్యలను తీసుకున్నారు. రెండో విడతలో మొత్తం 4135 గ్రామ పంచాయతీలకు పోలింగ్ జరగాల్సి ఉంది. అయితే 788 పంచాయతీలకు సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికవడంతో మిగతా వాటికి కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ముఖ్యంగా నల్లగొండ, సూర్యపేట్ జిల్లాల్లో కొంత ఉద్రిక్త వాతావరణం ఏర్పడటం, స్థానికంగా బలనిరూపణ చేసుకోవాలనే తీరుతో పోటా పోటీ వాతావరణం ఏర్పడటంతో శాంతి భద్రతల పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. దీంతో ఈ రెండు జిల్లాలకు అదనంగా టీఎస్‌ఎస్‌పీ తో పాటు రిజర్వు పోలీసు బలగాలను తరలించినట్టు తెలిపారు. మిగతా జిల్లాల్లో సైతం కొంత టెన్షన్ వాతావరణం ఉన్నప్పటికి పై రెండు జిల్లాల్లో పరిస్థితి కొంత భిన్నంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. దీంతో జిల్లాల ఎస్పీలతో పాటు రీజియన్ ఐజీలు సైతం పోలింగ్ సరళిని, అక్కడ ఏర్పడుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తు తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీ మహేందర్‌రెడ్డీ ఆదేశించినట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఒక్క హత్య కూడా చోటు చేసుకోకుండా బందోబస్తును నిర్వహించామని, పంచాయతీ ఎన్నికల్లోను ఆ సంప్రదాయన్నే కొనసాగించేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఒక సీనియర్ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. బయటి నుంచి రప్పించిన మరో మూడు వేల మంది సాయుధ పోలీసులనూ బందోబస్తుకు రంగంలోకి దింపినట్టు ఆయన తెలిపారు.

బాలికలపై ఉన్న అసమానతలను నిర్మూలిస్తాం

- జాతీయ బాలిక దినోత్సవంలో హోంమంత్రి మహమూద్ అలీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అన్ని రకాల అసమానతలను నిర్మూలించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. ఆడపిల్లల పట్ల చిన్నచూపు లేకుండా బాలురతో సమానంగా ప్రోత్సహించేలా తల్లిదండ్రులు తమవంతు సహాయ సహకారాలను అందించాలని హితవు పలికారు. ముఖ్యంగా బాల్య వివాహాలు చేయడం ఒక సాంఘిక దురాచారమని దాన్ని రూపుమాపేందుకు ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. గతంలో బాల్య వివాహాల నిష్పత్తితో పోలిస్తే వాటి శాతం చాలావరకు తగ్గిందన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ గురువారం హైదరాబాద్‌లో కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. బాలికల గురించి ప్రజల్లో పూర్తి చైతన్యం తీసుకువచ్చి వారికి అన్ని రంగాల్లో అవకాశాలను, హక్కులను కల్పించడం జాతీయ బాలికాదినోత్సవం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రభుత్వం 18 ఏండ్లు నిండిన అమ్మాయిలకు వారి వివాహ ఖర్చు నిమిత్తం కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పేరిట రూ. 1,00,116 రూపాయలు అందిస్తున్నదని గుర్తుచేశారు. మహిళల సంరక్షణకు కూడా పెద్ద పీట వేసిందని, అందులో భాగంగానే షీ టీమ్‌లను ఏర్పాటు చేసి భద్రత కల్పిస్తున్నదన్నారు. బాలికలకు పూర్తి సామర్థ్యం భద్రత, అనుకూలమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. సమాజంలో బాలికల స్థితిగతులు మెరుగుపరిచి వారికి ఉన్నతమైన జీవన ప్రమాణాలను కల్పించే దిశగా తల్లిదండ్రులతో పాటు ప్రభుత్వాలు కూడా చర్యలు తీసుకుంటున్నాయన్నారు. ఒక మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబానికే తలమానికంగా నిలిచి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే శక్తిగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. బాలికల సమగ్రాభివ ద్ధికి సరైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైన ఉంటుందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు లక్ష్మిదేవి, ఆర్జేడీ రాములు, జేడీ లలిత కుమారి, డాక్టర్ హిమబిందు, డాక్టర్ యోగానంద్, ఇన్‌ఛార్జీ హైదరాబాద్ రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటనర్సమ్మ, వివిధ పాఠశాలలకు చెందిన బాలికలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు హోం మంత్రి ప్రశంసపత్రాలను అందజేశారు. చైల్డ్‌లైన్‌కు సంబంధించిన యూనిఫాం, కరపత్రాలను, పోస్టర్లను ఆవిష్కరించారు.



(ఫైల్)

సీబీఐ నూతన డైరెక్టర్‌పై నిర్ణయం వాయిదా

- తాత్కాలిక డైరెక్టర్‌పై నేడు సుప్రీంకోర్టులో విచారణ

న్యూఢిల్లీ: సీబీఐ నూతన డైరెక్టర్ ఎంపికపై ప్రధాని మోడీ నేతృత్వంలో సమావేశమైన ఉన్నతస్థాయి కమిటీ ఏ నిర్ణయం తీసుకోలేకపోయింది. గురువారం ప్రధాని అధికార నివాసంలో జరిగిన భేటీకి మోడీతోపాటు లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నేత మల్లికార్జునఖర్గే, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్‌గొగోయ్ హాజరయ్యారు. ఏ నిర్ణయమూ తీసుకోనందున మరోసారి సమావేశం కానున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.

సీబీఐ డైరెక్టర్ పదవి కోసం 1983,1984, 1985 బ్యాచ్ ఐపీఎస్ అధికారుల పేర్లను కమిటీ పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. మా ముందు 70-80 పేర్లు ఉంచారు. వారి రిటైర్‌మెంట్ తేదీలు ప్రస్తావించారు. వారికున్న అనుభవం ఇతర వివరాలేమీ ఇవ్వలేదని కమిటీలో సభ్యుడైన మల్లికార్జున ఖర్గే అసంతృప్తి వ్యక్తం చేశారు. జాబితాలో ఉన్నవారిలో ఎన్ఐఏ డీజీ వైసీ మోడీ, సీఐఎస్ఎఫ్ చీఫ్ రాజేశ్ రంజన్, బీఎస్ఎఫ్ డీజీ రజనీకాంత్‌మిశ్రా, హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రీనామిశ్రా, యూపీ డీజీపీ ఓపి సింగ్, ముంబయి పోలీస్ కమిషనర్ సుబోధ్ జైస్వాల్ ఉన్నారు.

సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి అలోక్‌వర్మను తొలగించిన కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం.నాగేశ్వరరావుకు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నియామకాన్ని సవాల్ చేస్తూ కామన్‌కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై విచారణ నుంచి చీఫ్ జస్టిస్ రంజన్‌గొగోయ్, జస్టిస్ ఎకె సిక్రీ స్వచ్ఛందంగా తప్పుకున్నందున వేరే ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టనున్నది.

ఆశాలకు పారితోషికాలు చెల్లించాలి

- తెలంగాణ వాలంటరీ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆశాలకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల పారితోషికాలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ వాలంటరీ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ ఒక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పి.జయలక్ష్మీ, ఆర్.వాణి గురువారం రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ యోగితారాణాను కలిసి వినతిపత్రం సమర్పించారు. 'అసెంబ్లీని రద్దు చేసిన రోజు సీఎం కేసీఆర్ ఆశాలకు రూ.1,500 పారితోషికాలు పెంచుతున్నట్టు ప్రకటించారు. నేటికి పెంచిన పారితోషికాలు రాలేదు. గతంలో చెల్లించే పారితోషికాలు రూ. 6,000 కూడా ఇవ్వడంలేదు. గతేడాది సెప్టెంబర్ నుంచి ఆశాలకు పారితోషికాలు పెండింగ్ లో ఉన్నాయి. ఈ కాలంలో దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలు గడిచాయి. అయినా పారితోషికాలు అందలేదు. పండుగల సందర్భంగా పారితోషికాలు రాకపోవటం, అవికూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో, ఆశాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. అధిక వడ్డీలకు అప్పు తెచ్చి కుటుంబాలను పోషిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలు చెల్లించాలి' అని ఆ వినతిపత్రంలో కోరారు.

భారతీయ బ్యాంకులకు 'నీటి కొరత' కష్టాలు

- నిరర్థక ఆస్తులు భారీగా పెరిగే అవకాశం
- వరల్డ్ వైల్డ్‌లైఫ్ : ఫండ్ రిపోర్టులో వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో తలెత్తబోయే నీటి కొరత సమస్య భారతీయ బ్యాంకుల మెడకు చుట్టుకుంటుందా? అంటే అవుననే అనిపిస్తున్నది. నీటి కొరత కారణంగా భారతీయ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు(ఎన్‌పీయే) భారీగా పెరిగే ప్రమాదం పొంచి ఉన్నది. కీలక రంగాలు(వ్యవసాయం, విద్యుత్, ఖనిజ, టెక్స్‌టైల్, తదితరమైనవి) ప్రధానంగా నీటి లభ్యతపైనే ఆధార పడుతున్న తరుణంలో మున్ముందు జల వనరులు క్షీణిస్తే సదరు సెక్టార్లతో పాటు వాటికి రుణాలిచ్చిన బ్యాంకులు కూడా దివాళా తీసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. బ్యాంకులపై నీటి కొరత ప్రభావం ఏ మేరకు ఉంటుందనే దానిపై వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్(డబ్ల్యూడబ్ల్యూఎఫ్) బుధవారం వెల్లడించిన సర్వే రిపోర్టులో ఈ వివరాలు వెల్లడయ్యాయి. భారతీయ బ్యాంకులు ఇచ్చే మొత్తం రుణాల్లో వ్యవసాయ రంగానికి 13 శాతం కేటాయిస్తున్నాయి. ఒక్క వ్యవసాయ రంగానికే 90 శాతం నీటిని వినియోగిస్తున్నారని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ పేర్కొన్నది. కరువుతో భారీగా నీటి కొరత తలెత్తితే వ్యవసాయ రంగం దివాళా తీసి.. బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించని పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నది. అంతేకాక.. నీటి కొరత కారణంగా పవర్ ప్లాంట్లు పూర్తిగా లేదా పాక్షికంగా మూతపడే అవకాశాలున్నాయని వెల్లడించింది. బ్యాంకుల నుంచి తీసుకున్న మొత్తం రుణాల్లో నీటిపైనే ప్రధానంగా ఆధారపడే రంగాల వాటా 40 శాతంగా ఉన్నది. కాగా.. ఈ మొత్తంలో ఇప్పటికే 10 శాతం నిరర్ధక ఆస్తులుగా మిగిలిపోయాయి. దాదాపు 75 శాతం బ్యాంకులు రుణాలపై తీర్మానాలు చేసే సమయంలో.. మున్ముందు తలెత్తబోయే నీటి కొరతతో ఎదురయ్యే ఇబ్బందులను ఎలా అధిగమించాలన్న దానిపై సరైన విధానాన్ని రూపొందించలేదని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ వెల్లడించింది. నిటి అయోగ్ 2018లో వెల్లడించిన రిపోర్టు ప్రకారం.. దేశంలో నీటి కొరత తీవ్రంగా ఉన్నదని తేలింది. అంతేకాక రాబోయే కాలంలో దాదాపు 60 కోట్ల మంది ప్రజలు నీటి సంక్షోభాన్ని స్వయంగా ఎదుర్కోనున్నారు. 2020 నాటికి 21 నగరాల్లో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటి పోయే ప్రమాదముందని తెలిపింది. నీటి ఎద్దడి కారణంగా 2050 నాటికి భారత జీడీపీ 6 శాతం మేర పడిపోయే అవకాశముందని వెల్లడించిన నిటి అయోగ్ వెల్లడించిన సంగతి తెలిసిందే.



అమెరికాతో తెగదెంపులు

- 72 గంటల్లో యూఎస్ దౌత్యవేత్తలు వెనెజులా నుంచి వెళ్లిపోవాలి : మదురో

కారకస్ : ప్రతిపక్ష నేత జువాన్ గైడోను వెనెజులా అధ్యక్షుడిగా అమెరికా గుర్తించడం పట్ల ఆ దేశ ప్రస్తుత అధ్యక్షుడు నికోలస్ మదురో ఘాటుగా స్పందించారు. అగ్రరాజ్యం అమెరికాతో దౌత్య పరమైన సంబంధాలన్నీ తెంచుకుంటున్నామని పేర్కొన్నారు. 72 గంటల్లోగా అమెరికా దౌత్యవేత్తలు, ప్రతినిధులంతా తమ దేశాన్ని విడిచి వెళ్లిపోవాలంటూ ఆయన హెచ్చరించారు. వెనెజులా అధ్యక్షుడిగా మదురో గతేడాది మేలో రెండోసారి బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే మదురో పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ పతనమైందని, శాంతి భద్రతలు క్షీణించాయన్న ఆరోపణలపై ఆయనను అధ్యక్షుడిగా గుర్తించడానికి అమెరికా నిరాకరించింది. అంతేకాకుండా ప్రతిపక్ష నేత జువాన్ గైడోను అసలైన అధ్యక్షుడిగా గుర్తిస్తున్నామంటూ పేర్కొంది. ఈ మేరకు.. 'వెనెజులా ప్రజలు మదురో పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జువాన్‌ను వెనెజులా అధ్యక్షుడిగా నేను ఈ రోజు అధికారికంగా గుర్తిస్తున్నాను' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్వీట్ చేశారు.

ఈ నేపథ్యంలో అగ్రరాజ్య తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన మదురో తన మద్దతుదారులతో కలిసి అధ్యక్ష భవనంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా 'రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన అధ్యక్షుడిగా.. అమెరికాతో దౌత్యపరమైన, రాజకీయ ఇలా అన్ని రకాల సంబంధాలను తెంచుకోవాలని నిర్ణయించాను. దేశ ప్రజల ముందు, ప్రపంచంలోని అన్ని దేశాలకు ఈ విషయం తెలియజేస్తున్నాను. గెట్ అవుట్.. వెనెజులాను వదిలి వెళ్లండి. మాకు ఆత్మగౌరవం ఉంది.. డ్యామిట్' అని మదురో వ్యాఖ్యానించారు. వెనెజులాను తోలు బొమ్మను చేసి అమెరికా అధికారం చెలాయించాలని చూస్తోందని ఘాటుగా విమర్శించారు. కాగా, దక్షిణ అమెరికా దేశమైన వెనెజులాలో ప్రస్తుతం రాజకీయ అనిశ్చితి నెలకొంది. ప్రముఖ ప్రతిపక్ష నాయకులు ఎన్నికల్లో నిషేధానికి గురవడం, కొన్ని పార్టీలు పోటీకి దూరం కావడంతో అధ్యక్ష ఎన్నికల్లో తాను గెలిచినట్టు మదురో మేలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్తగా ఎన్నికలు నిర్వహించాలంటూ నిరసనకారులు ఆందోళనలు చేపట్టారు. ఇక ప్రతిపక్ష నేత జువాన్ గైడోను అధ్యక్షుడిగా అమెరికా గుర్తించడాన్ని కొలంబియా కూడా సమర్థించింది.

అంతర్గత వ్యవహారాల్లో అమెరికా వేలు పెట్టద్దు

వెనెజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకోవడం పట్ల రష్యా, చైనా, టర్కీ ఆగ్రహం వ్యక్తం చేశాయి. మదురోను గద్దె దించేందుకు అమెరికా కుట్రపన్నిందని పేర్కొన్నాయి. 'మేము మీకు మద్దతిస్తున్నాం...మదురో' అంటూ పుతిన్ ఫోన్‌లో మాట్లాడారని మదురో అధికార ప్రతినిధి ఇబ్రహీమ్ కాలిన్ తెలిపారు. గైడో తనకు తాను అధ్యక్షుడిగా ప్రకటించుకోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నట్టు టర్కీ విదేశాంగ మంత్రి మెవ్లత్ కవుసోగ్లూ తెలిపారు. టర్కీ కూడా వెనెజులాకు మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. చైనా కూడా మదురోకు మద్దతిస్తున్నదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ తెలిపారు. బొలీవియా, క్యూబా కూడా తాజాగా వెనెజులాకు మద్దతు తెలిపాయి.

వెనెజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా తలదూర్చడంపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటేరస్ స్పందించారు. ఈ సున్నితమైన వివాదాన్ని చర్చల ద్వారా మాత్రమే పరిష్కరించుకోవాలని కోరారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ వేదికగా ఐరాస జనరల్ సెక్రటరీ స్పందించారు.

ఇంటర్నెట్ సేవల నిలిపివేత : వెనెజులాలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలు నిలిపివేసింది.



మదురోను అధ్యక్ష పీఠం నుంచి తప్పించాలని ఓ వర్గం, గైడోకు ప్రెసిడెంట్‌గా చూడాలన్నదే తమ ఆకాంక్ష అంటూ మరోవర్గం ఆందోళనలు చేపడుతున్నాయి. ఈనేపథ్యంలో పలు హింసాత్మక ఘర్షణలు చోటుచేసుకునే అవకాశమున్నాయని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్టు ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. ప్రభుత్వ తదుపరి ఆదేశాలు అందేంత వరకు నెట్ సేవలు నిలిపివేస్తున్నామని నెట్‌బ్లాక్స్.ఓఆర్‌జీ సంస్థ వెల్లడించింది.

జోక్యం తగదు

- తీవ్రంగా ఖండించిన సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ: వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యాన్ని సీపీఐ(ఎం) తప్పుబట్టింది. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన మదురో ప్రభుత్వం అంతర్గత వ్యవహారాల్లో అమెరికా తలదూర్చడాన్ని ఆ పార్టీ తీవ్రంగా ఖండించింది. ప్రతిపక్ష నాయకుడు జువాన్ గైడోను అధ్యక్షుడిగా అమెరికా గుర్తిస్తూ వెనిజులాలో రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి, తిరుగుబాటును ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించింది. నికోలస్ మదురో.. గతేడాది మే20న రాజ్యాంగబద్ధంగా జరిగిన ఎన్నికల్లో వెనిజులా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని గుర్తు చేసింది. అక్కడ ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా జరగడాన్ని ప్రపంచ దేశాలూ గమనించాయని సీపీఐ(ఎం) తెలిపింది.



వెనిజులాలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని ఆర్థిక ఆంక్షలు, సైనిక బలగాల జోక్యంతో పాటు అనేక రకాలుగా అస్థిరపరచాలని అమెరికా ప్రయత్నిస్తోందని విమర్శించింది. ఇది ఐక్యరాజ్య సమితి నిబంధనలను ఉల్లఘించడమేనని తెలిపింది. అమెరికా చేసే ప్రయత్నాలను అక్కడి ప్రజలు తిప్పి కొడుతూ మదురో ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తారని విశ్వాసం వ్యక్తం చేసింది. తమదేశ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వెనిజుల ప్రజలకు ప్రపంచంలోని ప్రజాస్వామ్యవాదులు, శాంతియుత వాదులు మద్దతునిస్తూ సంఘీభావం తెలిపాలని సీపీఐ(ఎం) కోరింది.

లైంగిక వేధింపుల కేసుల్లో...

స్కాట్లాండ్ మాజీ మంత్రి అరెస్ట్



ఎడిన్‌బర్గ్ : లైంగిక వేధింపుల కేసుల్లో స్కాట్లాండ్ మాజీ మంత్రి అలెక్స్ సాల్మండ్ (64) అరెస్టయ్యారు. ఆయనను కోర్టులో ప్రవేశపెట్టనున్నట్టు పోలీస్ అధికారులు తెలిపారు. రెండు లైంగిక వేధింపుల కేసుల్లో ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 2013లో అధికారం లో ఉన్నప్పుడు తనపై ప్రతిపక్ష నేతలు తప్పుడు కేసులు బనాయించారని, తాను నిరపరాధినని సాల్మండ్ తెలిపారు. తన ప్రతిష్టను దిగజార్చాలనే కుట్రతోనే ప్రతిపక్ష నేత నికోలస్ స్టర్గెయిన్ ఇద్దరు మహిళలతో తప్పుడు కేసులు పెట్టించారని అన్నారు. ఈ కేసులను తాను న్యాయస్థానంలో ఎదుర్కొంటానని సాల్మండ్ చెప్పారు. కాగా,2007లో స్కాట్లాండ్ తొలి మంత్రిగా సాల్మండ్ పదవీ బాధ్యతలు చేపట్టారు. 2014లో స్కాట్లాండ్ స్వతంత్ర్య రాజ్య ఆవిర్భావం కోసం జరిగిన ప్రజాభిప్రాయసేకరణకు ఆయన సంపూర్ణ మద్దతు తెలిపారు. గతేడాది స్కాటిష్ నేషనల్ పార్టీ నుంచి తప్పుకున్నారు. పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయిన వెంటనే ఆయనపై రెండు కేసులు నమోదు కావడం గమనార్హం.

సిరియాలో 'సేఫ్ జోన్' : టర్కీ



అంకారా : సిరియాలో సేఫ్ జోన్ ఏర్పాటునకు కసరత్తు ప్రారంభించినట్టు టర్కీ వెల్లడించింది. సిరియా-టర్కీ దేశాల సరిహద్దులో సేఫ్ జోన్ ఏర్పాటు చేయనున్నట్టు టర్కీ విదేశాంగ మంత్రి మెవ్లత్ కవుసోగ్లూ తెలిపారు. సేఫ్ జోన్ ఏర్పాటుకు సహకరించాల్సిందిగా రష్యాను కోరామని చెప్పారు. సిరియాలో రాజకీయ అనిశ్చితిని తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని అన్నారు. సిరియాలో అంతర్యుద్ధ నిర్మూలన కోసం ఆదేశాధ్యక్షుడు అస్సద్, రష్యా అధ్యక్షుడు పుతిన్ అవసమరైన ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిపెట్టారని అన్నారు. ఉగ్రసంస్థల నిర్మూలన కోసం నిర్వహిస్తున్న కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తామని అన్నారు. సిరియా-టర్కీ సరిహద్దులో 32కిలోమీటర్ల మేర సేఫ్‌జోన్ ఏర్పాటు విషయమై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో గతవారం చర్చించగా సానుకూలంగా స్పందించారని చెప్పారు. కాగా, సిరియా నుంచి అమెరికా బలగాలు వైదొలిగిన అనంతరం విభిన్న పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఐఎస్‌పై జయకేతనం ఎగురవేయడంతోనే తమ బలగాలను వెనక్కి పిలిపించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ట్రంప్ ప్రకటనను వ్యతిరేకిస్తూ యూఎస్ రక్షణ మంత్రి మాటిస్ సహా పలువురు కీలక అధికారులు ఇప్పటికే తమ పదవుల నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. సిరియా నుంచి యూఎస్ బలగాలు వైదొలగడం పట్ల రిపబ్లికన్ పార్టీ నేతలు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. సిరియాలోని ఉగ్రసంస్థల నిర్మూలన కోసం అమెరికా బలగాలతో కలిసి పోరాడిన కుర్దు తిరుగుబాటుదారులపై (వైపీజీ) టర్కీ ఉగ్రవాద ముద్ర వేసింది. తొలుత వైపీజీని తుద ముట్టించిన అనంతరం ఐఎస్‌పై యుద్ధం ప్రకటిస్తామని ఎర్డోగన్ చేసిన ప్రకటనపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైపీజీపై దాడులకు పాల్పడినట్టయితే టర్కీ ఆర్థిక ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మరోవైపు టర్కీ బలగాలపై దాడులకు పాల్పడొద్దంటూ వైపీజీని కూడా ట్రంప్ హెచ్చరించారు. టర్కీ-సిరియా సరిహద్దులో సేఫ్ జోన్ ఏర్పాటు చేసుకోవచ్చునని ఎర్డోగన్‌కు ట్రంప్ సూచించారు.

షట్‌డౌన్ ముగిసిన తర్వాతే..

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్: అమెరికాలో కొనసాగుతున్న షట్‌డౌన్ కారణంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. అమెరికా-మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి అవసరమైన నిధులు రాబట్టడంలో విఫలం కావడంతో ఆయనలో అసహనం మరింత పెరిగిపోయింది. సరిహద్దు గోడ కట్టాల్సిందేనంటూ భీష్మించుకొని కూర్చున్నారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాల కారణంగా 8లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులు జీతాలు లేకుండా పనిచేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈనెల29న యూఎస్ కాంగ్రెస్ వార్షిక సమావేశాలు జరుగనున్నాయి. ఈ సమావేశాలకు ట్రంప్ హాజరై 'స్టేట్ ఆఫ్ ది యూనియన్'ను ఉద్దేశించి ప్రసంగించాల్సి ఉంది. అయితే, యూఎస్‌లో పాలనస్తంభిన కారణంగా ప్రెసిడెంట్‌కు గతంలో పంపిన ఆహ్వానాన్ని రద్దు చేసుకున్నట్టు ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ



పెలోసీ (డెమోక్రటిక్ పార్టీ) బుధవారం ప్రకటించారు. ట్రంప్‌నకు ప్రసంగించే అవకాశం ఇవ్వలేమని తేల్చి చెప్పారు. పెలోసీ ప్రకటనపై ట్రంప్ మండిపడ్డారు. షట్‌డౌన్ ముగిసేంత వరకు వేచి ఉంటానని, ప్రతినిధుల సభలో తాను ప్రసంగించనని ట్రంప్ ట్వీట్ చేశారు. 'షట్‌డౌన్ కొనసాగుతుండగా 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' ప్రసంగం చేయమని నాన్సీ పెలోసీ కోరారు. నేనూ అంగీకరించాను. కానీ షట్‌డౌన్ కారణంగా ఆమె మనసు మార్చుకున్నారు. ప్రసంగాన్ని మరో తేదీకి మార్చుకోవాలని సూచించారు' అని ట్రంప్ ట్వీట్ చేశారు. అమెరికాలో షట్‌డౌన్ ముగిసిన తర్వాతే ప్రసంగిస్తానని స్పష్టంచేశారు. అలాగే తాను మరో వేదిక కోసం ప్రయత్నించడం లేదని చెప్పారు. చరిత్ర, సంప్రదాయం, హౌస్ ఛాంబర్ ప్రాధాన్యతతో ఎవ్వరూ పోటీ పడలేరని అన్నారు. త్వరలో గొప్ప ప్రసంగం చేయడానికి ఎదురు చూస్తున్నానని తెలిపారు. ఇదిలా ఉండగా, స్పీకర్ నాన్సీ పెలోసీ ట్రంప్ ప్రసంగానికి అడ్డు చెప్పడంతో తొలుత ట్రంప్ మరో వేదికను ఎంచుకుని 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' ప్రసంగం చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. మెక్సికోతో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధుల విషయంలో ట్రంప్, డెమోక్రాట్ల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయి. దీంతో ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం పొందక అమెరికాలో పాక్షిక షట్‌డౌన్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇరు పార్టీలు షట్‌డౌన్‌కు ముగింపు పలికేందుకు చర్చలు జరుపుతున్నాయి.

అమెరికా చరిత్రలోనే అతిపెద్ద షట్‌డౌన్

అమెరికాలో 34 రోజుల నుంచి పాలన స్తంభించింది. అమెరికా చరిత్రలోనే ఇది అతిపెద్ద షట్‌డౌన్ అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. అమెరికా- మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు తప్పకుండా రాబట్టాలని ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. డెమోక్రాటిక్, రిపబ్లికన్ పార్టీ సెనెటర్ల మధ్య తలెత్తిన అభిప్రాయ బేధాల కారణంగా దాదాపు 8లక్షల మంది ఫెరడల్ ఉద్యోగులు జీతాలు లేకుండా పనిచేయాల్సిన దుస్థితి నెలకొంది.

మెక్సికో-అమెరికా సరిహద్దు లో గోడ నిర్మాణం కోసం ట్రంప్ నిధులు రాబట్టడమే సరైన నిర్ణయమంటూ కేవలం7శాతం మంది ఓటర్లు మాత్రమే తమ అభిప్రాయాన్ని వెల్లడించారని మార్నింగ్ కన్సల్ట్ పోల్ సంస్థ గురువారం పేర్కొంది. రెండు దేశాల సరిహద్దులో గోడ నిర్మించాలనే ట్రంప్ నిర్ణయాన్ని మెజారిటీ అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారని తెలిపింది.

తప్పుడు సమాచారంపై జాగ్రత్త

- సంచలనాలతో విశ్వసనీయత రాదు : గీతం సదస్సులో మాజీ ఎమ్మెల్సీ కె నాగేశ్వర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తప్పుడు వార్తలు, తప్పుడు సమాచారంపై జాగ్రత్తగా ఉండాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె నాగేశ్వర్ అన్నారు. సంచలనాత్మక వార్తలతో మీడియాకు విశ్వసనీయత రాదని స్పష్టం చేశారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని గాంధీ స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్‌హెచ్‌ఎస్) ఆధ్వర్యంలో 'మారుతున్న మీడియా పరిణామాలు-మానసిక, సాంస్కృతిక, రాజకీయ పరస్పర సంబంధాలు'అనే అంశంపై రెండోరోజులపాటు జరిగే సదస్సు గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వర్ మాట్లాడుతూ మీడియాలో వచ్చిన వార్తలను గుడ్డిగా నమ్మే పరిస్థితిలో లేమని చెప్పారు. వ్యాపారులు, రాజకీయ నాయకులు, మీడియా సంస్థల మధ్య ఏర్పడుతున్న సాన్నిహిత్యమే ఇందుకు నిదర్శనమని అన్నారు. అధికారంలో ఉన్న వారిని విమర్శించే పాత్రను మీడియా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాయుతంగా, ధర్మంగా ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. కానీ మీడియా ప్రజలను విభజించి ఒకవైపు మొగ్గేలా ప్రేరేపిస్తోందని చెప్పారు. మీడియాపై విరక్తిని పెంచుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల కోసం వార్తలు చేరవేయడానికి ఇప్పటికీ ప్రయివేటు మీడియా సంస్థల ద్వారా అవకాశముందని చెప్పారు. యూట్యూబ్ ద్వారా సొంత ఛానెల్‌ను ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. తన యూట్యూబ్ సొంత ఛానెల్‌ను 62 లక్షల మంది వీక్షిస్తున్నారని చెప్పారు. ప్రఖ్యాత పాత్రికేయులు, రచయిత పరంజయ్ గుహ ఠాకుర్త మాట్లాడుతూ మాస్ కమ్యూనికేషన్ వ్యక్తిగత కమ్యూనికేషన్‌తో కలిసిపోయిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 60 శాతం మంది ఇంటర్నెట్‌ను ఆదరిస్తున్నారని అన్నారు. దీంతో ప్రధాన మీడియాకు ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని చెప్పారు. ప్రభుత్వం పెద్దఎత్తున ప్రకటనలను జారీ చేస్తుండడంతో మీడియా సంస్థలు వాటి కర్తవ్యాన్ని విస్మరించి ప్రభుత్వానికి



అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. బహుళజాతి సంస్థలైన ఫేస్‌బుక్, అమెజాన్, యాపిల్, ఆల్ఫాబీట్, ఆలీబాబా, నెట్‌ఫిక్స్‌లు ఏది వినాలో, ఏది చదవాలో, ఏది చూడాలో శాసిస్తున్నాయని అన్నారు. మాధ్యమాల్లో మారుతున్న పరిణామాలను పరిశీలించి, తప్పొప్పులను గ్రహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ఎన్ శివప్రసాద్, పీఆర్‌ఎస్‌ఐ చైర్మెన్ పి వేణుగోపాల్‌రెడ్డి, సదస్సు నిర్వాహకుడు డి సురేష్‌కుమార్, జీఎస్‌హెచ్‌ఎస్ ఇన్‌చార్జ్జీ ప్రిన్సిపాల్ వై ప్రభావతి, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

మద్ధతు ధర అమలుకు చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో మద్ధతు ధర అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. జంగారెడ్డి, కార్యదర్శి టి. సాగర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వానాకాలం, వర్షాభావ పరిస్థితులు, అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. దిగుబడి తగ్గిందని తెలిపారు. పత్తి, కంది, మొక్కజొన్న వరి ధాన్యం మార్కెట్‌కు తీసుకొస్తే మద్ధతు ధర కరువైందన్నారు. దాదాపు 220 మండలాల్లో కరువు నెలకొందని, ఆయా మండలాల్లో నష్టపోయిన పంటలకు అంచనా వేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

వచ్చే నెల 1 నుంచి 3 వరకు జాతీయ మత్స్య ఉత్సవం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



వచ్చే నెల 1 నుంచి 3 వరకు జాతీయ మత్స్య ఉత్సవం నిర్వహించనున్నట్టు నేషనల్ ఫిష్ డెవలప్‌మెంట్ బోర్డు చీఫ్ ఎగ్జిగ్యూటివ్ ఐ. రాణి కుముదిని చెప్పారు. హైదరాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పీపుల్స్ ప్లాజా నెక్లెస్ రోడ్‌లో ఈ ఉత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఫిష్ ఫెస్టివల్ రెస్టారెంట్లు, ప్రభుత్వ సంస్థలు, పారిశ్రామికవేత్తలు ప్రాల్గొంటారని చెప్పారు. చేపలు, రొయ్యల, ప్రదర్శన మరియు అమ్మకాలు, చేపల పెంపకం, ఉత్పత్తుల అమ్మకాలుంటాయని వివరించారు. చేపలు కూరగాయల ఆధారిత ఆహారంలో అమైనో ఆమ్లాలు తక్కువ పరిమాణంలో ఉంటాయని,. చేపల ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆ లోపాన్ని తొలగించవచ్చని అన్నారు. మానవ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఒమేగా-3 కొవ్వు ఆమ్లం చేపల్లో పుష్కలంగా ఉంటుందని చెప్పారు. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ వారంలో కనీసం రెండుసార్లు చేపలు తినాలని సిఫార్సు చేసిందని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల ఆహారంలో చేప ముఖ్యమైనదన్నారు. భారతదేశంలో చేపల మరియు చేపల ఉత్పత్తుల జాతీయ సగటు వార్షిక వినియోగం చాలా తక్కువగా ఉందిని, చేపల ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని అన్నారు. దేశంలో చేపల వినియోగంపై ప్రచారం చేయడానికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఫిష్ ఫెస్టివల్స్ అనేక రాష్ట్రాలలో నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

పెరిగిన వేతనాలు చెల్లించండి

- సెల్ఫ్ ఫైనాన్స్ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల్లో సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు పెరిగిన వేతనాలు చెల్లించాలని సెల్ఫ్‌ఫైనాన్స్ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద సెల్ఫ్‌ఫైనాన్స్ అధ్యాపకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సెల్ఫ్‌ఫైనాన్స్ కాంట్రాక్టు టీచర్ల సంఘం అధ్యక్షులు రాజు చిట్యాల మాట్లాడుతూ జీవో నెంబర్ 11 ప్రకారం విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు పెరిగాయని చెప్పారు. జీవో విడుదలై తొమ్మిది నెలలు కావస్తున్నా సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు పెరిగిన వేతనాలు చెల్లించడం లేదన్నారు. రెగ్యులర్ కోర్సుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకే జీతాలు పెరిగాయని చెప్పారు. రాష్ట్రంలో 1,500 మంది కాంట్రాక్టు అధ్యాపకులుంటే, వారిలో 600 మందికే పెరిగిన వేతనాలు అమలవుతున్నాయనీ, మిగిలిన 900 మందికి అమలు కావడం లేదనీ ఆందోళన వ్యక్తం చేశారు. సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల్లో పనిచేస్తున్న వారికీ పెరిగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉన్నత విద్యామండలి చైర్మెన్ పాపిరెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. 15 రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పాపిరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెల్ఫ్‌ఫైనాన్స్ కాంట్రాక్టు టీచర్ల సంఘం నాయకులు కిరణ్, స్వప్న, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం



'మహర్షి'లో మహేష్‌బాబు



'మజిలీ'లో సమంత, నాగచైతన్య



'జెర్సీ'లో నాని



'118'లో కళ్యాణ్‌రామ్

సమ్మర్ స్పెషల్‌గా సందడికి సిద్ధం !

సినిమాల విడుదలకి సీజన్లే చాలా ముఖ్యం. సంక్రాంతి ఓ పెద్ద సీజన్. ఈ పండుగని పురస్కరించుకుని 'ఎన్టీఆర్ కథానాయకుడు', 'వినయ విధేయ రామ', 'పేట', 'ఎఫ్2' చిత్రాలు వచ్చాయి. ఇందులో బాక్సాఫీసు వద్ద 'ఎఫ్2' పర్వాలేదనిపించుకుని భారీ కలెక్షన్ల దిశగా దూసుకుపోతుంది. ఇక రాబోతున్న సీజన్‌లో సమ్మర్ అతి పెద్దది. మార్చిలో ప్రారంభమయ్యే ఈ సీజన్ ఏప్రిల్, మే వరకు సాగుతుంది. ఈ సీజన్‌ని పురస్కరించుకుని పలు పెద్ద సినిమాలు సందడికి సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే రిలీజ్ డేట్‌ని లాక్ చేసుకున్న సినిమాలేంటి? అనేది చూద్దాం.

సమ్మర్ సీజన్ ప్రధానంగా మార్చి నెలతోనే ప్రారంభమవుతుంది. అందులో భాగంగా మార్చి 1న అల్లు శిరీష్ హీరోగా రూపొందుతున్న 'ఏబీసీడీ' విడుదల కాబోతుంది. సంజీవ్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రుక్సార్ థిల్లాన్ కథానాయిక. డి.సురేష్‌బాబు సమర్పణలో మధుర శ్రీధర్, యష్ రంగినేని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మలయాళంలో వచ్చిన 'ఏబీసీడీ'కి రీమేక్‌గా ఈ సినిమా తెరకెక్కుతుంది. ఇదే రోజు కళ్యాణ్ రామ్ నటిస్తున్న '118' కూడా రిలీజ్ కాబోతుంది. సినిమాటోగ్రాఫర్ కె.వి.గుహన్ దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రమిది. మహేష్ కోనేరు నిర్మిస్తున్నారు. ఇందులో షాలిని పాండే కథానాయికగా నటిస్తుంది. కళ్యాణ్ రామ్ నటించిన గత చిత్రం 'నా నువ్వే' బాక్సాఫీసు వద్ద డిజాస్టర్ అయ్యింది. ఈ నేపథ్యంలో తాజా సినిమాపై ఆయన భారీ అంచనాలు పెట్టుకున్నారు. వీటితోపాటు పలు నోటెడ్ సినిమాలు మార్చిలో రిలీజ్‌కి రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఇక సమ్మర్‌లో ఏప్రిల్‌ని పురస్కరించుకుని ఐదు సినిమాలు సందడికి సిద్ధమవుతున్నాయి. ఏప్రిల్ 5న 'మజిలీ' రాబోతుంది. పెళ్ళైన తర్వాత నాగచైతన్య, సమంత నటిస్తున్న తొలి చిత్రమిది. 'నిన్నుకోరి' ఫేమ్ శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది సంయుక్తంగా నిర్మిస్తున్నారు. క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందుతుంది. షాలిని పాండే ఇందులో మరో కథానాయిక. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్స్ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. నాగచైతన్య నటించిన 'సవ్యసాచి', 'యుద్ధంశరణం', 'శైలజారెడ్డి అల్లుడు' చిత్రాలు పరాజయం చెందడంతో ఈ సినిమాపైనే తన హోప్స్ పెట్టుకున్నారు. పెళ్లైన తర్వాత సమంత, చైతూ కలిసి నటిస్తున్న సినిమా కావడంతో ఆడియెన్స్‌లోనూ క్రేజ్ నెలకొంది.

మరి ఈ సమ్మర్‌కిది ఎలాంటి సందడిని పంచుతుందో చూడాలి. ఏప్రిల్‌లో రాబోతున్న మరో సినిమా 'చిత్రలహరి'. సాయిధరమ్ తేజ్, కళ్యాణి ప్రియదర్శన్, నివేదా పేతురాజ్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా ఎంటైన్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆడియెన్స్‌కి వేసవి విందుని పంచబోతుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. 'తిక్క', 'విన్నర్', 'నక్షత్రం', 'జవాన్', 'ఇంటలిజెంట్', 'తేజ్ ఐ లవ్ యూ' వంటి డబుల్ హ్యాట్రిక్ ఫ్లాప్ తర్వాత సాయిధరమ్ తేజ్ నటిస్తున్న సినిమా ఇది. దీంతో ఎలాగైనా హిట్ కొట్టాలని సాయిధరమ్ తేజ్ కసితో ఉన్నాడు. సూర్య నటిస్తున్న డబ్బింగ్ చిత్రం 'ఎన్జీకే' ఏప్రిల్ 12నే రిలీజ్‌కి కానుంది. సెల్వ రాఘవన్ దర్శకత్వంలో పొలిటికల్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందుతుంది.


సాయి పల్లవి, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా నటిస్తున్నారు. సూర్య నటించే సినిమాలు తెలుగులోనూ మంచి ఆదరణ పొందుతుంటాయి. వాటిలాగే ఈ సినిమా కోసం ఆడియెన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'కాంచన 3' సైతం ఏప్రిల్ 18న సందడికి సిద్ధమవుతుంది. రాఘవ లారెన్స్ రూపొందించిన ఈ హర్రర్ కామెడీ చిత్రాలు గతంలో మంచి విజయాలని అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ సీక్వెల్‌పై అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇందులో రాఘవ లారెన్స్ ప్రధాన పాత్రలో నటించడం విశేషం. ఒక్క రోజు గ్యాప్‌తో నాని సందడి చేయబోతున్నారు. ఆయన క్రికెట్ నేపథ్యంలో 'జెర్సీ' చిత్రంలో నటిస్తున్నారు. 'మళ్ళీరావా' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ సినిమాతో సరికొత్త వినోదాన్ని పంచేందుకు నాని సిద్ధమవుతున్నారు. ఇందులో ఆయన సరసన శ్రద్ధ శ్రీనాథ్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఏప్రిల్ నెలకు మహేష్‌బాబు ఫుల్ స్టాప్ పెట్టబోతున్నారు. వంశీపైడిపల్లి దర్శకత్వంలో ఆయన నటిస్తున్న 'మహర్షి' చిత్రాన్ని ఏప్రిల్ 25న విడుదల చేయనున్నట్టు దిల్‌రాజు ప్రకటించారు. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో అల్లరి నరేష్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సందేశం మేళవించిన కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండబోతుందట. ఇప్పటికే విడుదలైన మహేష్ లుక్స్ ఆకట్టుకుంటున్నాయి. స్టూడెంట్‌గా, కార్పొరేట్‌గా రెండు భిన్న గెటప్స్‌లో మహేష్ కనిపిస్తారట. దీంతోపాటు మే నెలలో పలు మీడియం బడ్జెట్ నుంచి భారీ బడ్జెట్ చిత్రాలు రిలీజ్‌కి ప్లాన్ చేసుకుంటున్నాయి.



సాయిధరమ్ తేజ్, కళ్యాణి ప్రియదర్శిన్



'ఏబీసీడీ'లో అల్లు శిరీష్



'ఎన్జీకే'లో సూర్య



'కాంచన 3'లో రాఘవ లారెన్స్

అభిమానులకి డబుల్ ట్రీట్



ప్రభాస్

ప్రభాస్ నటిస్తున్న 'సాహో' సినిమాపై ఆయన అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత స్టయిలీష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రేసింగ్ ప్రధానంగా సాగుతుందని తెలుస్తుంది. యువి క్రియేషన్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు తెలుగు, తమిళం, హిందీలో నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్ట్ 15న విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం ప్రకటించింది. దీంతోపాటు రాధాకృష్ణ దర్శకత్వంలో పీరియడ్ లవ్ స్టోరీ నేపథ్యంలో ఓ సినిమా తెరకెక్కుతుంది. 'సాహో'తోపాటు ఈ సినిమా చిత్రీకరణలోనూ ప్రభాస్ పాల్గొంటూ బిజీగా గడుపుతున్నారు. ఇందులో పూజా హెగ్డే కథానాయిక. అయితే సినిమా వచ్చే ఏడాది విడుదలయ్యే అవకాశం ఉన్నట్టు గతంలో వార్తలు వచ్చాయి. కానీ ప్రభాస్ ఈ ఏడాదిలోనే రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారట. 'బాహుబలి 2' తర్వాత ప్రభాస్ నుంచి మరే సినిమా రాలేదు. గతేడాది ఆయన ఒక్క చిత్రంలోనూ కనిపించలేదు. ఈనేపథ్యంలో ఈ ఏడాది డబుల్ ట్రీట్ ఇవ్వాలనుకుంటున్నారట. దానికి తగ్గట్టుగా త్వరగా పూర్తి చేసే పనిలో ఉన్నారు. దీనికి 'జాన్' అనే పేరుని పరిశీలిస్తున్నట్టు సమాచారం.

సౌత్‌ఇండియన్ అని గర్వంగా చెప్పుకుంటా



'లవర్స్ డే' ఆడియో ఆవిష్కరణ దృశ్యం

'సౌత్ ఇండియన్ సినిమాల్లో అంతర్జాతీయంగా వైరల్ అయిన వీడియోస్‌లో 'కొలవెరి.. డీ', 'బాహుబలి'లో 'హు కిల్డ్ కట్టప్ప..',ల తర్వాత ఆ రేంజ్‌లో వైరల్ అయిన వీడియో 'ఒరు ఆడార్ లవ్'. ఈ చిత్ర వేడుకకి నేను రావడం ఆనందంగా ఉంది' అని అల్లు అర్జున్ అన్నారు. ప్రియా ప్రకాష్ వారియర్ , రోషన్ జంటగా నటించిన చిత్రం 'ఒరు ఆడార్ లవ్'. ఒమర్ లులు దర్శకత్వం వహించిన ఈ మలయాళ చిత్రాన్ని సుఖీభవ సినిమాస్ సంస్థపై ఎ.గురురాజ్, సి.హెచ్.వినోద్‌రెడ్డి సంయుక్తంగా తెలుగులో ఫిబ్రవరి 14న విడుదల చేస్తున్నారు. షాన్ రెహ్మాన్ సంగీతం అందించిన ఈ చిత్ర ఆడియో విడుదల వేడుక బుధవారం జరిగింది. అల్లు అర్జున్ అతిథిగా విచ్చేసి పాటల సీడీలని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నాకు సౌత్ ఇండియా అంటే పిచ్చి. నా ప్రొఫెషనల్‌లో సౌతిండియన్ యాక్టర్ అని రాసుకుంటా. అందుకు గర్వపడుతున్నా. నేను పుట్టింది చెన్నైలో, పెరిగింది హైదరాబాద్‌లో. అలాగే మలయాళం వాళ్ళు, కర్నాటక వాళ్ళు కూడా నన్ను ఆదరిస్తున్నారు. కాబట్టి నేను సౌత్ ఇండియన్‌ని. ఈ సినిమా ద్వారా మలయాళ ఇండస్ట్రీని ఆహ్వానిస్తున్నా. మన సినిమాలని వేరే భాషల్లో చూస్తున్నారు. ఈ సినిమాకి సోషల్ మీడియా ద్వారా బజ్ క్రియేట్ చేసిన రోషన్, ప్రియా వారియర్‌కి అభినందనలు. ఈ సినిమా క్రెడిట్ దర్శకుడు ఒమర్‌ది. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' టైమ్‌లో గొడవైంది. ఆ సమయంలో వినోద్ రెడ్డి ఎలా నిలబడ్డాడో, ఇప్పుడు కూడా అలానే ఉన్నాడని వాసు ద్వారా తెలుసుకున్నా. అందుకే ఆయన కోసం వచ్చా. నేను ఎంత కాలం నిలబడగలనో తెలియదు. అవకాశం ఉన్న ప్రతి సారి నా కోసం నిలబడ్డ ప్రతి ఒక్కరి కోసం నిలబడతాను. గురురాజ్‌కి అభినందనలు. ఈ సినిమా లవర్స్ డే సందర్భంగా విడుదలవుతుంది. నా పుట్టిన రోజుకి ఎంత ఎగ్జైటింగ్‌గా ఉంటానో, లవర్స్ డేకి కూడా అంత కంటే 10శాతం ఎగ్జైటింగ్‌గా ఉంటాను. నా భార్యని ఎలా సర్‌ప్రైజ్ చేయాలో ఆలోచిస్తా. ఈ సినిమా అన్ని భాషల్లో విజయం సాధించాలి' అని అన్నారు. 'అల్లు అర్జున్ అంటే నాకిష్టం. ఆయనతో కలిసి స్టేజ్‌పై నిలబడే అవకాశం వస్తుందని అనుకోలేదు. ఈ అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికి థ్యాంక్స్. మా టీమ్ నుంచి అడ్వాన్స్ హ్యాపీ వాలెంటైన్స్ డే' అని ప్రియా ప్రకాష్ వారియర్ తెలిపారు. చిత్ర దర్శకుడు ఒమర్ లులు చెబుతూ, 'మలయాళంలో చాలా మంది స్టార్స్ ఉన్నా, మా వీడియో ఎవరూ షేర్ చేయలేదు. అల్లు అర్జున్ మాత్రమే షేర్ చేశారు. చాలా మంది కొత్త వాళ్ళని ఈ సినిమాతో పరిచయం చేస్తున్నాం. ప్రేక్షకుల ఆశీర్వాదం సినిమా రిలీజ్ తర్వాత కూడా ఉండాలని కోరుకుంటున్నా' అని చెప్పారు. 'నేను బన్నీకి పెద్ద అభిమానిని. నాకు సినిమా అంటే ప్యాషన్. అందుకే ఈ రంగంలోకి వచ్చా. సీతారామరాజు, సురేష్ సపోర్ట్‌తో ఈ సినిమాని తెలుగులో విడుదల చేసే అవకాశాన్ని దక్కించుకున్నా. సినిమాలో భాగమైన నా మిత్రుడు వినోద్‌రెడ్డికి థ్యాంక్స్' అని నిర్మాత ఎ.గురురాజ్ తెలిపారు.

రిపబ్లిక్ డేకి నయా గిఫ్ట్ !



రవితేజ

రవితేజ ప్రస్తుతం వి.ఐ. ఆనంద్ దర్శకత్వంలో ఓ సినిమా చేసేందుకు సిద్ధమవుతున్న విషయం విదితమే. ఎస్.ఆర్.టి. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తళ్లూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా గురించి నిర్మాత రామ్ తళ్ళూరి మాట్లాడుతూ, 'రవితేజ హీరోగా మా బ్యానర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమాని భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నాం. ఈ క్రేజీ కాంబినేషన్ అనగానే ట్రేడ్ వర్గాల్లో ఆసక్తి మొదలైంది. రవితేజ పుట్టిన రోజుని, రిపబ్లిక్ డేని పురస్కరించుకుని ఈ నెల 26న ఈ చిత్ర టైటిల్‌ని అధికారికంగా ప్రకటించనున్నాం. అలాగే టైటిల్ లోగోని విడుదల చేస్తాం. రవితేజకు జోడీగా ముగ్గురు హీరోయిన్లు నటించనున్నారు. త్వరలో చిత్ర ఫస్ట్ షెడ్యూల్‌ని ప్రారంభిస్తాం. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: థమన్, సినిమాటోగ్రఫీ: సాయి శ్రీరామ్.

తమిళ రీమేక్‌లో..



బెల్లంకొండ సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటించిన 'సాక్ష్యం', 'కవచం' బ్యాక్ టూ బ్యాక్ బాక్సాఫీసు వద్ద డిజాస్టర్‌గా నిలిచాయి. ఈ నేపథ్యంలో నెక్ట్స్ సినిమాల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే ఆయన తేజ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. త్వరలో రమేష్ వర్మ దర్శకత్వంలో సినిమా చేయనున్నారు. అయితే ఇది తమిళ రీమేక్ అని తెలుస్తుంది. గతేడాది వచ్చిన 'రాక్షసన్' ఘన విజయం సాధించింది. రాంకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈసినిమాలో విష్ణు విశాల్ హీరోగా నటించారు. ఈ చిత్రాన్ని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా రీమేక్ చేయాలని రమేష్ వర్మ భావిస్తున్నారు. అన్నీ కుదిరితే మార్చిలో ప్రారంభం కానున్నట్టు తెలుస్తుంది. ఇందులోనూ హీరోయిన్‌గా కాజల్ పేరు వినిపిస్తోంది. దీంతోపాటు 'ఆర్ ఎక్స్ 100'ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వంలో బెల్లంకొండ శ్రీనివాస్ ఓ సినిమా చేయనున్నట్టు టాక్. ప్రస్తుతం తేజ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో కాజల్ కథానాయికగా నటిస్తున్న విషయం విదితమే. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందుతుంది.

లక్ష్మిబాయికి బంధువుని కాదు!

'నేను ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన పనిలేదు. ఎందుకంటే నేను లక్ష్మిబాయికి బంధువుని కాదు' అని అంటోంది కంగనా రనౌత్. ఆమె ప్రధాన పాత్రధారిణిగా ఝాన్సీ రాణి లక్ష్మిబాయి జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ'. ఈ సినిమా నేడు(శుక్రవారం) విడుదల కానుంది. అయితే ఇందులో లక్ష్మిబాయి వ్యక్తిత్వాన్ని తప్పుగా చూపించారని మహారాష్ట్రకి చెందిన కర్ణిసేనలు ఆందోళనకి దిగుతున్నాయి. సినిమా విడుదలని ఆపాలని బెదిరిస్తున్నారు. దీనిపై ఇప్పటికే కంగనా ఘాటుగా స్పందించింది. కర్ణిసేనలని నాశనం చేస్తానని హెచ్చరించింది. దీంతో ఇది మరింత వివాదంగా మారింది. కర్ణిసేన సంఘాలని అవమానించిన కంగన క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందని బెదిరిస్తున్నారు. దీనిపై కంగనా స్పందిస్తూ, 'నేను ఎవ్వరికీ క్షమాపణలు చెప్పను. జీవితంలో ఇప్పటి వరకు నా తప్పులేకుండా మరొకరిని క్షమాపణలు చెప్పింది లేదు. సినిమాలో రాణి లక్ష్మిబాయి గురించి తప్పుగా చూపించలేదు. అలాంటప్పుడు కర్ణిసేనలు మాకు మద్దతుగా నిలవాలి. లక్ష్మిబాయి నాకు బంధువు కాదు. ఆమె భారతదేశ ముద్దుబిడ్డ' అని తెలిపారు. ఈ నేపథ్యంలో ముంబయిలోని కంగనా నివాసం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే సినిమాని నిలిపి వేయాలని కర్ణిసేనలు వేసిన పిటిషన్‌ని బాంబే హైకోర్టు కొట్టేసింది. సినిమాని ఆపలేమని తేల్చి చెప్పింది. ఈ సినిమా గురించి ఆమె మాట్లాడుతూ, 'మాస్ ఎంటర్‌టైనర్స్ విషయంలో నాకు ఎలాంటి సమస్య లేదు. ఈ సినిమాలో ఆ అంశాలు పుష్కలంగా ఉన్నాయి. కానీ వాటి గురించే సినిమాని తెరకెక్కించలేదు. దానికి మించి ఇందులో చాలా కంటెంట్ ఉంది. ఇప్పుడున్న పరిస్థితిలో జనం సెల్‌ఫోన్‌లోనే మునిగిపోతున్నారు. అలాంటి వారిని రెండున్నర గంటలు థియేటర్‌లో కూర్చో బెట్టడం సవాల్‌తో కూడిన అంశం. మా సినిమా కచ్చితంగా అన్ని వర్గాల ఆడియెన్స్‌ని ఎంటర్‌టైన్ చేస్తుందని నమ్ముతున్నాం' అని తెలిపింది. ఈ చిత్రానికి క్రిష్, కంగనా దర్శకత్వం వహించిన విషయం విదితమే.



కంగనా రనౌత్

ఆర్‌ఆర్‌ఆర్‌లో కీలక పాత్ర



సముద్రఖని

ప్రస్తుతం రూపొందుతున్న మల్టీస్టారర్ చిత్రాల్లో సరికొత్త ట్రెండ్‌ని సెట్ చేయబోతుంది 'ఆర్ ఆర్ ఆర్'(వర్కింగ్ టైటిల్). రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రూపొందుతున్న చిత్రమిది. డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఇది మొదటి షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. ఇటీవల రెండో షెడ్యూల్‌ని ప్రారంభించారు. హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటోంది. ఇందులోఎన్టీఆర్‌తోపాటు, రామ్‌చరణ్ పాల్గొంటున్నారు. తాజాగా సినిమాకి మరో ఆకర్షణ తోడైంది. తమిళ నటుడు, దర్శకుడు సముద్రఖని ఇందులో కీలక పాత్రలో నటించబోతున్నారు. ఈ విషయాన్ని సముద్రఖని వెల్లడించారు. 'నేను రూపొందించిన 'నాడోడిగల్' సినిమా చూసి రాజమౌళి సర్ నాకు ఓ పెద్ద సందేశం పంపారు. అప్పట్నుంచి ఆయనతో టచ్‌లో ఉన్నా. ఇటీవల ఆయన నన్ను తన ఇంటికి ఆహ్వానించారు. తన కుటుంబీకుల్ని పరిచయం చేశారు. అప్పుడే నాకు 'ఆర్ ఆర్ ఆర్' సినిమా గురించి తెలిసింది. ఇందులో కీలక పాత్ర ఉంది చేస్తావా? అని అడిగారు. నేను క్షణం కూడా ఆలోచించకుండా వెంటనే ఒప్పేసుకున్నా. స్క్రిప్ట్ విన్నాక నా నిర్ణయం చెప్పమన్నారు' అని తెలిపారు. ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్లు నటించనున్నట్టు తెలుస్తుంది. కీర్తిసురేష్, అదితి రావు హైదరీ, సమంత, ప్రియమణి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి.

చిరుతో మరోసారి ..



తమన్నా

చిరంజీవి నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'సైరా నరసింహారెడ్డి' చిత్రంలో ఓ కీలక పాత్రలో తమన్నా నటిస్తుంది. త్వరలో మరోసారి ఆమె చిరంజీవితో జోడీ కట్టబోతున్నట్టు తెలుస్తుంది. చిరంజీవి నెక్ట్స్ కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. కొణిదెల ప్రొడక్షన్స్ కంపెనీ, మ్యాట్రిక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి. త్వరలోనే సినిమా ప్రారంభం కాబోతుంది. ఇందులో పలువురు కథానాయికల పేర్లు వినిపిస్తున్నాయి. మొదట నయనతార పేరు బాగా వినిపించింది. ఆ తర్వాత అనుష్క పేరు తెరపైకి వచ్చింది. ఇటీవల బాలీవుడ్ నటి విద్యాబాలన్‌తో చర్చలు జరుపుతున్నట్టు వార్తలొచ్చాయ్. తాజాగా తమన్నా పేరు ట్రాక్‌లోకి వచ్చింది. 'సైరా'లో తమన్నా నటనని మెచ్చిన చిరంజీవి తన నెక్ట్స్ సినిమాలో హీరోయిన్‌గా ఆమెని తీసుకోవాలని భావిస్తున్నారట. మరి ఇందులో వాస్తవమెంత అనేది తెలియాల్సి ఉంది. తమన్నా ప్రస్తుతం 'సైరా నరసింహారెడ్డి' తోపాటు 'దేవి 2', 'దట్ ఈజ్ మహాలక్ష్మి', 'కన్నె కాలైమానె' వంటి చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

ఎందుకిన్ని అబద్ధాలు?

(మొదటిపేజీ తరువాయి)

తేదీగానీ, సంతకంగానీ లేవు. అంటే.. అధికారిక వివరణ ఇచ్చేందుకు వెనకాడిందని అర్థం. ఎందుకీ కప్పదాటు వ్యవహారం..?

2015,జూన్ 24న అధికారికంగా పాత ఒప్పందం రద్దు అయ్యిందన్న విషయం మన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ(రక్షణశాఖ) నివేదికలోనూ తెలిపారు. కానీ, ఇదంతా కూడా నిజం కాదని ఫ్రెంచ్ సెనేట్ పత్రాల ద్వారా ఇప్పుడు తేలింది. పాత ఒప్పందం రద్దు చేసుకోకుండానే, కొత్త ఒప్పందాన్ని(36 రాఫెల్ యుద్ధ విమానాలు) పారిస్ పర్యటనలో ప్రధాని మోడీ ఏకపక్షంగా చేసుకొచ్చారన్నది తేలిపోయింది. ఈ ఆరోపణలను బలపర్చే అంశాలు తాజాగా బయటకొచ్చిన 'ఫ్రెంచ్ సెనేట్' పత్రాల్లో ఉన్నాయి.

ఫ్రెంచ్ సెనేట్ పత్రాల్లో ఏమున్నది?

విదేశీ సంబంధాలు, రక్షణ, సైనిక బలగాలపై ఏర్పాటైన ఫ్రెంచ్ సెనేట్ కమిటీ సమావేశం 10 జూన్, 2015న పారిస్‌లో జరిగింది. ఆ సమావేశం 'మినిట్స్'లో ఏముందంటే.. (ఫ్రెంచ్ సెనేటర్ జీన్ పీయిర్రె రాఫరిన్ కమిటీకి చైర్మెన్) ఆ సమావేశంలో రాఫరిన్ మాట్లాడుతూ, "భారత ప్రభుత్వం చెబుతున్న ప్రకారం ప్రధాని మోడీ పారిస్ పర్యటన సందర్భంగా 36 రాఫెల్ యుద్ధ విమానాలు కొనాలన్న ఒప్పందం కుదిరింది. సాంకేతిక అంశాలు తేలితే ఒప్పందం ఖరారు అవుతుంది" అని అన్నారు. ఈయన మాటల్నిబట్టి పారిస్ పర్యటనకు ముందు కొత్త ఒప్పందంపై ఫ్రాన్స్–భారత్‌ల మధ్య సంప్రదింపుల ప్రక్రియ జరగలేదు. పాత ఒప్పందం రద్దు ఖరారు కాలేదు. ఈ ప్రక్రియను పక్కకు పెట్టి ప్రధాని మోడీ ఏకపక్షంగా కొత్త ఒప్పందాన్ని చేసుకొచ్చారని అర్థమవుతోంది.

ఫ్రెంచ్ సెనేటర్ల మినిట్స్ (1 అక్టోబరు, 2013) ద్వారా బయటకొచ్చిన మరో విషయం ఏమంటే.. ఇండియా కొనాలనుకుంటున్న రాఫెల్ యుద్ధ విమానాలు ప్రత్యేకమైనవి. విమానాలకు అమర్చాల్సిన తమ సొంత జాబితాను భారత్ మనముందుంచినట్టు ఆ మినిట్స్‌లో ఉన్నది. అంటే సాంకేతికంగా భారత్ కోరిన అత్యంత అధునాతన పోరాట సామర్థ్యాలు పాత(యూపీఏ) ఒప్పందంలోనే ఉన్నాయి. ఆ మినిట్స్‌లో ఇంకా ఇలా ఉన్నది..'మరోవైపు ఖతార్(డీల్) ఫ్రాన్స్‌కు అనుకూలంగా ఉన్నది. ఉత్పత్తి నిర్వహణకు ఎంతో అనుకూలం'..అంటే యూపీఏ డీల్‌లోనే ఖతార్ డీల్‌కన్నా ఆధునిక సాంకేతికతను కోరినట్టు ఈ మినిట్స్‌లో స్పష్టమవుతోంది. మోడీ సర్కార్ మాత్రం అవన్నీ కొత్తగా చేర్చామని చెబుతోంది.

అబద్ధం–2

డస్సాల్ట్ సీఈవో ట్రాపియర్‌తో ఫ్రెంచ్ సెనేట్ 2015,జూన్ 24న చర్చించింది. భారత్‌తో చర్చలు ఎలా జరిగాయని ట్రాపియర్‌ను అడిగారు. ఈ సందర్భంగా వేసిన ఒక ప్రశ్నకు సమాధానంగా ట్రాపియర్ మాట్లాడుతూ... "కొత్త ఒప్పందంపై భారత్‌తో చర్చలు జరుగుతున్నాయి. పాత ఒప్పందం స్థానంలో 36 యుద్ధ విమానాల్ని అమ్మాలన్నది కాంట్రాక్ట్. 'మేక్ ఇన్ ఇండియా' ద్వారా మరో 90 యుద్ధ విమానాల తయారీ ప్రతిపాదన ప్రాథమికస్థాయిలో ఉన్నది. ఇంకా దీనిపై కచ్చితమేమీ లేదు " అన్నారు.

ట్రాపియర్ మాటలనుబట్టి మోడీ సర్కార్ సంప్రదింపులు జరిపింది డస్సాల్ట్ ఏవియేషన్ కంపెనీతోనని, ఫ్రెంచ్ ప్రభుత్వంతో కాదన్నది తేలిపోయింది. ట్రాపియర్ మాటల్లో పాత ఒప్పందం రద్దు ప్రక్రియ అంశం లేదు. కొత్త ఒప్పందం కోసం ఇండియా నుంచి ప్రతిపాదనను మాత్రమే ఆయన ప్రస్తావించారు. ట్రాపియర్ ఇచ్చిన సమాధానం ద్వారా తెలిసేదేమంటే..సుప్రీంకోర్టుకు మోడీ సర్కార్ చెప్పిన విధంగా యూపీఏ పాత ఒప్పందం రద్దు ప్రక్రియ 2015 మార్చిలో ప్రారంభించలేదని. 2015, జూన్ 24 వరకూ పాత ఒప్పందం రద్దయినట్టు కూడా ట్రాపియర్ మాటల్లో లేదు. ఈ వాస్తవాలు తెలపకుండా సుప్రీంకోర్టుకు కేంద్రం పత్రాలు సమర్పించింది. తద్వారా దేశ ప్రజల్ని తప్పుదారి పట్టించింది.

ఒక్క యుద్ధ విమానమూ రాలేదు...

36 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు కోసం మోడీ సర్కార్ ఎంతో ఆతృత కనబర్చింది. తాము వేగంగా కదిలాము కాబట్టే 36 రాఫెల్ యుద్ధ విమానాలు వెంటనే వస్తున్నాయని చెప్పుకున్నారు. సెప్టెంబరు, 2019కల్లా యుద్ధ విమానాలు రాబోతున్నాయని కేంద్రం ప్రచారం చేస్తోంది. కానీ, వాస్తవాలు మరోలా ఉన్నాయి. అత్యంత అధునాతమైన (అప్‌గ్రేడెడ్ వెర్షన్ పరిజ్ఞానంతో కూడిన) ఆయుధ పరికరాలున్న రాఫెల్ యుద్ధ విమానాలు భారత్ చేతికి అందాలంటే అక్టోబరు, 2022 వరకూ ఆగాల్సిందేనని తెలుస్తోంది. ఈ ఒప్పందంపై మోడీ ప్రభుత్వం ఇప్పటికే రూ.34వేలకోట్లు ఫ్రాన్స్‌కు చెల్లించిందని సమాచారం. మరికొన్ని నెలల్లో రూ.13వేలకోట్ల చెల్లింపులు జరగనున్నాయి. మొత్తం ఒప్పందం విలువ(రూ.63,870కోట్లు)లో 74శాతం మనం డబ్బులు కట్టేస్తున్నాం. అయినా ఇప్పటికీ ఒక్క రాఫెల్ యుద్ధ విమానమైనా భారత్‌కు రాలేదు. మరోవైపు మన ప్రభుత్వ సంస్థ 'హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్'కు ఇవ్వాల్సిన రూ.15వేల కోట్లు ఇవ్వకుండా కేంద్రం పెండింగ్‌లో పెట్టింది.

మరికొన్ని అంశాలు

- 360 డిగ్రీల కోణంలో క్షిపణుల్ని ప్రయోగించే సామర్థ్యం, 100కి.మీ రేంజ్‌లో నౌకలపై దాడి, మధ్యస్థాయి మిస్సైల్స్, ఇతర ఆయుధాలు, యాంటీ రేడియేషన్ మిస్సైల్స్....మొదలైన భారత్ కోరిన అదనపు పోరాట సామర్థ్యాలు పాత ఒప్పందంలోనే ఉన్నాయి.
- ఇవన్నీ తమ కొత్త ఒప్పందంలోనే ఉన్నాయని మోడీ సర్కార్ అటు సుప్రీంకోర్టును, ఇటు దేశాన్ని తప్పుదారిపట్టిస్తోంది.
- మరోవైపు యుద్ధ విమానాల తయారీ సాంకేతికతను భారత్‌కు బదిలీ చేయడంలేదని దస్సాల్ట్ ఏవియేషన్ వెబ్‌సైట్ స్పష్టం చేసింది. 'ఇండియా ఏ క్రిటికల్ ఛాలెంజ్' పేరుతో ఆ వెబ్‌సైట్‌లో వివరణ ఉన్నది.

(రాఫెల్ స్కాంపై పరిశోధనాత్మక కథనాలు రాసిన రవినాయర్ న్యూస్‌క్లిక్‌తో పంచుకున్న అంశాలివి)

అడవి పంది దాడి..

- ఇద్దరు మహిళలు మృతి

నవతెలంగాణ- పుల్కల్

అడవి పంది దాడిలో ఇద్దరు మహిళలు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని హనుమాన్‌నాయక్ తండా వద్ద గురువారం జరిగింది. మృతుల కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ఇసావత్(38), అనసూయ(24) రోజూలాగే కట్టెల కోసం చెరుకు తోట సమీపంలోకి వెళ్లారు. ఆ సమయంలో అక్కడ అడవి పంది వారిపై ఒక్కసారిగా దాడి చేసింది. ఈ ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఇసావత్‌కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు. అనసూయకు కుమారుడున్నాడు. అడవి పందులు దాడి చేస్తున్నాయని ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

స్కూల్ భవనం పైనుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఘటన

గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘాల ఆందోళన



నవతెలంగాణ- కలెక్టరేట్ / కరీంనగర్ రూరల్

పాఠశాల భవనం పైనుంచి దూకి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా కేంద్ర శివారులోని పారమిత పాఠశాలలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. కరీంనగర్ రెండో పట్టణ సీఐ దేవారెడ్డి, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా మోతె గ్రామానికి చెందిన బొల్ల సుదర్శన్, రేఖ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు అశ్విత్(14)ను పారమితలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం భవనం పక్కన పడి ఉన్న అశ్విత్‌ను గమనించిన వాచ్‌మెన్ పాఠశాల యాజమాన్యానికి సమాచారం అందించాడు. యాజమాన్యం విద్యార్థిని వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో విద్యార్థి మతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సీసీ పుటేజీలను పరిశీలించగా ఉదయం 5.20 గంటల ప్రాంతంలో భవనం పైనుంచి అశ్విత్ దూకినట్టు గుర్తించారు. విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు నగరంలోని మంచిర్యాల చౌరస్తా, స్కూల్ ఎదుట ఆందోళన చేపట్టగా పోలీసులు వారిని అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీపీ వి.బి.కమలాసన్‌రెడ్డి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ పుటేజ్ ఆధారంగా ఆత్మహత్యగా భావిస్తున్నామనీ, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామనీ సీపీ వి.బి. కమలాసన్‌రెడ్డి తెలిపారు.

నేడు మలి విడత

(మొదటిపేజీ తరువాయి)

పదవులకు నామినేషన్లు వేయలేదు. దీంతో 3,342 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. అదేవిధంగా 36,620 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉన్నది. ఇందు లో 10,317 వార్డులు ఏకగ్రీవమ య్యాయి. 94 వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతో 26,208 ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడత ఎన్నికలు ఈ నెల 21 జరి గిన విషయం తెలసిందే. 30న మూడో విడత పోలింగ్ జరగనున్నది.

బరిలో 10,668 మంది

సర్పంచ్ పదవులకు కోసం 10,668 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, వార్డులకు 63,380 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి గాలం వేస్తున్నారు. పోలింగ్‌కు ముందే గ్రామాల్లో మందు, విందు భోజనాలు ఏర్పాటు చేసి తమకే ఓటు వేయాలంటూ విజ్ఞప్తి చేశారు.

పంచాయతీలు	ఏకగ్రీవాలు	సర్పంచ్ అభ్యర్థులు	వార్డు అభ్యర్థులు	దాఖలు కాని నామినేసన్లు
4,137	788	10,668	63, ,380	7

లాసెట్, పీజీఈసెట్ తేదీల్లో స్వల్ప మార్పు

(మొదటిపేజీ తరువాయి)

చేశామన్నారు. లాసెట్‌ను మే 26కు బదులు మే 20న, పీజీఈసెట్‌ను మే 27,28,29 తేదీలకు బదులుగా మే 28,29,30,31 నిర్వహిస్తామని చెప్పారు. ఎడ్‌సెట్‌ను మే 30,31 తేదీలకు బదులు మే 31న ఒకే రోజు నిర్వహిస్తామన్నారు. మిగతా ఎంసెట్, ఈసెట్, పీఈసెట్, ఐసెట్ రాతపరీక్షల తేదీల్లో మార్పు లేదనీ, షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ప్రవేశ పరీక్షల కన్వీనర్లతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు ఆర్ లింబాద్రి, వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, ఓయూ, జేఎన్టీయూహెచ్, ఎంజీయూ వీసీలు ఎస్ రామచంద్రం, వేణుగోపాల్‌రెడ్డి, అల్తాఫ్ హుస్సేన్, కన్వీనర్లు ఎన్ యాదయ్య (ఎంసెట్), గోవర్ధన్ (ఈసెట్), జిబి రెడ్డి (లాసెట్), వి సత్యనారాయణ (పీఈసెట్), రాజేశం (ఐసెట్), ఎం కుమార్ (పీజీఈసెట్), మృణాళిని (ఎడ్‌సెట్) తదితరులు హాజరయ్యారు. అనంతరం మీడియాతో పాపిరెడ్డి మాట్లాడుతూ ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌లో (పీఈసెట్ మినహా) పకడ్బందీగా నిర్వహించేందుకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సిన అవసరముందన్నారు. ప్రవేశ పరీక్షల కన్వీనర్లు టీసీఎస్, టీఎస్ ఆన్‌లైన్‌తో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈసారి ప్రతి ప్రవేశ పరీక్షనూ టీసీఎస్ ప్రతినిధి పర్యవేక్షిస్తారని అన్నారు. త్వరలోనే ప్రవేశ పరీక్షల కమిటీలు ఏర్పడుతాయని చెప్పారు. ప్రవేశ పరీక్షల కమిటీల సమావేశంలో నోటిఫికేషన్ విడుదల, దరఖాస్తు ఫీజు ఎంత ఉండాలనేది నిర్ణయమవుతుందని అన్నారు. ఒకవేళ దరఖాస్తు పెరిగినా స్వల్పంగా రూ.50 వరకు పెరిగే అవకాశముందని చెప్పారు. గతేడాదిలాగే విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు మాక్‌టెస్టులను నిర్వహిస్తామన్నారు. ట్రాఫిక్, విద్యుత్, ఇతర సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులతో సంప్రదిస్తామని అన్నారు. రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహణ వల్ల వచ్చే సమస్యలను ఓయూ, కేయూ వీసీలతో చర్చిస్తామన్నారు. సాధ్యమైనంత వరకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారానే పీజీ ప్రవేశాలు జరిగేలా చూస్తామని అన్నారు. ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తే కొన్ని సబ్జెక్టులు ఓయూకు, మరికొన్ని సబ్జెక్టులను కేయూకు అప్పగిస్తామని వివరించారు.

మారిన ప్రవేశ పరీక్షల తేదీల వివరాలు

ప్రవేశ పరీక్ష	పాత తేదీ	మారిన తేదీ
లాసెట్	మే 26	మే 20
పీజీఈసెటట్	మే 27,28,29	మే 28,29,30,31
ఎడ్‌సెట్	మే 30,31 మే 31	

రాజ్యాంగం అనుమతించదు

(మొదటిపేజీ తరువాయి)

మాజీ కమిషనర్ హరి శంకర్ బ్రహ్మ మాట్లాడుతూ.. లోక్‌సభ స్థానంలో పోటీ చేసే అభ్యర్థి దాదాపుగా రూ. 50 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నాడని, ఇది తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని చెప్పారు. అంత మొత్తంలో నగదు ఖర్చు చేసిన వ్యక్తి తిరిగి దానిని కూడబెట్టుకోవడం కోసం పనిచేస్తాడు గానీ రాజ్యాంగ నిబంధనల మేరకు నడుచుకోడని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయ విభాగంలో సంస్కరణలు జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మార్కెట్ ధర చెల్లిస్తాం

జగిత్యాల ఆర్డీవో నరేందర్

- 'నవతెలంగాణ' కథనానికి స్పందన

నవతెలంగాణ- పెగడపల్లి

'గ్రీన్‌కారిడార్' రోడ్డు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ, వారికి మార్కెట్ ధరకు అనుగుణంగానే డబ్బులు చెల్లిస్తామనీ జగిత్యాల ఆర్డీవో నరేందర్ అన్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఆరవెల్లి శివారులోని మద్దులపల్లిలోని రైతుల భూములను ఆయన గురువారం పరిశీలించారు. పరిహారం సొమ్మును రైతులకు సకాలంలో అందించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రైతులు రోడ్డు పనులను అడ్డుకోవద్దని కోరారు. ఈ నెల 21న 'నవతెలంగాణ' మెయిన్‌లో 'పొలాల్ని మింగుతున్న గ్రీన్ కారిడార్' అన్న శీర్షికన కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రైతులు ఆందోళనలు తీవ్రం చేశారు. సర్వే పనులనూ అడ్డుకున్నారు. దీంతో అధికారులు దిగొచ్చారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ జి.సరిత, ఆర్ఐ ఆంజనేయులు, సర్వేయర్లు ఉన్నారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు

- మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు

నవతెలంగాణ–పెద్దపల్లి

పార్టీ మారే ప్రసక్తే లేదని మంథని కాంగ్రెస్ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పెద్దపల్లి ఐబీ గెస్ట్‌హౌజ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నట్టు వస్తున్న ప్రచారాన్ని ఖండించారు. తానెప్పటికీ కాంగ్రెస్‌ను వీడబోనన్నారు. ప్రియాంక గాంధీ క్రియాశీల రాజకీయాల్లోకి రావటం కాంగ్రెస్ కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపిందన్నారు. పార్టీ ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ఆలోచన చేసి ప్రియాంక గాంధీని ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఆహ్వానించారని అన్నారు. ఇందిరాగాంధీ రూపురేఖలను పునికిపుచ్చుకున్న ఆమెను చూసి బీజేపీ నాయకుల్లో వణుకు పుట్టిందనీ, అందుకే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారనీ అన్నారు. ప్రధాని మోడీ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయటంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. రాబోవు సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పని చేయాలని కోరారు. సమావేశంలో సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, చేతి ధర్మయ్య, గంట రాములు తదితరులు ఉన్నారు.

'ఎస్సీ, ఎస్టీ చట్టం సవరణ'పై స్టేకు నిరాకరణ

న్యూఢిల్లీ : ఎస్టీ, ఎస్టీలపై దురాగతాల నిరోధక చట్టానికి చేసిన సవరణలపై స్టే విధించేందుకు భారత సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. కేంద్రం వేసిన రివ్యూ పిటిషన్‌పై, సవరణలను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై ఒకేసారి విచారణ చేపట్టనున్నట్టు స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదైతే నిందితులను సత్వరమే అరెస్టు చేయాల్సిన అవసరం లేదని, వారు ముందస్తు బెయిల్ కూడా పొందవచ్చని సుప్రీంకోర్టు గతేడాది మార్చిలో స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అంతేకాక.. ఈ చట్టం కింద ప్రభుత్వ ఉద్యోగిని అరెస్టు చేయాలంటే అతడి నియామక అధికారి అనుమతి తప్పనిసరి అని తేల్చింది. కాగా.. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు లేవనెత్తడంతో కేంద్రం రివ్యూ పిటిషన్ వేసింది. అంతేకాక.. నిందితులు ముందస్తు బెయిల్ పొందకుండా చట్టానికి సవరణలు చేస్తూ బిల్లును తీసుకొచ్చింది. దీంతో ఈ సవరణలపై స్టే విధించాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ధర్మాసనం తాజా నిర్ణయాన్ని వెలువరించింది.

'ఆకాశ రామన్న'ల నుంచి 553 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

వాటా 97.67 శాతం(రూ.210 కోట్లు) ఉండగా.. కాంగ్రెస్ రూ.5 కోట్లు స్వీకరించింది. స్వచ్ఛంద విరాళాల(రూ.20 వేల కంటే తక్కువ) ద్వారా జాతీయ పార్టీలకు రూ.354.22 కోట్ల(51.38 శాతం) నిధులు సమకూరాయి. ఈ నిధుల్లోనూ బీజేపీనే(రూ.342.66 కోట్లు) ముందు వరుసలో ఉండగా.. తర్వాతి స్థానంలో బీఎస్పీ(రూ.10.67 కోట్లు) ఉన్నది. సేల్ కూపన్ల ద్వారా వచ్చిన ఆదాయంలో మాత్రం కాంగ్రెస్ అగ్రస్థానంలో ఉన్నది. ఆ పార్టీకి సేల్ కూపన్ల ద్వారా రూ.110.32 కోట్ల ఆదాయం సమకూరగా.. ఎన్సీపీకి రూ.5.37 కోట్ల నిధులు వచ్చాయి.

కౌంటింగ్, పోలింగ్‌కు తేడా ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

నివృత్తి అవుతాయని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఓటర్ నమోదు కార్యక్రమంలో నిర్లక్ష్యం జరిగిందని విమర్శించారు. ఈవీఎంపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై దేశ వ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్టు చెప్పారు. టీజేఎస్ అధ్యక్షులు కోదండరామ్ మాట్లాడుతూ ఓట్ల నమోదు కార్యక్రమం సరిగా జరగలేదని, అందుకే తొలగించిన ఓట్ల విషయంలో రజత్‌కుమార్ ఓటర్లకు క్షమాపణ చెప్పారన్నారు. ఆయన వ్యవహారశైలిపై అనుమానంగా ఉందని చెప్పారు. దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. టీడీపీ సీనియర్ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఓట్ల గల్లంతుపై ఈసీకి ఆధారాలు ఇచ్చినా పట్టించుకోలేదని విమర్శించారు. మాజీ మంత్రి డికె అరుణ మాట్లాడుతూ ముందస్తు ఎన్నికల కంటే ఆరు నెలలకు ముందే గెలుస్తామని ఎలా చెబుతారని ప్రశ్నించారు. పేపర్ బ్యాలెట్‌తో ఎన్నికలు జరిపే వరకు ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, ఎంపీ నంది ఎల్లయ్య, మాజీ ఎంపీ అజీజ్ పాషా, మాజీ ఎంపి హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్‌కుమార్‌యాదవ్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు అంజన్‌కుమార్ యాదవ్, పలువురు రాష్ట్ర, నగర నాయకులు పాల్గొన్నారు.

కొత్త ఎఫ్‌ఆర్‌ఓలకు నియామక పత్రాల అందజేత

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

టీపీఎస్సీ ద్వారా ఎంపికైన 66 మంది ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ల(ఎఫ్ఆర్‌ఓ)కు హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో నియామక పత్రాలను అటవీ సంరక్షణ ప్రధాన అధికారి(పీసీసీఎఫ్) పీకే ఝా అందజేశారు. అందులో 21 మంది మహిళలున్నారు. 41 మందికి అస్సోంలో, 25 మందికి కర్నాటకలోని ధార్వాడ్‌లో ఫిబ్రవరి రెండో వారం నుంచి 18 నెలల పాటు శిక్షణ అందివ్వనున్నారు. అడవుల రక్షణకు ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ఇవ్వని ప్రాధాన్యతను మన రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నదని, ఎంపికైన వారంతా నిబద్ధతతో పనిచేయాలని పీకే ఝా అభ్యర్థులకు సూచించారు.

తెలంగాణ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పనిచేస్తామని అభ్యర్థులు అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ఉన్నతాధికారులు రఘువీర్, పృథ్వీరాజ్, మునీంద్ర పాల్గొన్నారు.

కాళేశ్వరం కాలువ పనుల సర్వే అడ్డగింత

- గ్రామానికి దూరంగా చేపట్టాలని డిమాండ్

నవతెలంగాణ- రామారెడ్డి

గ్రామానికి దూరంగా, సాగు భూమి విస్తీర్ణం పెరిగేలా కాళేశ్వరం కాలువ నిర్మించాలని కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం ఇసన్నపల్లి వద్ద గురువారం సర్వే అధికారులను రైతులు అడ్డుకున్నారు. గ్రామం సమీపంనుంచే కాలువ నిర్మాణానికి సర్వే చేపట్టడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ఉన్న అర ఎకరం, ఎకరం సాగుభూమి కాలువ నిర్మాణంలో పోతుందనీ, తాము రోడ్డున పడతామనీ ఆవేదన వ్యక్తం చేశారు. భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే కాలువ నిర్మించనివ్వబోమని స్పష్టం చేశారు. లేదంటే మరో ప్రాంతం నుంచి వేయాలన్నారు. ఒకవేళ కాలువ నిర్మాణాన్ని బలవంతంగా చేపడితే ప్రాణం తీసుకోవడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. దీంతో అధికారులు సర్వేను అర్ధాంతరంగా ముగించి వెళ్లిపోయారు.

ఐదుగురు డిఫెన్స్ అధికారులపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

సివిలియన్ ఆఫీసర్లు ఉద్యోగంలో మెరుగైన ప్రదర్శన కనబర్చడం లేదని చెబుతూ వారిని తొలగించేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. కాగా, వీరి తొలగింపునకు కేంద్ర రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ ఆమోదం తెలిపారు. ఈ ఐదుగురు.. మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్‌కు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్ ర్యాంకు అధికారులు. మూడు నెలల వేతనం అందజేసి కంపల్సరీ రిటైర్మెంట్ కింద వారిని ఉద్యోగాల నుంచి తొలగించినట్టు రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

గోల్డ్ 'స్కాం'

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: ఆర్థిక వ్యవస్థలోని బలహీనతలను ఆసరాగా చేసుకొని విధాన కర్తలు, నాయకులు, వ్యాపారవేత్తలు దేశాన్ని గరిష్ట స్థాయిల్లో దోచేస్తున్నారు. కొత్త పాలసీల పేరుతో తమకు అనుకూలంగా విధానాలను రూపొందించుకొని.. వాటిని అమలులోకి తీసుకొచ్చుకొంటున్న నాయకులు, వ్యాపారవేత్తలు లక్షల కోట్లను అక్రమంగా పోగేసుకుంటున్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ 2013లో అప్పటి యూపీఏ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన '80:20 బంగారం ఎగుమతి–దిగుమతి పథక'మే. 2013 తొలి అర్ధభాగంలో డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ భారీగా క్షీణిస్తూ వచ్చింది.. ఈ నేపథ్యంలో దేశీయంగా విదేశీ మారకపు విలువలు భారీగా కరిగిపోవడం మొదలైంది. బంగారం దిగుమతులకు ఎక్కువ మొత్తంలో విదేశీ మారకపు విలువను వెచ్చించాల్సి వస్తుండడంతో దీనిని నిలువరించేందుకు గాను సర్కారు బంగారం దిగుమతులను నియంత్రించాలని నిర్ణయించింది. దేశీయంగా కరెంటు ఖాతా లోటు కూడా ఆందోళనకర స్థాయికి పెరుగుతుండడం, ఎక్కువ మొత్తంలో ప్రజలు తమ పొదుపు సొమ్మును బ్యాంకు ఖాతాలకు కాకుండా బంగారంపై పెట్టుబడికి మళ్లిస్తుండడంతో బంగారపు దిగుమతులను నియంత్రించాలని సర్కారు నిర్ణయించింది. దీని వల్ల అధిక మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం దేశం దాటిపోకుండా ఉండడంతో పాటు రూపాయి విలువ బలోపేతం కాగలదని అప్పటి ప్రభుత్వం పెద్దలు లెక్కలు కట్టారు. ఇదే విషయాన్ని అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరం వెల్లడిస్తూ ఆరు నెలల నుంచి ఏడాది పాటు భారీ బంగారం దిగుమతులకు దూరంగా ఉంటే దేశ కరెంటు ఖాతా లోటులో గణనీయమైనన మార్పు కనిపిస్తుందని.. తద్వారా ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని చెప్పుకొచ్చారు. ఆర్థిక మంత్రి సూచించిన విధంగానే దేశంలోకి గోల్డ్ దిగుమతులను నియంత్రించేందుకు గాను సర్కారు, ఆర్బీఐ పలు చర్యలు చేపట్టారు. దిగుమతి సుంకాన్ని, ఎక్సైజ్ పన్నులు రెట్టింపు చేయడం వంటి పలు నియంత్రణ కార్యక్రమాలను చేపట్టారు. దీంతో దేశంలో బంగారం లభ్యతకు తాత్కాలిక కొరత ఏర్పడింది. ఫలితంగా దేశంలోని నగలవ్యాపారులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలకు దిగారు. సరిగ్గా ఇక్కడే బులియనీర్లు అంతా కలిసి లాబీయింగ్ జరిపి కుట్రపూరితంగా విధానకర్తల అండతో 80:20 బంగారం ఎగుమతి దిగుమతి పథకాన్ని ప్రభుత్వానికి సూచించారు. ఇందులో కోల్‌కతా కేంద్రంగా పని చేస్తున్న శ్రీ గణేష్ జ్యువెల్లరీ హౌస్ సంస్థ ప్రమోటర్ నీలేశ్ పారేకర్ కీలక పాత్ర పోషించినట్టుగా సమాచారం. అనుకున్నట్టే బులియన్ మార్కెట్ లాబీ ప్రభుత్వవర్గాల ద్వారా ఈ పథకాన్ని ప్రకటింపజేశాయి. 22 జులై, 2013లో బంగారం దిగుమతుల కట్టడికి '80:20 బంగారం ఎగుమతి–దిగుమతి పథకం' అమలులోకి వచ్చింది. ఈ పథకం ప్రకారం ఒక వ్యాపారి గానీ వ్యాపార సంస్థగానీ పసిడిని చేసుకొంటే అందులో 80% బంగారాన్ని దేశీయంగా విక్రయించడంతో పాటు.. 20% గోల్డ్‌ను తిరిగి విలువ జోడింపుతో విదేశాలకు ఎగుమతి చేయాల్సి ఉంటుంది. ఈ 20% ఎగుమతులకు సంబంధించిన సాక్ష్యాధార పత్రాలను సమర్పిస్తేనే.. ఆ వ్యాపారి తదుపరి కన్‌సైన్‌మెంట్ ద్వారా మరో విడుతగా బంగారంను దిగుమతి చేసుకొనేందుకు వీలు కల్పిస్తారు.

పథకంలోని లోపాలే ఆసరాగా దోపిడీ..

బంగారం దిగుమతులపై పరిమితుల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలను చల్లార్చేందుకు గాను ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఆర్బీఐ పలు మార్లు నిబంధనలను సడలించింది. తొలుత దేశంలోని రత్నాభరణాలు, జ్యువెల్లరీ ఎగుమతులకు ఊతం ఇచ్చేలా నిబంధనలను సరళీకరించింది. తదుపరి నిబంధనల సరళీకరణలో భాగంగా ప్రయివేటు సంస్థలు కూడా బంగారం దిగుమతులు చేసుకొనే వెసులుబాటును ఇచ్చింది. దీనికి కొనసాగింపుగా మోడీ సర్కారు అధికారంలో వచ్చిన తరువాత 2014లో ప్రముఖ ఎగుమతి సంస్థలు కూడా కొన్ని పరిమితులకు లోబడి బంగారం దిగుమతులు చేసుకోవచ్చంటూ నిబంధనలను సడలించింది. దీంతో ప్రయివేటు సంస్థలు విచ్చలవిడిగా తమ వద్ద ఉన్న నల్లధనాన్ని వినియోగించుకొని టన్నుల కొద్దీ బంగారాన్ని దిగమతి చేసుకున్నాయి. చాలా మంది దీనిని బ్లాక్‌మనీని వైట్‌గా మార్చుకొనేందుకు ఒక చక్కటి అవకాశంగా వినియోగించుకొని బంగారం దిగుమతులు జరిపారు. పరిస్థితి ఎంత దారుణంగా మారిందంటే బంగారం దిగమతి చేసుకున్న 24 గంటల లోపే ఎలాంటి విలువ జోడింపులు లేకుండానే, నకిలీ ఇన్వాయిస్‌లను సృష్టించి బంగారం మళ్లీ ఎగుమతి చేయడం డబ్బులు వెనుకేసుకోవడం ప్రారంభమైంది. కేవలం కాగితాల్లోనే ఎగుమతులు దిగుమతులను చూపుతూ సంస్థలు బ్యాంకుల నుంచి వేల కోట్ల రుణాలను పొందాయి. వాటిని ఉపయోగించి బంగారం దిగుమతుల చేసుకోవడం వాటిని ఎగుమతి చేసినట్టుగా చూపడం.. వీటి ద్వారా గరిష్టంగా లబ్ధి పొందడం సాగింది. నిబంధలను అపహాస్యం చేస్తూ సాగిన ఈ ప్రక్రియ ద్వారా దేశ ఖజానాకు దాదాపు రూ. 2,65,000 కోట్ల (35 బిలియన్ డాలర్ల) మేర నష్టం జరిగినట్టుగా విశ్లేషణలు చెబుతున్నాయి. ఈ పథకం దుర్వినియోగం అవుతుందని.. దేశానికి లాభం కంటే కూడా నష్టం ఎక్కువగా ఉందని ఆర్థిక శాఖ అధికారులు ప్రభుత్వ దృష్టికి తెచ్చినప్పటికీ బడాబాబుల లాబీయింగ్ వల్ల యూపీఏ హయాంలో 11నెలలు, మోడీ నేతృత్వంలోనే ఎన్డీఏ ప్రభుత్వపు హయాంలో ఆరు నెలల పాటు నిర్విఘ్నంగా సాగింది. బడాబాబులకు దాసోహమన్న నేతలు, అధికారులు దేశానికి కోట్లాది రూపాయలన నష్టం జరుగుతున్నా చూస్తు ఉండిపోవడం శోచనీయం.

మోడీ హయాంలో తారాస్థాయికి..

ఆర్థికశాఖలో అందుబాటులో ఉన్న సమాచారం మేరకు పథకం అమలులోకి వచ్చిన జులై 23, 2013 నుంచి డిసెంబరు 31, వరకు 90 టన్నుల బంగారం దిగుమతి జరిగితే.. ఆ తదుపరి ఐదు నెలల కాలంలో దేశీయంగా (మే మాసం వరకు) 202 టన్నుల గోల్డ్ దిగుమతులు జరిగాయి. ఇక మోడీ సర్కారు వచ్చాక నిబంధనలు సడలించి ప్రముఖ ఎగమతి సంస్థలు కూడా కొన్ని పరిమితులకు లోబడి బంగారం దిగుమతులు చేసుకోవచ్చంటూ అనుమతులు ఇవ్వడంతో ప్రయివేటు సంస్థలు విచ్చలవిడిగా తమ వద్ద ఉన్న నల్లధనంతో.. టన్నుల కొద్దీ బంగారాన్ని దిగమతి చేసుకున్నాయి. దీంతో మే, 2014 నుంచి నవంబరు మధ్య కాలంలో దేశంలో రికార్డు స్థాయిలో దాదాపు 667 టన్నుల బంగారం దిగమతులు జరిగాయి. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మే నుంచి పథకం నిలిచిపోయిన నవంబరు వరకు దేశంలో దాదాపు 300 కోట్ల డాలర్ల మేర బంగారం దిగుమతులు జరిగినట్టుగా లెక్కలు చెబుతున్నా.. ఈ లావాదేవీల రూపంలో దాదాపు 1000 కోట్ల డాలర్లకు పైగా నల్లధనం దేశంలోకి వచ్చి చేరినట్టుగా గణాంకాల విశ్లేషణల ద్వారా తెలుస్తోంది.

తీవ్రంగా పరిగణించిన కాగ్..

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) 2016లో '80:20 బంగారం ఎగుమతులు పథకం'లో లోపాలను తొలిసారి బయటి ప్రపంచానికి ఎత్తిచూపింది. ఇందులో లోపాలను, పారదర్శకత లోపాలను వెల్లడిస్తూ ప్రభుత్వాల పని తీరును తప్పుబట్టింది. దీనిని ఆసరాగా చేసుకొని ఎన్డీఏలోని న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, పార్లమెంట్ సభ్యులు నిశికాంత్ దూబేలు కాంగ్రెస్‌లు, గత యూపీఏ సర్కారు వైఖరిని తప్పుబట్టాయి. నీరవ్ మోడీ, చోక్సీ వంటి నగల వ్యాపారులకు లబ్ది చేకూర్చేలా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలులోకి తెచ్చినట్టుగా వారు అరోపించారు. ఈ పథకం ఒక పెద్ద కుంభకోణమని దీని విలువ దాదాపు రూ.లక్ష కోట్ల వరకు ఉంటుందని వారు ఆరోపించారు. దీనికి ప్రతిస్పందించిన కాంగ్రెస్ నేతలు పథకం అమలులోకి వచ్చిన తరువాత మోడీ అధికారంలోకి వచ్చాకే దేశంలో బంగారం దిగుమతులు ఎక్కువగా జరిగినట్టుగా ప్రత్యారోపణలకు దిగారు. దీనికి సంబంధించిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీకి సారథి నికిలేశ్ దూబే రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుంచి వివరాలను కోరారు. దీనికి తోడు పీఎన్‌బీ కంభకోణంతో దీనికి గల సంబంధాలను కూడా వారు ఈ సందర్భంగా ప్రశ్నించారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన నిబంధనల మూలంగా పెద్దగా దేశానికి ప్రయోజనం కలగలేదని.. అయితే రత్నాభరణాల వ్యాపారుల లావాదేవీలలో మాత్రం రికార్డు స్థాయి లావాదేవీలు నమోదు అయినట్టుగా కాగ్ తెలిపింది.

అంబానీ నుంచి అమిత్‌షా వరకు..

(మొదటిపేజీ తరువాయి)

రైస్ మిల్స్, కందివాలా ఎంటర్‌ప్రైజెస్ ప్రమోటర్లయిన కందివాలా కుటుంబం సభ్యులు ఈ పథకం అమలులోని సమయంలో రికార్డు స్థాయిలో దాదాపు 1,30,000 కిలోల మేర బంగారాన్ని దిగుమతి చేసుకున్నట్టుగా గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే బీజేపీ నేతలు ఈ విషయాన్ని లైట్ తీసుకుంటున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. కాగా రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ రిలయన్స్ ఇండస్ట్రీస్ ద్వారా ఈ గోల్డ్ పథకాన్ని వినియోగించుకొని దాదాపు 1380 కిలోల మేర బంగారాన్ని దిగుమతి చేసుకున్నట్టుగా తెలుస్తోంది.

విద్యా సంస్థల్లో రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేయాలి

- బీసీ సంఘాల డిమాండ్

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర, రాష్ట్రాలకు చెందిన విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కేంద్రీయ, వివిధ వర్సిటీల్లో ఉద్యోగాల భర్తీలో అణగారిన వర్గాలకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు విరుద్ధంగా కేంద్రం కొత్త పాలసీని అమలు చేస్తూ రిజర్వేషన్ వర్గాల ఉద్యోగాలకు గండికొడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఢిల్లీలో మీడియాతో ఆయన సంభాషించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్, బోధన సిబ్బంది ఉద్యోగాల్లో ఒక వర్సిటీని యూనిట్‌గా తీసుకొని రిజర్వేషన్లు అమలు చేసేవారని, కానీ ఇప్పుడు ఒక డిపార్టుమెంట్‌ను యూనిట్‌గా తీసుకొని ఉద్యోగాలు భర్తీ చేయడం వల్ల రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం జరుగుతోందన్నారు. వీరికి న్యాయం చేయకపోతే ఫిబ్రవరి 12న కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు బీసీ నేతలు సాంబశివరావు, అంజయ్య తదితరులు ఉన్నారు.

జగన్ ఆంక్షలను భరించలేకపోయా

- టీడీపీలో చేరికపై స్పష్టతనివ్వని రాధా

విజయవాడ : వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో అవమానాలను భరించలేకే ఆ పార్టీకి రాజీనామా చేశానని మాజీ ఎంఎల్ఏ వంగవీటి రాధాకృష్ణ చెప్పారు. సొంత తమ్ముడిలాంటి వాడివని అంటూనే జగన్ తనపై ఆంక్షలు పెట్టారన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో ఆయన గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాధాకృష్ణ మాట్లాడుతూ తన తండ్రి రంగా విగ్రహావిష్కరణకు వెళ్లిన తనపై జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. తన తండ్రి విగ్రహావిష్కరణకు వెళ్లనివ్వనివారు ఇంకెక్కడికి వెళ్లనిస్తారని అన్నారు. తండ్రి లేనివాడినని చేరదీశానని.. తాను చెప్పినట్టు వినాల్సిందేనని జగన్ ఒత్తిడి చేసేవారని రాధా ఆరోపించారు. ఇప్పటి వరకూ ఆత్మాభిమానం చంపుకొని, అవమానాలు భరిస్తూ వచ్చానన్నారు. సెంట్రల్ సీటు విషయంలో ఒకింత బాధ పడ్డానే తప్ప పార్టీని వీడాలని అనుకోలేదని, కానీ పార్టీలో తనను పదేపదే అవమానాలకు గురిచేయడంతో రాజీనామా చేశానని చెప్పారు.

సెన్సెక్స్ ▲87	నిఫ్టీ ▲18	డాలరుకు రూపాయి విలువ	బంగారం (10.గ్రా)	వెండి (కేజీ)
36,195	10,849	71.33	రూ. 32,027	రూ.38,942





కోడిగుడ్లు (వందకి)			
హైదరాబాద్	418	విజయవాడ	423
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
వరంగల్	420	ముంబయి	473



'ఇన్వెస్ట్ తెలంగాణ'కు ఉపాసన ప్రచారం



హైదరాబాద్: మెగాపవర్‌స్టార్ రామ్‌చరణ్ సతీమణి ఉపాసన కొత్త ఉద్యోగంలో చేరారట. తన ఉద్యోగం ఎలా ఉంది అని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను ట్విటర్‌లో అడిగారు. విషయమేంటంటే.. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సమావేశంలో భాగంగా ఉపాసన ఇటీవల దావోస్‌కు వెళ్లారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న కంపెనీలకు సమాచారం అందించి తనవంతు సాయం చేసేందుకు ఫోరంలోని తెలంగాణ డెస్క్‌కు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ విషయాన్ని ఉపాసన ట్విటర్ వేదికగా వెల్లడించారు. 'నా కొత్త ఉద్యోగం ఎలా ఉంది కేటీఆర్ సర్? వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశం నిమిత్తం దావోస్ వెళ్లాను. ఈ నేపథ్యంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనుకునేవారికి సమాచారం అందించేందుకు ఇక్కడి 'ఇన్వెస్ట్ తెలంగాణ' డెస్క్‌లో కూర్చున్నాను' అని వెల్లడిస్తూ కొన్ని ఫొటోలను పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లను కలిశారు. అంతేకాదు ప్రపంచంలో అత్యాధునిక హెల్త్‌కేర్ వ్యవస్థలను ప్రారంభించేందుకు మైక్రోసాఫ్ట్‌తో కలిసి పనిచేయబోతున్నట్లు వెల్లడించారు.

ఏషియాలోనే గొప్ప బ్రాండ్‌గా డాక్టర్ కాపర్



నవతెలంగాణ, హైదరాబాద్: ఎంఎస్ఆర్ ఇండియా లిమిటెడ్ విక్రయిస్తున్న డాక్టర్ కాపర్‌కు అంతర్జాతీయ అవార్డు దక్కింది. 2018 ఏడాదికి గాను ఆసియా గ్రేటెస్ట్ బ్రాండ్‌గా గుర్తింపు లభించినట్లు ఆ సంస్థ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సింగపూర్‌లో బిజినెస్ మ్యాగిజైన్ 'ప్రైస్ వాటర్ హౌస్ కాపర్స్' నిర్వహించిన ఇండో-సింగపూర్ బిజినెస్ అండ్ సోషల్ ఫోరమ్‌లో ఈ అవార్డును కంపెనీ సీఈవో డాక్టర్ ఎం. మల్లారెడ్డి అందుకున్నారు. తమ లక్ష్య సాధనలో ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు తమకు పెద్ద మైలురాయి అని మల్లారెడ్డి పేర్కొన్నారు. దీంతో అంతర్జాతీయంగా డాక్టర్ కాపర్‌కు గుర్తింపు రావడంతో పాటు.. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడానికి ఇది ఒక సదావకాశమని తెలిపారు. అవార్డు బాధ్యత పెంచిందని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో సంస్థను మరింత నాణ్యతగా విస్తరిస్తామని వివరించారు.

ఇండిగో కొత్త సీఈవోగా రొణొజాయ్



న్యూఢిల్లీ: భారత్‌లో ఎయిర్‌లైన్ మార్కెట్ దిగ్గజం ఇండిగో సంస్థకు నూతన సీఈవోగా రొణొజాయ్ దత్తా నియమితులయ్యారు. ఈ మేరకు ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ యాజమాన్యం గురువారం ఒక ప్రకటనను వెల్లడించింది. ఈ పదవిలో ఆయన అయిదేళ్ల పాటు కొనసాగనున్నట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో పాటు ఇండిగో సంస్థ చైర్మెన్‌గా మేలేవీటిల్ దామోదరన్ నియమాకానికీ కంపెనీ ఆమోదం తెలిపింది. ఈ రెండు నియమాకాలు జనవరి 24 నుంచి అమలులోకి వస్తాయని కంపెనీ సదరు ప్రకటనలో పేర్కొంది.

ఐసీఐసీఐ కేసులో సీబీఐ దూకుడు

- చందా, దీపక్, వేణుగోపాల్‌పై ఎఫ్ఐఆర్
- వీడియోకాన్ ఆఫీసులపై మెరుపు దాడులు




ముంబయి: వీడియోకాన్-ఐసీఐసీఐ బ్యాంకు క్విడ్‌ప్రోకో కేసులో ఎట్టకేలకు చందా కొచ్చర్‌పై ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. చందాతో పాటు ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ దూత్‌పై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) కేసు ఫైల్ చేసింది. వీడియోకాన్ రుణాలకు సంబంధించిన కేసులో వీరిని ప్రధాన నిందితులుగా ఆరోపించింది. అదే విధంగా మహారాష్ట్రలోని ముంబయి, ఔరంగాబాద్‌లలో ఉన్న వీడియోకాన్ కార్యాలయాలపై గురువారం ఉదయం సీబీఐ మెరుపు దాడులు చేసింది. ఈ కేసులో ఇరు పార్టీల మధ్య క్విడ్‌ప్రోకోకు సంబంధించిన కీలక ఆధారాలు రాబట్టేందుకు సిబిఐ ప్రయత్నిస్తోందని సమాచారం.

వీడియోకాన్ గ్రూప్ రుణాల అవకతవకల వివాదం కారణంగా చందా కొచ్చర్ గత ఏడాది అక్టోబరులో ఐసీఐసీఐ బ్యాంకు సీఈవో పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. 2012లో వీడియోకాన్ గ్రూప్‌నకు ఐసీఐసీఐ బ్యాంకు రూ.3,250కోట్ల అప్పులు ఇచ్చింది. రుణం మంజూరైన కొద్ది మాసాలకే ఆ కంపెనీ చీఫ్ వేణుగోపాల్ ధూత్.. చందాకొచ్చర్ భర్తకు చెందిన న్యూపవర్ సంస్థలో కోట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టింది. తుదకు రూ.9 లక్షల నామమాత్ర ధరకే రూ.64 కోట్ల ఆస్తులను దీపక్ కొచ్చర్‌కు అందజేశారనేది ప్రధాన ఆరోపణ. దీంతో చందా కొచ్చర్‌పై విచారణ జరిపించాలని చాలా ఒత్తిడిలు వచ్చాయి. దీపక్, వేణుగోపాల్ ధూత్ న్యూపవర్ సహవ్యవస్థాపకులు కావడంతో క్విడ్‌ప్రోకోకు మరింత బలాన్ని చేకూర్చుతుంది.

ఈ క్విడ్‌ప్రోకోపై గతంలో సెబీ చేపట్టిన ప్రాథమిక దర్యాప్తులో చందాకొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్ వీడియోకాన్ గ్రూప్‌తో పలుమార్లు వ్యాపార సంప్రదింపులు జరిపినట్టు వెల్లడయ్యింది. ఈ రుణ కేసు విచారణను సిబిఐ తాజాగా వేగవంతం చేసింది. ముంబయిలోని వీడియోకాన్ కార్యాలయాలు, ఔరంగాబాద్‌లోని న్యూపవర్, ముంబై నారిమన్ పాయింట్‌లోని సుప్రీం ఎనర్జీ కార్యాలయం తదితర పలుచోట్ల సిబిఐ దాడులు చేసి... కొన్ని రికార్డులను స్వాధీనం చేసుకుంది. వీడియోకాన్‌కు రుణాల జారీలో క్విడ్‌ప్రోకో చోటు చేసుకుందని.. 10 నెలల క్రితం వచ్చిన ఆరోపణలపై 2018 మార్చిలో సీబీఐ ప్రాథమిక విచారణ చేపట్టింది. సాక్షాధారాలు లభించిన తర్వాత ఈ కేసులోని నింధితులపై క్రిమినల్ కేసులు పెట్టే అవకాశం ఉందని నిపుణలు పేర్కొంటున్నారు.

భారతీయులకు 25% తక్కువ జీతాలు!



బెంగళూరు: శ్వేత జాతీయులతో పోలిస్తే భారత్, ఆసియా, ఆఫ్రికన్ అమెరికన్లకు ఒరాకిల్ కంపెనీ 25 శాతం తక్కువ జీతాలు చెల్లిస్తోందని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లేబర్ వెల్లడించింది. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ స్థానాలకు ఆసియన్లలో భారతీయులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ, జీతాల విషయంలో మాత్రం ఆఫ్రికన్లు, హిస్పానిక్స్‌తో పాటే తక్కువ జీతాన్ని అందిస్తుందని తెలిపింది.ఆ కంపెనీ అమెరికన్ కార్యకలాపాల్లో ముఖ్యంగా ఈ వివక్షకను చూపుతుంది. 'సమాన ఉద్యోగావకాశాలు కల్పించి, శ్వేత జాతీయులతో పోల్చుకుంటే తక్కువ మొత్తాన్ని చెల్లిస్తుంది' అని డిపార్ట్ మెంట్ ఆఫ్ లేబర్ తన ఫిర్యాదులో ఆరోపించింది. జనవరి 2013 నుంచి డిసెంబరు 2016 మధ్యలో శ్వేతజాతీయులు కానీ వారు 400 మిలియన్ డాలర్ల జీతాన్ని కోల్పోయారని ఆ ఫిర్యాదులో పేర్కొంది. ఈ వివక్ష 11,000 ఆసియన్ జాతీయుల మీద ప్రభావం చూపిందని తెలిపింది. అయితే ఈ ఆరోపణలపై ఒరాకిల్ స్పందించలేదు.

యెస్ బ్యాంక్ కొత్త బాస్‌గా గిల్



న్యూఢిల్లీ: ప్రయివేటు రంగ బ్యాంకింగ్ సంస్థ యెస్ బ్యాంక్‌కు కొత్త బాస్ వచ్చారు. బ్యాంక్‌నూతన ఎండీ, సీఈవోగా రవ్‌నీత్ గిల్ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత సీఈవో రాణా కపూర్ పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. దీంతో కొత్త సీఈవోగా రవ్‌నీత్ బాధ్యతలు చేపట్టనున్నట్లు యెస్ బ్యాంక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. రవ్‌నీత్ నియామకాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఆమోదించినట్లు బ్యాంకు ఆ ప్రకటనలో పేర్కొంది. 2019 మార్చి 1లోగా రవ్‌నీత్ ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం రవ్‌నీత్ డచె బ్యాంక్ ఇండియా సీఈవోగా పనిచేస్తున్నారు. యస్ బ్యాంక్ సీఈవో వ్యవహారం ఇటీవల వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. బ్యాంకు సీఈవోగా ఉన్న రాణా కపూర్ పదవీకాలం గతేడాది ఆగస్టు 31తో ముగిసింది. అయితే సీఈవోగా రాణాను పునర్నియమిస్తూ బ్యాంకు బోర్డు నిర్ణయం తీసుకుంది. మరో మూడేళ్ల పాటు రాణా ఈ పదవిలో కొనసాగుతారని గతంలో ప్రకటించింది. అయితే యస్ బ్యాంక్ ఆర్‌బీఐ నిబంధనలను ఉల్లంఘించినట్లు ఆరోపణలు రావడంతో మరోసారి రాణాను ఎండీ, సీఈవోగా కొనసాగించేందుకు రిజర్వ్ బ్యాంక్ నిరాకరించింది. వచ్చే ఏడాది జనవరి చివరి వరకు మాత్రమే ఆయన సీఎండీగా కొనసాగుతారని, ఆ లోగా కొత్త సీఈవో, ఎండీని ఎంపికచేయాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ఈ నేపథ్యంలో రవ్‌నీత్‌ను నియమిస్తూ యస్‌బ్యాంక్ గురువారం ప్రకటన విడుదల చేసింది.కాగా.. రవ్‌నీత్ నియామకం నేపథ్యంలో స్టాక్ ఎక్స్ఛేంజీల్లో బ్యాంకు షేర్లు అనూహ్యంగా పెరిగాయి. ఒక దశలో షేరు ధర 20శాతం వరకు పెరిగింది. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో బ్యాంకు షేరు ధర 14.32శాతం పెరిగి రూ. 225.50 వద్ద కొనసాగుతోంది.

లాభాల్లో ముగిసిన మార్కెట్లు



ముంబయి: వరుసగా గత రెండు సెషన్ల నుంచి నష్టాలలో నడిచిన దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కోలుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూలతలతో గురువారం ఆద్యంతం ఒడుదొడుకులతో సాగిన సూచీలు చివరకు లాభాలతో ముగిశాయి. అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మళ్లీ తెరపైకి రావడంతో అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా సాగాయి. ఈ పరిణామాలపై దృష్టి సారించిన మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో గురువారం నాటి సెషన్‌ను సూచీలు మందకొడిగానే ప్రారంభించాయి. ట్రేడింగ్ ఆరంభంలో లాభనష్టాల్లో ఊగిసలాడిన సూచీలు చివరి గంటల్లో కాస్త కోలుకున్నాయి. యెస్‌బ్యాంక్, రిలయన్స్ లాంటి దిగ్గజ షేర్లు రాణించడం మార్కెట్‌కు కలిసొచ్చింది. దీంతో గురువారం ట్రేడింగ్‌ను సూచీలు లాభాలతో ముగించాయి. సెన్సెక్స్ 87 పాయింట్లు లాభపడి 16,195 వద్ద, నిఫ్టీ 18 పాయింట్ల లాభంతో 10,850 వద్ద స్థిరపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 71.22గా కొనసాగుతోంది. ఎన్ఎస్ఈలో యెస్‌బ్యాంక్, రిలయన్స్, టీసీఎస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్, టెక్ మహీంద్రా షేర్లు లాభపడగా.. టాటామోటార్స్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, యూపీఎల్ లిమిటెడ్, అల్ట్రాటెక్ సిమెంట్, సన్‌ఫార్మా షేర్లు నష్టపోయాయి.

ఏడాదిలో 'నానో'కు గుడ్‌బై!



నవతెలంగాణ, వాణిజ్య విభాగం

రతన్ టాటా కలల కారు నానోను అప్‌గ్రేడ్ చేసే యోచన లేదని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్ బిజినెస్ యూనిట్ ప్రెసిడెంట్ మయాంక్ పరీక్ అన్నారు. నానో కోసం ఇకపై పెట్టుబడులు పెట్టబోమని స్పష్టం చేశారు. 2020 ఏప్రిల్‌తో నానో అమ్మకాలు, ఉత్పత్తిని నిలిపివేస్తామని వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన టాటా మోటార్స్ కొత్త ఎస్‌యువి హారియర్‌ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నానోతో పాటు మరి కొన్ని ప్యాసింజర్ వాహనాలను కూడా బిఎస్4 నిబంధనలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయబోమన్నారు. అయితే వాటి వివరాలను వెల్లడించడానికి ఆయన ఆసక్తి చూపలేదు. 2020 ఏప్రిల్ నాటికి అన్ని వాహనాలను బిఎస్4కు మార్చడం చాలా పెద్ద సవాల్‌తో కూడుకున్నదని అన్నారు. క్రితం 36 నెలల్లో టాటా మోటార్స్ ప్రగతి చాలా మెరుగు పడిందన్నారు. క్రితం ఏప్రిల్ నుంచి డిసెంబర్ కాలంలో పరిశ్రమ 4.4 శాతం పెరుగుదలను నమోదు చేయగా, తమ కంపెనీ ఏకంగా 22.4 శాతం వృద్ధిని కనబర్చిందని అన్నారు. ప్యాసింజర్ సెగ్మెంట్‌లో తమకు మూడేళ్ల క్రితం 2.8 శాతం మార్కెట్ వాటా ఉండగా.. ప్రస్తుతం దాదాపుగా 7 శాతం వాటాకు పెంచుకున్నామన్నారు.

బిగ్‌బజార్‌లో షాపింగ్ సందడి

- చౌక ఆఫర్ తో కళకళలాడుతున్న మాల్స్



హైదరాబాద్: భారతదేశ అతిపెద్ద షాపింగ్‌లో సందడితో మాల్స్ కళకళలాడుతున్నాయి. ఐదురోజులు చౌక ఆఫర్‌ను బిగ్‌బజార్ తెచ్చిన విషయం విదితమే. ఈ ఆఫర్ ముగియటానికి కొద్దిరోజులే గడువు ఉన్నది. 27 వరకు ఆఫర్ అమల్లోకి ఉన్నట్టు నిర్వాహకులు తెలిపారు.. మూడువేలు అంతకన్నా ఎక్కువ విలువగల షాపింగ్ చేసిన వారికి 20శాతం డిస్కౌంట్‌ను వారి ఫ్యూచర్ షాపింగ్ వ్యాలెట్ ద్వారా క్యాష్‌బ్యాక్ రూపంలో ఇవ్వనున్నట్టు పేర్కొంది. ఐదువందల అంతకన్నా ఎక్కువ షాపింగ్ చేసి రూపేకార్డు ద్వారా చెల్లించిన వారికి 7శాతం డిస్కౌంట్, ఐదువేలు అంతకన్నా ఎక్కువ చెల్లిస్తే అదనంగా 10శాతం డిస్కౌంట్ లభిస్తుందని చెప్పింది. తమ ప్రత్యేకమైన సభ్యుల కోసం 21,22నుంచి ముందస్తు అమ్మకాలు చేపట్టనున్నట్టు తెలిపింది. వారిలో వేయిరూపాయలు షాపింగ్ చేసిన వారికి వంద రూపాయలు డిస్కౌంట్ ఇవ్వనున్నట్టు వెల్లడించింది. కస్టమర్లు పేటీఎమ్ నుంచి బిగ్‌బజార్ కూపన్లను పొందవచ్చు.. దీని ద్వారా 50శాతం క్యాష్‌బ్యాక్ పొందవచ్చనీ తెలిపారు. అదే కార్డులను బిగ్‌బజార్ షోరూంలో ఇచ్చి వస్తువులపై డిస్కౌంట్లను, అంతేకాకుండా 20శాతం అదనంగా క్యాష్‌బ్యాక్ పొందవచ్చనీ పేర్కొన్నది. ఈ సందర్భంగా బిగ్‌బజార్ సీఈఓ సదాశివ్ నాయక్ మాట్లాడుతూ... అన్నింటికన్నా చౌక ఆఫర్ కోసం కస్టమర్లు ఎప్పుడూ వేచిచూస్తువుంటారని తెలిపారు. అధిక డిస్కౌంట్ ఉన్న వస్తువులపై అదనంగా 20శాతం క్యాష్‌బ్యాక్ ఇస్తున్నందున ఈ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారులను కోరారు.

ట్రావెల్స్ రంగంలో అగ్రగామి 'సదరన్'

- ఎండీ ఆలపాటి కృష్ణమోహన్

హైదరాబాద్: ట్రావెల్స్ రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన తమ సంస్థ అగ్రగామిగా నిలిచిందని సదరన్ ట్రావెల్స్ ఎండీ ఆలపాటి కృష్ణమోహన్ తెలిపారు. పర్యాటకుల సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణమే ధ్యేయంగా తమ ట్రావెల్స్ పనిచేస్తోందన్నారు. ట్రావెల్ టూరిజమ్ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తూ పర్యాటకుల నమ్మకాన్ని తమ సంస్థ చూరగొన్నదని చెప్పారు. అందువల్లే నెంబర్ వన్ డోమెస్టిక్ టూర్ ఆపరేటర్‌గా కేంద్ర ప్రభుత్వం నుంచి గుర్తింపు లభించిందని వివరించారు. దేశ విదేశాల్లో విలాసవంతమైన, వరల్డ్ క్లాస్ టూర్ ప్యాకేజిలను తమ సంస్థ అందిస్తోందని వెల్లడించారు.టికెట్ బుకింగ్ నుంచి వసతి, సైట్ సీయింగ్ కోసం అనుభవజ్ఞులైన సదరన్ ట్రావెల్స్ స్టాఫ్ పనిచేస్తున్నారని తెలిపారు.

సుకుమా అడవుల్లో ఎదురు కాల్పులు

- ఇద్దరు మావోయిస్టులు మృతి

నవతెలంగాణ-చర్ల

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పోలంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దండకారణ్యంలో గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందినట్టు జిల్లా ఎస్పీ జింతేద్ర శుక్లా తెలిపారు. తెల్లవారుజామున పోలీస్ బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడ్డారు. ఈ క్రమంలో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. ఘటనా స్థలంలో నాటు తుపాకీతో పాటు దైనందిక సామాగ్రి, విప్లవ సాహిత్యాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు.

ఇదిలా ఉండగా జనవరి 31న భారత్ బంద్ నిర్వహించాలని చర్ల శబరి ఏరియా మావోయిస్టు కార్యదర్శి శారద పేరిట పోస్టర్లు వెలిశాయి.

రక్షణరంగ ప్రయివేటీకరణను ఆపాలి

ఉద్యోగుల సమ్మెకు మద్దతు : తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రక్షణ రంగంలోకి వంద శాతం ఎఫ్‌డీఐలను ఆహ్వానించడాన్ని, ప్రయివేటీకరించడాన్ని నిరసిస్తూ రక్షణ రంగ ఉద్యోగులు చేస్తున్న మూడు రోజుల సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్నట్టు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఈమేరకు హైదరాబాద్‌లో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రక్షణ రంగ ప్రయివేటీ కరణను కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు నాలుగున్నరేండ్లుగా డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ పేరుతో అమలు చేస్తున్న విధానాల ఫలితంగా 42 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, 52 డీఆర్‌డీఓ ల్యాబ్స్, 9 ఆర్మీ ఆధారిత, ఇంజినీరింగ్ సర్వీసు వర్క్‌షాపులు, డిఫెన్స్ ప్రొడక్షన్స్, మిలటరీ ఫామ్స్ తదితర సంస్థలన్నీ బలహీనపడుతున్నాయని పేర్కొన్నారు. ఏడు దశాబ్దాలుగా 75శాతం రక్షణ రంగ ఉత్పత్తులను మనదేశ సంస్థలే ఉత్పత్తి చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అన్ని రకాల సామర్థ్యమున్నప్పటికీ రక్షణ ఉత్పత్తుల తయారీని ప్రయివేటీకరణ, ఔట్‌సోర్సింగ్ ద్వారా స్వదేశీ విదేశీ కార్పొరేట్లకు అప్పగించటం దారుణమని, ఇలాంటి చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. మోడీ సర్కారు అనాలోచిత నిర్ణయం వల్ల రక్షణ రంగంలోని వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల భవిష్యత్ ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల భద్రతే కాకుండా దేశరక్షణ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడం అత్యంత సిగ్గుమాలిన చర్య అని తెలిపారు. కేంద్రంలోని కార్పొరేట్ల ప్రయోజనాల కోసం దేశ భద్రతను తాకట్టు పెట్టే దుస్థితికి ఎన్డీయే దిగజారిందని విమర్శించారు. దేశప్రయోజనాలను రక్షించే దిశగా సాగుతున్న రక్షణరంగ ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయాలని అన్ని వర్గాల ప్రజానీకానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ నుంచి పిలుపునిచ్చారు.



రక్షణ రంగాన్ని ప్రయివేటీకరిస్తూ దేశ భద్రతకు ప్రమాదం తెస్తున్న మోడీ సర్కారు తీరును నిరసిస్తూ హైదరాబాద్‌లోని మిథానిలో గల డీఆర్‌డీఓ కార్యాలయం గేటు ఎదుట నినాదాలు చేస్తున్న రక్షణ రంగ ఉద్యోగులు, ఏఐడీఇఎఫ్ నాయకులు

'మల్లన్నసాగర్' మళ్లీ అడ్డగింత



నవతెలంగాణ-తొగుట

'పరిహారమిచ్చేదాక పనులు చేపట్టొద్దు. మా భూముల్లో అడుగు పెట్టొద్దు' అని మల్లన్నసాగర్ నిర్వాసితులు హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా తొగుట మండల కేంద్రంతో పాటు వేములఘాట్, రాంపూర్ గ్రామాల్లో పనులు చేపట్టేందుకు గురువారం వచ్చిన అధికారులు, కాంట్రాక్టర్లను అడ్డుకొని ఆందోళన చేశారు. అంతకు ముందు అక్కడికి పనులు చేయ డానికి కాంట్రాక్టర్లు యంత్రాలను తీసుకురాగా రైతులు హుటాహుటిన చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ తమకు రావాల్సిన పరిహారం ఇచ్చేంత వరకు పనులు ప్రారంభించకూడదని తేల్చిచెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంలో కోల్పోతున్న చెట్లు, పైపులైన్లు, బోర్లు, బావులకు సంబంధించిన పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ముంపు గ్రామాలకు సంబంధించిన భూముల విష యమై కోర్టులో కేసు నడుస్తోందనీ, తీర్పు రాకముందే పనులెలా చేపడతారనీ ప్రశ్నించారు.నిర్వాసితులు పనులు అడ్డుకోవడంతో కాంట్రాక్టర్లు, అధికారులు వెనుదిరగక తప్పలేదు.

కరీంనగర్ కలెక్టర్‌కు 'ఎఫెక్టివ్ కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్' అవార్డు



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్

నవతెలంగాణ- కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'బేటీ బచావో-బేటీ పడావో' పథకాన్ని విజయవంతంగా అమలు చేసి జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు తెచ్చినందుకు కరీంనగర్ కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ 'ఎఫెక్టివ్ కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ అవార్డు' అందుకున్నారు. న్యూఢిల్లీలో గురువారం నిర్వహించిన 'జాతీయ బాలికా దినోత్సవం' కార్యక్రమంలో వుమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి మేనకా గాంధీ కలెక్టర్ సర్ఫరాజ్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సంక్షేమ అధికారి శారద, డీసీపీవో పర్వీన్ పాల్గొన్నారు.

కాసుల వేట.. కలప స్మగ్లింగ్!

నిర్మల్‌లో తీగ.. నిజామాబాద్‌లో డొంక

- జిల్లాలో జోరుగా సాగుతున్న చీకటిదందా
- ఏఆర్ ఎస్సైతో సహా ముగ్గురు ఫారెస్ట్ అధికారులపై వేటు
- కాల్‌డేటా సేకరణలో నిర్మల్ జిల్లా ఖాకీలు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి

అడవులను సంరక్షించాల్సిన అధికారులే అక్రమాలకు తెరలేపారు. అమ్యామ్యాలకు రుచిమరిగి కలప అక్రమార్కులతో అనైతిక దోస్తీ కట్టారు. ఈ చీకటిదందా నేపథ్యంలో నిర్మల్ జిల్లాలో తీగలాగితే నిజామాబాద్ జిల్లాలో డొంక కదులుతోంది. బుధ, గురువారాల్లో ఓ పోలీసు అధికారి సహా ముగ్గురు అటవీశాఖ అధికారులపై సస్పెన్షన్ వేటుపడటం కలకలం రేపుతోంది. దీంతో ఇంటిదొంగల పనిపట్టడంలో భాగంగా అటవీశాఖ చర్యలకు ఉపక్రమించగా.. ఇంకా ఎవరెవరికి సంబంధాలున్నాయనే కోణంలో విచారిస్తూ కాల్‌డేటా సేకరించడంలో నిర్మల్ పోలీసులు నిమగ్నమయ్యారు. అయితే తతంగంలో రాజకీయ, పోలీసు, అటవీ శాఖ చేతులుండటం చర్చనీయాంశానికి దారితీస్తోంది.

పెట్రోల్ చైన్ సాయంతో నరికివేత..

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో అడవులను యథేచ్ఛగా నరికివేస్తూ కలపను అక్రమంగా తరలిస్తున్నారు. జాతీయ రహదారులకు కూతవేటు దూరంలోనే ఈ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారి పక్కనే ద్విచక్రవాహనం 'రేస్' చేస్తూ శబ్దంరాకుండా పెట్రోల్ చైన్ సాయంతో చెట్లు నరికేస్తున్నారు. వాటిని లారీలో సగం వరకే లోడ్ చేస్తూ ఆపై ఇతర వస్తువులతో కప్పేస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద అటవీశాఖ సిబ్బంది చేతులు తడిపి రవాణా చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో నిర్మల్ పోలీసుల దాడిలో నిజామాబాద్ జిల్లాకు చెందిన ఏఆర్ ఎస్ఐ ప్రమేయం బయటపడింది. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చేరిన కలపను స్థానికంగా అమ్మడంతో పాటు అంతిమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నట్టు తెలిసింది.





అడవుల సంరక్షణకు చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశాల నేపథ్యంలో ఈ నెల 20న నిర్మల్ పోలీసులు రూ.16 లక్షలా 52 వేల విలువగల టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కేసులో మొత్తం 20 మంది నిందితులు పట్టుపడగా.. అందులో ఆరుగురు నిజామాబాద్ జిల్లాకు చెందినవారని తేలింది. మూడ్రోజుల క్రితమే ఇందులో ప్రమేయమున్న నిజామాబాద్ డిప్యూటీ మేయంపైనా కేసు నమోదు చేశారు. నిందితుల్లో పలువురు నిజామాబాద్ సామిల్‌లో యజమానులకు చెందిన సోదరులు, బంధువులు కావడం గమనార్హం. నిందితుల నుంచి సేకరించిన సమాచారం మేరకు మూడురోజులుగా జిల్లా కేంద్రంలోని మాలపల్లి ప్రాంతంలో గల సామిల్లలో అటవీ, పోలీసు శాఖ ఉన్నతాధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. నాలుగు సామిల్లనూ సీజ్ చేశారు.

రెండ్రోజుల్లో నలుగురిపై వేటు

కలప అక్రమార్కులతో సంబంధాలున్న ఏఆర్ ఎస్ఐ షకీల్ పాషాను సస్పెండ్ చేస్తున్నట్టు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదేవిధంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఫారెస్ట్ అధికారులనూ సస్పెండ్ చేస్తున్నట్టు హైదరాబాద్ పీసీసీఎఫ్ నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అందులో ఎఫ్‌డీఓ వేణుబాబు, ఎఫ్ఆర్ఓ రవి, మోహన్‌బాబు పేర్లు ఉన్నాయి. మరోవైపు నిర్మల్ పోలీసు సహకారం తీసుకుంటూ ఆ జిల్లా పోలీసుల అదుపులో ఉన్న నిందితుల కాల్‌డేటా సేకరణ పనిలో పడ్డారు. ఒకవేళ సిబ్బంది ప్రమేయం తేలితే మాత్రం కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫారెస్టు అధికారి ప్రసాద్ తెలిపారు.

లక్షల్లో వసూళ్లు..?

నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా సుమారు 90 సామిల్లు ఉన్నాయి. ఒక్క నిజామాబాద్ జిల్లా కేంద్రంలోనే సుమారు 37 వరకు సామిల్లు, ఎనిమిది టింబర్ డిపోలున్నాయి. సామిల్లలో ప్రతి ఆర్నెల్లకోసారి అటవీశాఖ అధికారులు తనిఖీలు చేయాల్సి ఉంటుంది. సామిల్‌లో నిల్వ ఉన్న కలప ఎంత? అందులో టేకు, ఇతర కలప వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. పైగా సామిల్లను యేడాదికోసారి రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. పారదర్శకత కోసం ఈ విధానం అమల్లోకి తీసుకురాగా.. అటవీశాఖ అధికారులు తమకు అనుకూలంగా మలుచుకున్నట్టు, కలప అక్రమ వ్యాపారం చేస్తూ జీరో దందా చేస్తున్న సామిల్ యజమానుల వద్ద రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



ప్రకృతిలో జీవులందరూ సమానమే. బుద్ధి జీవి మనిషి తన తెలివితేటలను విస్తృత పరుచుకుంటూ ప్రకృతిలో మగవారు ఎక్కువ.. ఆడవారు తక్కువ అన్న వాదాన్ని ప్రచారంలోకి తీసుకువచ్చారు. సమస్యలన్నీ ఆడవారికే అన్నవిధంగా సైన్సును తప్పుదారి పట్టిస్తున్నారు. ఆడవారిలో మోనోపాజ్ దశ మాదిరిగానే మగవాళ్లలో కూడా ఇలాంటి దశ ఉంటుంది అన్న విషయం చాలా మంది మగవాళ్లకు తెలియదు. వయసు పెరిగేకొద్దీ శరీరంలో హార్మోన్లహెచ్చుతగ్గులతో సమస్యలు ఎవరికైనా తప్పవు అన్నది వాస్తవం.

ఎవరికైనా తప్పని తిప్పలు...

ఆడవారిలో నలభైండ్లు పైబడిన తర్వాత ఈస్ట్రోజన్ హార్మోన్ల ఉత్పత్తి తగ్గుతుంది. దీని ప్రభావం వల్ల కండరాల, ఎముకల పటుత్వం తగ్గుతుంది. ఈ హార్మోన్ లోపం వల్ల ఆస్టియోపోరోసిస్ వచ్చే అవకాశం ఉంది. రుతుచక్రం క్రమక్రమంగా ఆగిపోవడంతో శరీరంలో మార్పులు వేగంగా జరుగుతాయి. ఈ దశనే మోనోపాజ్ దశ అంటారు. ఇలాంటి పరిస్థితే మగవాళ్లలోనూ కనిపిస్తుంది. వారిలో టెస్టోస్టిరాన్ హార్మోన్ ఉత్పత్తి క్రమక్రమంగా తగ్గుతుంది. అయితే ఈ హార్మోన్ లోపం వల్ల వచ్చే మార్పులు చాలా కాలం పాటు అంతర్లీనంగా జరుగుతూ ఉంటాయి. వారివారి శరీరతత్వాన్ని బట్టి మూడు నాలుగేండ్ల పాటు 45ఏండ్ల నుంచి 52ఏండ్ల మధ్య ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఆడవారిలో వచ్చే దశను మోనోపాజ్ అని పిలిస్తే.. మగవారిలో వచ్చే దశను ఆండ్రోపాజ్ అని పిలుస్తారు. అయితే మగవాళ్లలో ఎప్పుడు ఈ దశ వచ్చిందో తెలుసుకోవడం కాస్త కష్టమే. ఆడవాళ్లు మోనోపాజ్ తో ఇబ్బంది పడ్డట్లే మగవాళ్లు కూడా ఆండ్రోపాజ్ తో ఇబ్బంది పడతారు.

లక్షణాలు..

ఆండ్రోపాజ్ దశ ఒకసారిగా వచ్చే సమస్య కాదు. క్రమక్రమంగా లక్షణాలు కనిపిస్తాయి.

ఈ దశలో టెస్టోస్టిరాన్ హార్మోన్ ఉత్పత్తి క్రమక్రమంగా తగ్గడంతో లైంగిక సామర్థ్యం తగ్గుతుంది.

- మెల్లమెల్లగా శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతారు.
- నిద్రలేమి, కుంగుబాటు, ఒంట్లో శక్తి తగ్గిపోవడం తదితర ఇబ్బందులకు గురి అవుతారు.
- ఎముకల పటుత్వం దెబ్బతింటుంది.
- కొందరిలో చాలా అరుదుగా మహిళల మాదిరిగా బ్రెస్ట్ పెరుగుతుంది.
- అలసట, మతిమరుపు, కండరాల నొప్పులు,
- ఆకలి మందగించడం, చికాకు, కోపం మొదలైనవన్నీ ఆండ్రోపాజ్ లక్షణాలుగా గుర్తించాలి. వీటిని సులభంగా గుర్తించవచ్చు.

చికిత్స..

ఇది వయసుతో పాటు శరీరంలో కలిగే మార్పులతో వచ్చే ఒక దశ మాత్రమే. క్రమక్రమంగా శరీరంలో అంతర్లీనంగా వచ్చే మార్పులను, బయటకు కనిపించే లక్షణాలను గమనిస్తే ఆండ్రోపాజ్ దశ వచ్చినట్టు తెలుసుకోవచ్చు. శరీరంలో తగ్గిన టెస్టోస్టిరాన్ హార్మన్ స్రావం తగినంత ఉండేలా చేయడం ద్వారా ఈ సమస్య నుంచి తేలిగ్గా బయటపడవచ్చు. అందుకు తగినట్టుగా జీవనవిధానాన్ని అలవాటు చేసుకోవాలి. సమస్య ఎక్కువగా ఉంటే టెస్టోస్టిరాన్ ఇంజెక్షన్లు మోతాదునుబట్టి నెలకొకసారి



లేదంటే మూడు నెలలకి ఒకసారి తీసుకోవచ్చు. ఇంజెక్షన్లకు ప్రత్యామ్నాయంగా టెస్టోస్టిరాన్ జెల్ కూడా ఉంటుంది. దీన్ని ప్రతిరోజూ చర్మం మీద అప్లై చేసుకుని వెంటనే చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ఈ జెల్ రాసుకున్న తర్వాత మహిళలను, పిల్లలను అదే చేతులతో తాకితే ఆ హార్మోన్ వాళ్ల శరీరంలోకి చేరే ప్రమాదం ఉంటుంది. కాబట్టి జెల్ వాడేవాళు శుభ్రంగా చేతులు కడుక్కోవాలి.

టెస్టోస్టిరాన్ ఇంజెక్షన్ తీసుకునే ముందు రక్తంలో హిమోగ్లోబిన్ పరిమాణాన్ని తెలుసుకోవాలి. కాబట్టి ఆండ్రోపాజ్‌కు లక్షణాలు కనిపిస్తే.. వెంటనే ఆండ్రాలజిస్టుని కలిసి అవసరమైతే హార్మోన్ ట్రీట్‌మెంట్ తీసుకోవాలి.

లైఫ్‌స్టైల్‌లో మార్పులు..

జీవనవిధానంలో మార్పులు, సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల చాలా వరకు ఈ సమస్య తీవ్రతను తగ్గించుకోవచ్చు. ముందు నుంచే ఆహార విషయంలో కొన్ని రకాల జాగ్రత్తలు పాటిస్తే సమస్య తీవ్రతను చాలావరకు తగ్గించుకోవచ్చు.

- ప్రొటీన్లు ఎక్కువగా ఉండే సోయా, పాలు, చికెన్ లాంటి పదార్థాలను తప్పక తీసుకోవాలి.
- వేరుశెనగ, బాదం, జీడిపప్పులాంటివి ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.
- మద్యం సేవించడం, ధూమపానం, పొగాకు ఉత్పత్తులు తినడం వంటి అలవాట్లు టెస్టోస్టిరాన్ హార్మోన్‌ను తగ్గిస్తాయి. వీటికి దూరంగా ఉండటం మంచిది.
- డయాబెటిక్, రక్తపోటుకు మందులు వాడేవారిలోనూ సమస్య ఎక్కువగా ఉంటుంది.

క్రమం తప్పకుండా హెల్త్‌చెకప్ చేయించుకుంటూ బిపీ, షుగర్ అదుపులో ఉంచుకోవాలి.

- విటమిన్ సి, ఇ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా టెస్టోస్టిరాన్ హార్మోన్ లోపాన్ని తగ్గించుకోవచ్చు.
- ఆహార నియమాలను పాటించడంతో పాటు క్రమం తప్పకుండా తేలికపాటి వ్యాయామాలు చేయాలి.
- ఫాస్ట్‌ఫుడ్ తగ్గించాలి. రాత్రిళ్లు ఆలస్యంగా నిద్రపోయే అలవాటు మానుకోవాలి.
- ఇలా చిన్నచిన్న మార్పులతో ఆండ్రోపాజ్ సమస్య నుంచి వీలున్నంత దూరంగా ఉండవచ్చు. ఇవన్నీ పాటించీ ఆండ్రోపాజ్ సమస్య బాధపెడితే వైద్యుల సలహా మేరకు హార్మోన్ చికిత్స చేసుకోవడం మంచిది.

డాక్టర్ లక్ష్మణ్ రావు
ఎం.బి.బిఎస్
మల్లునరసింహా రెడ్డి స్మారక ప్రజా వైద్యశాల
ఎం.హెచ్.భవన్, అజామాబాద్,
హైదరాబాద్



చలిలో జాగ్రత్త..

చలి కాలంలో చర్మం అడుగున రక్తనాళాలు కుంచించుకుపోతాయి. దాంతో కీళ్లకు రక్తప్రసరణ తగ్గుతుంది. ఫలితంగా రక్తం ద్వారా కీళ్లకు అవసరమైన పోషకాలు అందకపోవడం వల్ల, మ దులాస్థి కుంచించుకుపోయి కీళ్లు బిగుసుకుని నొప్పి మొదలవుతుంది. ఇలాంటి ఇబ్బంది ఆస్టియో ఆర్థ్రయిటిస్, రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ ఉన్నవాళ్లకు మరింత ఎక్కువ. అంతకు ముందు ప్రమదాల్లో కీళ్లు, లిగమెంట్లకు తగిలిన దెబ్బల వల్ల కూడా చలికాలంలో నొప్పులు మొదలవుతాయి. ఈ సమస్యలన్నీ చలి వల్ల ఎక్కువ అవుతాయి కాబట్టి ఈ సమస్యను వైద్య పరిభాషలో 'రేనాడ్స్ ఫినామినా' అని పిలుస్తారు. ఈ నొప్పుల బాధ నుంచి తప్పించుకోవాలంటే కొన్ని ఉపశమన పద్ధతులు పాటించడంతోపాటు, కొన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి. అవేంటంటే...

చలికాలంలో కీళ్లనొప్పులు ఎక్కువగా బాధిస్తాయి. చలితో పెరిగే నొప్పులు తగ్గాలంటే చల్లని వాతావరణం, ఏసీలకు దూరంగా ఉండాలి. ఇంట్లో వెచ్చదనం పెంచాలి. ఇందుకు హీటర్లు ఉపయోగించవచ్చు. స్వెటర్లు వేసుకోవాలి.



- శరీరానికి ఎండ సోకేలా చూసుకుంటున్నా, వాతావరణంలో ఉన్న కాలుష్యం కారణంగా సూర్య కిరణాలు సూటిగా చర్మానికి తగలవు. ఫలితంగా చర్మంలో సింథసిస్ సక్రమంగా జరగక సరిపడా విటమిన్ 'డి' తయారవదు. విటమిన్ డి లోపంతో బాధపడేవారు చలికాలంలో ప్రతిరోజూ కనీసం 10 మైక్రోగ్రాముల విటమిన్ డి సప్లిమెంటు తీసుకోవాలి.
- గోరువెచ్చని నీళ్లలో ఉప్పు వేసి కాళ్లు, చేతులు ముంచి, వేళ్లు కదిలిస్తూ ఉండాలి.
- చేతి వేళ్లలో నొప్పులు ఉన్నవాళ్లు 'హ్యాపీ బాల్' నొక్కే వ్యాయామం చేయాలి.
- మోకాలి కీళ్ల ఆర్థ్రయిటిస్‌తో బాధపడేవాళ్ళు ఎముకలు మరింత అరిగిపోకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ట్రెడ్‌మిల్, జుంబా, ఏరోబిక్స్‌కు బదులు మెత్తని పచ్చిక మీద నడక, సైకిల్ తొక్కడం, క్రాస్ ట్రైనర్ వాడడం మొదలైన వ్యాయామాలు చేయాలి. పార్షియల్ స్క్వాట్ వ్యాయామం చేయవచ్చు.
- వ్యాయామం చేసేవాళ్ళు మెత్తని బూట్లు వాడాలి.
- ఈత కొట్టడం కీళ్లకు అనువైన వ్యాయామం.
- మెత్తని సోఫాలను వాడకూడదు. సోఫాలో కూర్చున్నప్పుడు మోకాలు 90 డిగ్రీల కోణంలో ముడుచుకుంటుంది. ఈ యాంగిల్‌లో ఉన్న మోకాళ్ల మీద భారం మోపుతూ లేచే ప్రయత్నం చేస్తే కీళ్ల అరుగుదల పెరుగుతుంది. కాబట్టి సోఫా బదులు, బ్యాక్ సపోర్ట్ ఉన్న చెక్క కుర్చీలు వాడాలి.
- బరువును అదుపులో ఉంచుకోవాలి. వైద్యులు సూచించిన ఫిజియోథెరపీ చేయాలి.


డైట్ చేస్తూ పాలు తాగితే..!



ప్రతిరోజూ మనం తీసుకునే పౌష్టికాహారంలో పాలు ఎంతో ముఖ్యమైనవి. పాలలో దాదాపుగా అన్ని పోషకాలు సమపాళ్లలో ఉంటాయి. ఇది ఒక బ్యాలెన్స్‌డ్ డైట్ లాంటిది. ఐరన్, విటమిన్ సి తప్ప మిగిలిన అన్ని పోషకాలుంటాయి. సో.. పాలు తాగడం వల్ల చాలా పోషకాలు మనకు అందుతాయి. పాలలో ఉండే పోషకాలు హై బయోలాజికల్ వాల్యూ కలిగి ఉంటాయి. అంటే పాలలో ఉన్న అన్ని పోషకాలు వంద శాతం మనకు లభ్యమవుతాయి. ప్రొటీన్, కార్బోహైడ్రేట్ ఫ్యాట్స్, కాల్షియం, బి విటమిన్, ఫ్యాట్ సోల్యుబుల్ విటమిన్స్ మొదలైనవి పాలలో ఉంటాయి.

- పెరిగే పిల్లలు పాలు తాగడం వల్ల ఎముకలు పొడువుగా, మందంగా పెరిగి గట్టిపడతాయి. ఆరోగ్యంగా పెరుగుతారు.
- గర్భవతులు పాలు తాగడం వల్ల పిండం వృద్ధి బాగుంటుంది.
- పాలిచ్చే తల్లులు పాలు తాగడం వల్ల వారి ఎముకల నుంచి పోయిన కాల్షియం తిరిగి చేరుతుంది.
- నిద్రపోయే ముందు పాలు తాగడం వల్ల నిద్ర బాగా పడుతుంది.
- బి12, విటిమిన్ డి లోపాలు రాకుండా చేస్తుంది.
- మెనోపాజ్, ఆండ్రోపాజ్ దశలో పాలు తాగితేశరీరానికి కావల్సిన క్యాల్షియం అందుతుంది. ఎముకలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి.
- చాలామందికి పాలుపడవు. ఆ వాసన చూస్తేనే వాంతులు చేసుకుంటారు. అలాంటివారు పాలకు బదులు పాల ఉత్పత్తులు తీసుకోవచ్చు. పనీర్ చీజ్, పెరుగు, మజ్జిగ ప్రతిరోజూ తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది.
- ఫ్యాట్ పర్సెంట్ ఎంత ఉండాలి అన్నది తరచు ఎక్కువ మందిని వేధించే ప్రశ్న. పాలు వీలైనంత నార్మల్‌గా తీసుకోవాలి. అంటే ఫుల్ ఫ్యాట్ ఉన్న పాలన్నమాట. ఇలా తీసుకోవడం వల్ల విటమిన్ ఎ, డి, ఈ,కెలు అందుతాయి.
- పాలలో ఏమీ కలపకుండా నార్మల్‌గా తీసుకుంటే మంచిది. పసుపు, మిరియాలు, పంచదార, ఇతర సప్లిమెంట్స్ అవసరాన్ని బట్టి మాత్రమే వాడాలి.
- అధిక బరువు ఉన్నవారు పాలు తాగవద్దు అంటారు. అయితే ఇది కేవలం అపోహ మాత్రమే..బరువు తగ్గాలనుకున్నవారు పాలు మానాల్సిన అవసరం లేదు. నిజానికి పాలతో వివిధ రకాల మిల్క్‌షేక్స్ చేసుకుని, భోజనానికి బదులుగా తీసుకోవచ్చు. ఎటువంటి పోషకలోపం రాకుండా డైట్ చేయవచ్చు. పాలు జీర్ణమవడానికి సమయం పడుతుంది. దాంతో ఆకలి కూడా తగ్గుతుంది.

ఔషధగని..



తల్లిబిడ్డల మధ్య పేగుబంధం బొడ్డు తాడు. ఇది భవిష్యత్ తరాలకు అపురూప ఔషధ గని అని అనేక పరిశోధనల ద్వారా తేలింది. ఎన్నో ఏండ్లగా ప్రపంచ వ్యాప్తంగా జరిగిన పరిశోధనల్లో బొడ్డుతాడు విలువ తెలిసి వచ్చింది. అనేక జబ్బులకు చికిత్స అందించేందుకు ఇది అపురూప కానుక అని పరిశోధకులు వెల్లడించారు. బొడ్డు తాడులో రెండు రకాల మూల కణాలు ఉంటాయి. అవి మిసైన్‌కైమల్ స్టెమ్ సెల్స్, ఎపిథీలియల్ స్టెమ్ స్టెల్స్ గా ఉంటాయి. మిసైన్ కైమల్ స్టెమ్ సెల్స్ ద్వారా మూలుగ, ఎముకలు, గుండెనరాలు, కొవ్వు సంబంధిత అనారోగ్య సమస్యలను నయం చేసే మూల కణాలు ఉంటాయి. అదేవిధంగా లివర్, పాంక్రియాస్, జీర్ణవాహిక సంబంధ క్యాన్సర్ రోగాల చికిత్సకు ఉపయోగించే మూలకణాలు ఉంటాయి. ఎపీథీలియల్ కణాల్లో మాత్రం చర్మ సంబంధిత జబ్బులు నయం చేసే అవకాశాలు ఉన్నాయి. దాదాపు 81 రకాల వ్యాధులను ఈ మూలకణాల చికిత్స ద్వారా నయం చేయవచ్చని ఆధునిక వైద్యనిపుణులు స్పష్టం చేస్తున్నారు. పెద్ద వయస్సులో వచ్చే పార్కిన్‌సన్, అల్జీమర్స్, మల్టిపుల్ సిలోయారిసిస్, మెదడు సంబంధిత జబ్బులు రెక్టమ్ క్యాన్సర్ లాంటి 19 రకాల జబ్బులకు చికిత్స కోసం పలు పరిశోధనలు జరుగుతున్నాయి. ఇవి ఫలిస్తే మరి చాలా అనారోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

మీకు తెలుసా..?

మీకేమైనా అనారోగ్య సమస్యలున్నాయా.. పరిష్కారం దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? ఈ కింది చిరునామాకు పోస్ట్‌కార్డు రాయండి.

మా చిరునామా

'రక్ష' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్టీసీ కల్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020
raksha.nava2015@gmail.com

దంతాలకు వచ్చే సమస్యలంటే?



నోరు మనిషికి ముఖద్వారం లాంటిది. ఆ నోటిలో అత్యంత ముఖ్యమైన భాగం దంతాలు. ఇవి ఆహారాన్ని చక్కగా నమిలి అతి చిన్న భాగాలుగా చేసి అన్నవాహిక ద్వారా జీర్ణాశయానికి పంపి జీర్ణక్రియను సులువుగా జరగడానికి ఎంతగానో ఉపకరిస్తాయి. ఈ దంతాలు గనుక లేకపోతే మనిషి కేవలం ద్రవపదార్థాలు మాత్రమే తీసుకోగలడు.

సహజంగా మనిషికి 32 దంతాలుంటాయి. వాటిలో ముందు రెండు పండ్లను "సెంట్రల్ ఇంసయిసర్స్" అంటారు. ఇవి మనం తినే ఆహారాన్ని కటింగ్ చేసి చిన్న ముక్కలుగా చేసేందుకు పనికి వస్తాయి. వాటి పక్కన ఉన్న దంతాలను "లెటరల్ ఇంసయిసర్స్" అంటారు. మిగతా పండ్లను "కెనాయిన్స్", "ప్రియోలార్స్", "మోలాల్స్" గా పిలుస్తారు. దవడపండ్లు గ్రైండింగ్‌కు ఉపయోగపడుతాయి.

దంతాలు కేవలం ఆహారం నమలడానికి మాత్రమే కాదు ఇంకా చాలా రకాలుగా ఉపయోగపడతాయి. మనిషి అందాన్ని రెట్టింపు చేస్తాయి. మాటలు స్పష్టంగా రావడానికి ఇవి ఎంతగానో అవసరం.



దంతాలలో ఉండే భాగాలు..

1. ఎనామిల్
2. డెంటిన్,
3. పల్ప్

- పంటి రంగు డెంటిన్ వల్ల పొందుతుంది.
- దంతాలు దవడ ఎముకలో అందంగా అమర్చబడి ఉంటాయి.
- చిన్న పిల్లలో ఇవి పాల రంగులోఉంటాయి. అందువల్ల పాలపళ్ళు అంటారు.
- పాల పండ్లలో ప్రిమోలార్స్ ఉండవు. వీటి మధ్య సందులు ఉండటం సహజం.
- దంతాలు పుచ్చిపోవడం అతి సహజం. ఇది చిన్నపిల్లల్లో ఎక్కువగా చూస్తుంటాం. దంతాలు పుచ్చిపోవడానికి కారణాలు అనేకం.
- కార్బోహైడ్రేట్స్ చాక్లెట్లలో, స్వీట్స్ ఎక్కువగా తీసుకోవడం, దంతాలను సరిగ్గా శుభ్రపరచకపోవడం. చిన్నపిల్లలు ఎక్కువ చాక్లెట్లు తింటారు. కాబట్టి వాళ్ళలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. చక్కెర పదార్థాలలో ఉండే సుక్రోజ్, ఫ్రక్టోస్ పదార్థాలు దంతాల సందుల్లో చిక్కుకోవడంతో అక్కడ క్రిములు పెరుగుతాయి.



ఇతర పంటి సమస్యలు:

1. ఎగుడు దిగుడు దంతాలు
2. దంతాల మధ్య సందులు
3. దంతాల అరుగుదల, వదులుగా అవ్వడం
4. దంతాల మధ్య పాచి పేరుకోవడం
5. చిగుళ్ళు వాయటం
6. చిగుళ్ళ నుంచి రక్తస్రావం
7. నోటి దుర్వాసన

ఎగుడు దిగుడు దంతాలు, సందులు:

- ఇది చిన్న పిల్లల్లో సహజం కాబట్టి దీన్ని సమస్యగా భావించనక్కర్లేదు.
- 17-18 సం. తర్వాత కూడా పళ్ళు సరైన వరుసలో లేకపోతే అప్పుడు దీన్ని సమస్యగా భావించవచ్చు.

కారణాలు: చిన్న పిల్లలు నోట్లో వేళ్ళు పెట్టుకోవడం సహజం. పిల్లలలో ఈ అలవాటు మానిపించాలి. లేకపోతే శాశ్వత దంతాలు కూడా ఎగుడుదిగుడుగా ఏర్పడతాయి.

- కొంత మందికి నోటి ద్వారా గాలి పీల్చుకునే అలవాటు ఉంటుంది. దీనివల్ల కూడా దంతాలపైన ప్రభావం ఉంటుంది.
- నాలుక కరుచుకునే అలవాటు కూడా మనం తరచూ చూస్తూనే ఉంటాం. దీనిని "టంగ్ థ్రస్టింగ్" అంటారు.

యాసిడ్ పంటిని కరగదీస్తుంది. పుచ్చును ఆంగ్లంలో డెంటిల్ కేరీస్ అంటారు. ఇది ముందు ఎనామిల్‌ని, తర్వాత డెంటిన్ ఆ తర్తా పల్ప్‌ని దెబ్బతీస్తుంది. కేరీస్ ఎనిమిల్ వరకు ఉన్నప్పుడు ఎటువంటి నొప్పి బాధ ఉండదు. డెంటల్‌లోకి వెళ్లినపుడు సెన్సిటివిటీ కలుగుతుంది. అనగా చల్లఇ నీళ్ళు త్రాగినపుడు పళ్ళు జివ్వుమంటాయి. పురుగు పల్ప్‌కు చేరినపుడు మాత్రం తీవ్రంగా నొప్పి ఉంటుంది. కొన్నిసార్లు ఆ నొప్పి తలకి, చెవికి కూడా పాకుతుంది. దాన్ని "రేడిమిటింగ్ పెయిన్" అంటారు. కేరీస్ ఎనామిల్ డెంటిన్‌లో ఉన్నపుడు సిమెంట్ వేస్తే సరిపోతుంది. పల్ప్‌కు చేరుకున్నపుడు మాత్రం "రూట్ కెనాల్" ట్రీట్‌మెంట్ చేయవలసి ఉంటుంది. అందువల్ల ముందుగానే జాగ్రత్తపడటం మంచిది. చాలామంది నొప్పి కలిగితేగానీ డెంటిస్ట్ దగ్గరకు వెళ్ళరు. అలా కాకుండా ప్రతి ఆరు నెలలకు ఒకసారి డాక్టర్‌ను సంప్రదించడం అవసరం.

పళ్ళ అరుగుదల: వయసు పెరుగుతుండగా పళ్ళలో కూడా పలు మార్పులు కలుగుతాయి. అందులో అన్నింటికన్నా ముఖ్యం దంతాలు అరిగిపోవడం. కొందరిలో యుక్తవయసులోనే ఈ సమస్య చూస్తుంటాం.

కారణాలు:

- *ఎక్కువ బలంతో దంతాలు రుద్దడం*
- *టూత్‌బ్రష్ బ్రిజిల్స్ గట్టిగా ఉండటం*
- *ఒకవైపు ఎక్కువ నమలడం*

పళ్ళు, గోర్లు కొరికే అలవాటు. దీనిని "బ్రక్సిసమ్" అంటారు. ఈ అలవాటు ఉన్నవారు తెలియకుండానే నిద్రలో పళ్ళు కొరుకుతుంటారు. దీనివల్ల కూడా దంతాలు త్వరగా అరిగిపోతాయి.

చిగుళ్ళ సమస్య: చిగుళ్ళ వాపు అనేది మనలో చాలా మంది ఎదుర్కొనే సమస్య. చిగుళ్ళ నుంచి రక్తస్రావం కూడా అవుతుంటుంది. వీటికి గల కారణం నోటిని శుభ్రంగా ఉంచకపోవడం. అంతేకాదు కొన్ని మందుల వలన కూడా చిగుళ్ళ వాపు వస్తుంది. అందులో ఒకటి 'నిఫిడిపిన్'. పంటికి పెట్టిన సిమెంట్ చిగురుకు తగులుతూ ఉంటే కూడా వాస్తుంది. పళ్ళను సరిగా శుభ్రపరచకపోతే గార పడుతుంది. అది పళ్ళసందుల్లో చిగురు సందుల్లో ఇరుక్కొని వాపుకు కారణం అవుతుంది. దీని వల్ల దుర్వాసన కూడా వస్తుంది. పళ్ళు పచ్చగా మారతాయి. ఇవి ప్రాథమికంగా తలెత్తే సమస్యలు. మీ దంతాలను పరీక్షించుకోండి. అందంగా ఉండండి.



Dr. M. Uday Kumar,
BDS, MDS
Asst. Professor Dental Surgeon &
Root Canal Specialist

Dr. M. Meena, BDS,
Cosmetic Dental Surgeon



మంధాన వందనం

- కివీస్‌పై శతక్కొట్టిన స్మృతీ
- రొడ్రిగస్ అజేయ అర్ధ సెంచరీ
- పూనమ్, దీప్తి, ఏక్తా మాయజాలం
- తొలి వన్డేలో భారత్ విజయం





నేపియర్

అమ్మాయిలు అదరగొట్టారు. నేపియర్‌లో కోహ్లిసేనకు మించిన విజయాన్ని సాధించారు!. బౌలర్లకు సహకారం లేని పిచ్‌పై తొలుత స్పిన్‌తో ఆతిథ్య న్యూజిలాండ్‌ను కుప్పకూల్చిన మిథాలీసేన, ఓపెనర్ల విధ్వంసంతో అలవోక విజయం అందుకున్నది. పూనమ్ యాదవ్ (3/42), దీప్తి శర్మ (2/27) సహా ఏక్తా బిస్త్ (3/32) మాయజాలంతో న్యూజిలాండ్ 192 పరుగులకే కుప్పకూలింది. ఛేదనలో ఓపెనర్లు స్మృతీ మంధాన (105, 104 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), జెమీమా రొడ్రిగస్ (81 నాటౌట్, 94 బంతుల్లో 9 ఫోర్లు) వీర విహారం చేయటంతో 33 ఓవర్లలోనే భారత్ లక్ష్యాన్ని చేరుకున్నది. మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. సెంచరీ స్టార్ స్మృతీ మంధాన ' ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' గా నిలిచింది.

మంధాన, జెమీమా జోరు : ఛేదనలో భారత ఓపెనర్లు రెచ్చిపోయారు. ముంబై అమ్మాయిల విధ్వంసంతో న్యూజిలాండ్ బౌలర్లు చిత్తయ్యారు. కివీస్ పేస్‌ను, స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఓపెనర్లు వేగంగా పరుగులు రాబట్టారు. లక్ష్యం చిన్నది కావటం, ఓపెనర్లు ఎదురుదాడి చేయటంతో న్యూజిలాండ్ మరింత ఒత్తిడిలో పడింది. భీకర ఫామ్‌లో ఉన్న మంధాన అదే జోరుతో చెలరేగింది. 43 బంతుల్లోనే అర్ధ సెంచరీ బాదిన స్మృతీ, 101 బంతుల్లో 8 ఫోర్లు, మూడు సిక్సర్లతో శతకం పూర్తి చేసుకున్నది. మరో ఎండ్‌లో యువ సంచలనం జెమీమా రొడ్రిగస్ కెరీర్ తొలి అర్ధ సెంచరీ సాధించింది. సహజంగా దూకుడుగా ఆడే జెమీమా, మంధానకు సహకార పాత్ర పోషించింది. స్ట్రయిక్ రొటేట్ చేస్తూనే వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదింది. 61 బంతుల్లో ఫిఫ్టీ మార్క్ అందుకున్న జెమీమా అజేయంగా 81 పరుగులు చేసింది. సెంచరీ తర్వాత ఓ బౌండరీ బాదిన మంధాన, మరో షాట్‌కు ప్రయత్నించి వికెట్ కోల్పోయింది. అప్పటికే తొలి వికెట్‌కు 190 పరుగులు జోడించిన మంధాన, జెమీమా గెలుపు లాంఛనం చేశారు. దీప్తి శర్మ (0)తో కలిసి జెమీమా లాంఛనం ముగించింది.

కివీస్‌పై స్పిన్ వల : తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్‌కు ఓపెనర్లు అదిరే ఆరంభాన్ని అందించారు. కెప్టెన్ సుజీ బేట్స్ (36), సోఫీ (28)లు తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించారు. బ్యాటింగ్ పిచ్ కావటం, కివీస్‌లో మంచి హిట్టర్లు ఉండటంతో భారీ స్కోరు ఖాయమే అనిపించింది. కానీ ఇన్నింగ్స్ 14వ ఓవర్లో మ్యాచ్ మలుపు తిరిగింది. సోఫీని రనౌట్ చేసిన దీప్తి శర్మ కివీస్ ఇన్నింగ్స్‌కు గండి కొట్టింది. ఇక అక్కడ్నుంచి కివీస్ క్రమం తప్పకుండా వికెట్లు జారవిడుచుకున్నది. మూడో స్థానంలో వచ్చిన లారెన్ (0) శరీర సమన్వయం కోల్పోగా, వికెట్ కీపర్ మెరుపు వేగంతో స్టంపౌట్ చేసింది. కొద్దిసేపటికే ఫామ్‌లో ఉన్న సుజీని సైతం దీప్తి సాగనంపింది. 61/0తో ఉన్న కివీస్ ఒక్కసారిగా 70/3తో కష్టాల్లో పడింది. మిడిల్ ఓవర్లలో లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ మాయ చేయగా, కివీస్‌కు కోలుకునే అవకాశమే చిక్కలేదు. ఏక్తా బిస్త్ సైతం వికెట్ల వేట మొదలెట్టగా.. కివీస్ పతనం వేగవంతమైంది. లోయర్ ఆర్డర్‌లో హనా రొవె (25) పోరాటంతో న్యూజిలాండ్ 192 పరుగులు చేయగల్గింది.

న్యూజిలాండ్ మహిళల ఇన్నింగ్స్: సుజీ బేట్స్ (సి) గోస్వామి (బి) దీప్తి 36, సోఫీ రనౌట్ (దీప్తి) 28, లారెన్ (స్టంప్డ్) తానియా (బి) పూనమ్ 0, ఆమీ (సి) రొడ్రిగస్ (బి) పూనమ్ 31, అమెలీ (సి) హేమలత (బి) పూనమ్ 28, మాడీ గ్రీన్ (బి) ఏక్తా 10, బెర్నాడిన్ (స్టంప్డ్) తానియా (బి) దీప్తి 9, కాస్పరెక్ (సి) తానియా (బి) ఏక్తా 6, హనా రొవె (సి) శిఖా (బి) ఏక్తా 25, హోలీ (సి) హర్మన్‌ప్రీత్ (బి) శిఖా 10, లీ తహుహు నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 05, మొత్తం : (48.4 ఓవర్లలో ఆలౌట్) 192.

వికెట్ల పతనం : 1-61, 2-68, 3-70, 4-119, 5-136, 6-140, 7-148, 8-161, 9-187, 10-192.

బౌలింగ్ : జులన్ గోస్వామి 10-0-41-0, శిఖా పాండే 7.4-1-38-1, ఏక్తా బిస్త్ 9-0-32-3, దీప్తి శర్మ 10-1-27-2, పూనమ్ యాదవ్ 10-0-42-3, హేమలత 2-0-11-0.


భారత మహిళల ఇన్నింగ్స్ : జెమీమా రొడ్రిగస్ నాటౌట్ 81, స్మృతీ మంధాన (సి) తహుహు (బి) అమెలీ ఖేర్ 105, దీప్తి శర్మ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 07, మొత్తం : (33 ఓవర్లలో వికెట్ నష్టానికి) 193.

వికెట్ల పతనం : 1-190.

బౌలింగ్ : లీ తహుహు 5-0-34-0, హనా రొవె 5-0-29-0, హోలీ 3-0-22-0, కాస్పరెక్ 7-0-37-0, అమెలీ ఖేర్ 6-0-33-1, సోఫీ 3-0-14-0, ఆమీ 4-0-22-0.



వారెవా ఒసాక



- ఫైనల్లో జపాన్ అమ్మాయి
- క్విటోవాతో టైటిల్ పోరుకు సై
- తుది సమరానికి రఫెల్ నడాల్
- ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్

మెల్‌బోర్న్ : మహిళల సింగిల్స్‌లో సెరెనా విలియమ్స్ తర్వాత మరో క్రీడాకారిణి నిలకడగా గ్రాండ్‌స్లామ్ విజయాలు సాధించలేదు. జపాన్ చిన్నది నవొమి ఒసాక మహిళల సింగిల్స్‌లో ఆ లోటును భర్తీ చేసేందుకు చకచకా అడుగులు వేస్తోంది. నిరుడు యు.ఎస్ ఓపెన్ విజేతగా నిలిచిన ఒసాక, తాజాగా ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించింది. వరుసగా రెండు గ్రాండ్‌స్లామ్ విజయాలకు అడుగు దూరంలో నిలిచింది. మహిళల సింగిల్స్‌లో చివరగా సెరెనా విలియమ్స్ 2015లో వరుసగా రెండు గ్రాండ్‌స్లామ్ విజయాలు సాధించింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో చెక్ రిపబ్లిక్ భామ కరొలినా ప్లిస్కోవాపై 6-2, 4-6, 6-4తో గెలుపొందిన నవొమి ఒసాక గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో వరుసగా 13వ విజయం సాధించింది. అనూహ్యంగా సెమీస్‌కు చేరుకున్న అమెరికా యువ క్రీడాకారిణి డానిలే రోస్ కొలిన్స్ ప్రస్థానం గురువారం ముగిసింది. పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్) 7-6(7-2), 6-0తో కొలిన్స్‌పై అలవోక విజయం సాధించింది. శనివారం జరిగే టైటిల్ పోరులో ఒసాక, క్విటోవాలో తుది సమరంలో తలపడనున్నారు. పురుషుల సింగిల్స్‌లో గ్రీస్ సంచలనానికి సెమీస్‌లో తెరపడింది. స్టెఫానొస్ సిట్సిపాస్‌పై విజయంతో స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్ ఫైనల్లోకి అడుగుపెట్టాడు. 6-2, 6-4, 6-0తో నడాల్ పదునైన ప్రదర్శన చేశాడు. నేడు టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా), లుకాస్ పౌలీ (ఫ్రాన్స్) మధ్య జరిగే మరో సెమీస్‌ఫైనల్స్ విజేతతో నడాల్ టైటిల్ కోసం పోరాడనున్నాడు.

ఒసాక అదిరెన్ : మహిళల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరెట్, టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్‌కు షాకిచ్చిన కరొలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) అదే జోరు సెమీస్‌లో చూపించలేదు. 24 గంటల వ్యవధిలోనే మళ్లీ రాకెట్ పట్టిన ప్లిస్కోవా అలసిపోయినట్టు కనిపించింది!. ప్లిస్కోవా సర్వ్‌లను బ్రేక్ చేసిన ఒసాక తొలి సెట్‌ను 6-2తో సునాయాసంగా గెల్చుకున్నది. కానీ రెండో సెట్‌లో ఒసాక వెనుకంజ వేసింది. ప్లిస్కోవా 6-4తో సెట్‌ను సొంతం చేసుకుని, మ్యాచ్‌ను నిర్ణయాత్మక సెట్‌కు తీసుకెళ్లింది. మూడో సెట్లో 4-4తో ఉన్న దశలో ఒసాక అద్భుతంగా రాణించింది. హోరాహరీ పోటీలో ప్లిస్కోవాపై కీలక గేమ్ పాయింట్లు సాధించి 6-4తో ఫైనల్లోకి ప్రవేశించింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోకి అడుగుపెట్టడం ఒసాకకు ఇదే తొలిసారి. 15 ఏస్‌లు సంధించిన ఒసాక, 56 విన్నర్లు సాధించింది. మరో సెమీస్‌లో క్విటోవా ఏకపక్ష విజయం సాధించింది. అమెరికా అమ్మాయి డానిలీ రోస్ కొలిన్స్‌ను చిత్తు చేసి 7-6(7-2), 6-0తో టైటిల్ పోరుకు చేరుకున్నది.

రఫా వచ్చేశాడు : స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్ పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి ప్రవేశించాడు. దీంతో మెల్‌బోర్న్‌లో నడాల్, జకోవిచ్ ముఖాముఖిపై విపరీతమైన ఆసక్తి నెలకొన్నది. ప్రీ క్వార్టర్స్‌లో స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్‌కు షాకిచ్చిన గ్రీస్ కుర్రాడు సిట్సిపాస్ సెమీస్‌లో స్పెయిన్ బుల్ ముందు తలొంచాడు. 6-2, 6-4, 6-0తో నడాల్ అలవోక విజయం సాధించాడు. రోజర్‌పై ఒక్కసారీ సర్వ్ కోల్పోని సిట్సిపాస్, చివరి సెట్‌లో ఒక్క సర్వ్‌నూ నిలుపుకోలేదు. ఓవరాల్‌గా 79 పాయింట్లు సాధించిన నడాల్ ఫైనల్లోకి చేరుకున్నాడు.

క్వార్టర్స్‌లో సైనా నెహ్వాల్



- సింధు, శ్రీకాంత్ కూడా..
- ఇండోనేషియా మాస్టర్స్

జకర్తా : ఇండోనేషియా మాస్టర్స్ టోర్నీలో భారత బ్యాడ్మింటన్ తారలు క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. తొలి రౌండ్లో విజయం కోసం చెమటోడ్చిన సైనా నెహ్వాల్, పి.వి సింధులు ప్రీ క్వార్టర్స్‌లో అలవోకగా నెగ్గారు. ఇండోనేషియా షట్లర్ మరిస్కపై 23-21, 21-7తో సింధు గెలుపొందగా, లోకల్ ప్లేయర్ ఫిట్రెనిపై 21-17, 21-15తో సైనా నెహ్వాల్ విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 21-14, 21-9తో జపాన్ ఆటగాడు కెంటో నిషిమోటపై పైచేయి సాధించాడు. మెన్స్ డబుల్స్‌లో మను అత్రి, సుమీత్ రెడ్డి జోడీ 14-21, 21-17, 10-21తో ఐదో సీడ్ డెన్మార్క్ జంట చేతిలో పోరాడి ఓడారు. నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్స్‌లో లోకల్ స్టార్ జొనాథన్ క్రిస్టేతో శ్రీకాంత్ సెమీస్‌లో చోటు కోసం పోరాడనున్నాడు. ప్రియ ప్రత్యర్థి కరొలినా మారిన్‌తో సింధు, థాయ్‌లాండ్ షట్లర్ పార్నపవీతో సైనా నెహ్వాల్ అమీతుమీ తేల్చుకోనున్నారు. ఇండోనేషియా మాస్టర్స్ టోర్నీలో సింధు, సైనా, శ్రీకాంత్ మినహా అన్ని విభాగాల్లో భారత క్రీడాకారులు క్వార్టర్స్‌కు ముందే నిష్క్రమించారు.

పాండ్య, రాహుల్‌లపై సస్పెన్షన్ ఎత్తివేత

- పాలకుల కమిటీ నిర్ణయం



న్యూఢిల్లీ : టెలివిజన్ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్‌లపై బీసీసీఐ నిషేధం ఎత్తివేసింది. సుప్రీంకోర్టు నియమించిన కోర్టు సహాయకారి పి.ఎస్ నరసింహ సలహా మేరకు పాలకుల కమిటీ చైర్మన్ వినోద్ రాయ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ' పాండ్య, రాహుల్‌లపై విధించిన తాత్కాలిక నిషేధాన్ని తక్షణమే ఎత్తివేస్తున్నాం. కోర్టు సహాయకారి పి.ఎస్ నరసింహతో సంప్రదించి ఈ నిర్ణయం తీసుకున్నాం. పాండ్య, రాహుల్‌లపై నిషేధం తొలగిస్తున్నాం. అంబుడ్స్‌మన్ నియామకం వాయిదా వేస్తున్నాం' అని బీసీసీఐ ప్రకటనలో తెలిపింది. టీవీ షో ప్రసారం అయిన వెంటనే ఇద్దరు క్రికెటర్లపై రెండేసి మ్యాచుల నిషేధం విధించాలని రాయ్ సూచించారు. కానీ సీవోఏ సభ్యురాలు న్యాయ సలహా సహా పాలకుల కమిటీ లేదా బీసీసీఐ ఆఫీస్ బేరర్ల చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. దీంతో ఇద్దరిపై నిషేధం విధించి, ఆస్ట్రేలియా టూర్ నుంచి స్వదేశానికి రప్పించిన సంగతి తెలిసిందే. నిషేధం ఎత్తివేయటంతో పాండ్య, రాహుల్‌లు న్యూజిలాండ్ పర్యటనలో భారత జట్టుతో కలువనున్నారని తెలుస్తోంది. దీనిపై సెలక్షన్ కమిటీ నిర్ణయం వెలువడాల్సి ఉన్నది.

నువ్వు లేని వెలితి..!

- చాహల్‌తో బౌలింగ్ బంధంపై కుల్దీప్

నేపియర్ : క్రికెట్‌లో కొన్ని కాంబినేషన్లపై అభిమానుల్లో అంచనాలు ఉంటాయి. మరికొన్ని కాంబినేషన్లపై ప్రత్యర్థి జట్లకు భయం ఉంటుంది. అలాగే సమవుజ్జీతో జట్టు కడితే కొందరికి ఊపోస్తది. సరిగ్గా అలాంటి కాంబినేషనే టీమ్ ఇండియా మణికట్టు మాయగాళ్లది. యుజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్‌లు 36 వన్డేల్లో కలిసి ఆడారు. కోహ్లికి సక్సెస్‌ఫుల్ స్పిన్ జోడీగా గుర్తింపు పొందిన చాహల్, కుల్దీప్ న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో సంయుక్తంగా ఆరు వికెట్లు పడగొట్టారు. నాలుగు వికెట్లు కూల్చిన కుల్దీప్‌ను చాహల్ ఇంటర్వ్యూ చేయగా కుల్దీప్ ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. ' మనమిద్దరం పిచ్‌తో పాటు ఒకరి బౌలింగ్‌కు ఒకరం బాగా అర్థం చేసుకుంటాం. మనమిద్దరం ఎప్పుడూ కలిసే బౌలింగ్ చేస్తామని దీనర్థం కాదు. కొన్ని సార్లు నువ్వు ముందు వేస్తావ్, నేను తర్వాత బంతి పడతాను. పిచ్ ఎలా స్పందిస్తుంది, బ్యాట్స్‌మెన్ ఎలా ఆడుతున్నాడనే విషయాలను చర్చించుకుంటాం. మనమిద్దరం ఒకే వైవిధ్యతను చూపిస్తాం, కానీ బ్యాట్స్‌మెనే తికమక పడతారు. జంటగా దక్షిణాఫ్రికాలో, భారత్‌లో ఎన్నో వికెట్లు పడగొట్టాం. ఇప్పుడు న్యూజిలాండ్‌లో చేస్తున్నాం. నువ్వు ఆడనప్పుడు, మరో ఎండ్‌లో నీవు బంతులేయనప్పుడు నేను ఎన్నో విషయాలను మిస్ అవుతున్నాను' అని కుల్దీప్ వ్యాఖ్యానించాడు.

అందని రబీ రైతుబంధు..!

84,632మంది రైతులకు తప్పని పాట్లు

పంపిణీకి నోచని రూ.80.65కోట్లు

- సగం రబీ సీజన్ పూర్తయినా చేరని సాయం
- మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించిన రైతులు



నవతెలంగాణ- ఖమ్మం ప్రతినిధి

రాష్ట్రంలో రైతుబంధు పథకం రెండో విడతకే నత్తనడక పట్టింది. రెండో విడత ప్రారంభించే నాటికి మొదటి విడత చెక్కులూ క్లియర్ కాలేదు. ఇక రెండో విడత డబ్బులను శాసన సభ ఎన్నికల ముందు హడావుడిగా రైతుల ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించినా.. ఇంతవరకూ అందరికీ అందలేదు. ఎప్పుడో రబీ పంటకు పెట్టుబడిగా అందాల్సిన నిధులు సీజన్ సగం పూర్తయినా నేటికీ అందకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో మళ్లీ వడ్డీవ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 84,632 మంది రైతులకుగాను రూ.80కోట్లకు పైగా రైతుబంధు నిధులు రైతులకు అందలేదు.

ఖమ్మం జిల్లాలో 21మండలాల్లో మొత్తం 2,69,438 మంది రైతులకుగాను రూ.266,13,77,750 నిధులు రైతుబంధు పథకం కింద రైతుల ఖాతాలకు జమకావాల్సి ఉంది. శాసనసభ ఎన్నికలకు ముందే నవంబర్‌లో ఈ నిధులు రైతులకు చెక్కుల రూపంలో అందించాల్సి ఉన్నా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున బ్రేక్ పడింది. హైకోర్టు ఆదేశాల మేరకుగాను అప్పటి ఆపద్ధర్మ ప్రభుత్వం(ప్రస్తుత ప్రభుత్వం) ఈ మొత్తాన్ని సంబంధిత రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయాలని సూచించింది. దీంతో వ్యవసాయ అధికారులు రైతుల ఖాతాలు సేకరించి జమ చేయాల్సి ఉంది. ఎన్నికలు ముగిసి నెలన్నర పూర్తయినా రైతుబంధు ఖాతాలకు జమ కాలేదు. ఇప్పటి వరకు జిల్లాలో 1,84,806 మంది రైతులకుగాను రూ.185,48,68,540 మాత్రమే పంపిణీ చేశారు. ఇంకా 84,632 మంది రైతుల ఖాతాలకు రూ.80,65,09,210 జమ చేయాల్సి ఉంది. రైతుల బ్యాంకు ఖాతాలు జమ చేయడంలోనూ, రైతుల ఖాతాలు సేకరించడంలోనూ వ్యవసాయాధికారుల అలసత్వం వల్లే ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు బ్యాంకుల చుట్టూ, రెవెన్యూ, వ్యవసాయ అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారి ప్రయివేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తెచ్చుకుంటున్నారు.

తొలివిడతలోనూ పంపిణీకి నోచని రూ.15.34కోట్లు

ప్రస్తుత రబీలో పెట్టుబడి సాయం అందక తిప్పలు పడుతున్న రైతులకు.. అంతకు ముందు ఖరీఫ్ ప్రారంభంలో ఇవ్వాల్సిన మొదటి విడత చెక్కులు కూడా జిల్లాలో భారీగానే పెండింగ్‌లో ఉన్నాయి. వ్యవసాయశాఖ జిల్లా అధికారులు వెల్లడించిన నివేదిక ప్రకారం.. తొలివిడతకు సంబంధించి వివిధ కారణాలను గుర్తించి 19,974 మంది రైతులకుగాను రూ.15,34,81,880కు సంబంధించి 20,211 చెక్కులు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ వివాదాస్పద పాస్‌బుక్స్, ఆధార్, బ్యాంక్ అకౌంట్ అనుసంధానం తదితర కారణాలతో ఈ చెక్కుల పంపిణీ ఆపేశారు.

భద్రాద్రి జిల్లాలో..

భద్రాద్రి జిల్లాలో రెండో విడతలో 1,12,114 మంది రైతులను గుర్తుంచి సుమారు రూ.140 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేసింది. అయితే 95,546 మంది రైతులకు రూ.117 కోట్లు మేర బ్యాంకు ఖాతాలల్లో జమ చేశారు. ఇంకా 156,568 మంది రైతులకు అందలేదు. వీరిలో 8వేల మంది రైతులు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు, బ్యాంకు ఖాతాలు లేకపోవడంతో పెండింగ్‌లు ఉన్నాయి. మిగతా వారికి నేటికీ బ్యాంకు ఖాతాలు లేక చెల్లింపులు జరగలేదని తెలుస్తోంది. మొదటి దఫాలో ఎన్‌ఆర్‌ఐలకు రైతుబంధు చెక్కులు నేరుగా పంపిణీ చేశారు. రెండవ దఫాలో రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బ్యాంకు ఖాతాల చెల్లింపులు చేయాలనడంతో ఎన్‌ఆర్‌ఐలుగా ఉన్న సుమారు 200 మంది రైతులకు డబ్బులు చెల్లించలేదు.

ఖమ్మం జిల్లాలో విడుదల కాని రైతుబంధు నిధుల వివరాలు..

మండలం పేరు	అందని రైతులు	నిధులు(రూ..లలో)
కామేపల్లి	3,130	3,72,34,880
ఖమ్మం (అ)	1,026	91,13, 340
రఘునాథపాలెం	7092	7,06,10,490
ఖమ్మం రూ.	4,443	4,22,05,260
కూసుమంచి	2,620	14,16,14,530
నేలకొండపల్లి	3,135	2,36,22,280
తి.పాలెం	5,651	5,65,00,910
బోనకల్	3,794	2,98,21,870
చింతకాని	4,403	4,21,02,150
మధిర	4,707	4,23,12,540
ముదిగొండ	3,683	3,42,21,370
ఎర్రుపాలెం	3,660	3,44,29,800
కల్లూరు	8,576	7,59,58,830
పెనుబల్లి	3,493	3,72,54,160
సత్తుపల్లి	4,636	4,08,76,310
తల్లాడ	3,293	3,07,57,530
వేంసూరు	7,636	7,56,82,530
ఏన్కూరు	1,729	2,07,74,990
కొణిజర్ల	3,549	3,16,19,230
సింగరేణి	2,242	3,02,33,380
వైరా	2,134	1,61,14,830

వడ్డీవ్యాపారులే దిక్కయ్యారు



ఖరీఫ్‌లో రైతుబంధు డబ్బులు ఇచ్చారు. రబీలో మాత్రం బ్యాంకుకు పంపిస్తామని ఇంతవరకూ పంపలేదు. పెట్టుబడికి వడ్డీవ్యాపారుల వద్ద అప్పు తెచ్చాం. విత్తనాలకు, ఎరువులకు, తిప్పలు పడాల్సివచ్చింది. సీజన్ సగం దాటినా రైతుబంధు నిధులు రాలేదు.

-కుమారి, మహిళారైతు

రబీ సీజన్‌లో ఇబ్బందులుపడ్డాం



ఖరీఫ్‌లో ఇచ్చినంత సులువుగా రబీలో అందించడానికి అధికారులు వెనుకాడుతున్నారు. పెట్టుబడి సాయం కింద ఇచ్చే నిధులు పంటలు పూర్తయ్యే దశకు వచ్చినా విడుదల చేయలేదు. అధికారులేమో డబ్బుల్లేవంటున్నారు. పెట్టుబడికి బ్యాంకులు ఇవ్వక, రైతుబంధు చెక్కులు అందక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది.

-చెన్నుపాటి మోహన్‌రావు, జమలాపురం

ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు జరుగుతాయి



రైతుబంధు పథకానికి సంబంధించిన నిధులు ఆన్‌లైన్‌లోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇది హైదరాబాద్ కేంద్రంగా కొనసాగుతోంది. కొంత ఆలస్యం అయిన మాట వాస్తవమే. జిల్లాకు రావాల్సిన నిధుల కోసం రైతుల ఖాతాలను ఆన్‌లైన్‌లో పంపాం. నిధులు అక్కడి నుంచే బ్యాంకు ఖాతాలకు జమ కావాల్సి ఉంది.

-ఝాన్సీలక్ష్మీకుమారి, ఖమ్మం డిఏఓ

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.